www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 13 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ పుష్య బహుళ దశమి
05-11 ఫిబ్రవరి 2024
వెల : ₹20/-



# ఆధారాలివిగో.. ఆలోచించండి!

జ్ఞానవాపి మసీదు అడుగున హిందూ దేవాలయం ఆనవాళ్లు సుస్పష్టం అంటూ సాక్షాత్తు భారత పురావస్తు పరిశోధన శాఖే కోర్టుకు తెలియచేసింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# భారత 'నారీశక్తి'కి వందనం..






















వ్యాసం 10వ పుటలో..

# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..




జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..




జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

విడి ప్రతి
రూ.20/-

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ. 624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**సూచనలు :**

- మీ చందాని చెల్లించేటప్పుడు పూర్తి చిరునామాని పిన్‌కోడ్, ఫోన్ నెం.తో సహా వ్రాయాలి.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీ ఫోన్ కి CP-JAGRIT అనే ఐ.డి.తో ఎస్.ఎమ్.ఎస్. వస్తుంది. ఆ వెంటనే పత్రిక అందుతుంది.
- పత్రిక అందకపోయినా, మీ చిరునామాలో తేడాలున్నా మీ చందా నెం. లేదా ఫోన్ నెం. వివరాలతో మా కార్యాలయానికి ఉ॥11 గంటల నుండి సా॥6 గంటల మధ్య ఫోన్ చేయగలరు.

Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad
IFSC : UTIB0002157,
PAN : AAATJ3829L

ఇతర వివరాలకు సంప్రదించండి
**సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన నాలుగు రోజులకే జ్ఞానవాపి అంశం దేశంలో చర్చనీయాంశం కావడం కేవలం యాదృచ్ఛికం. ఆ చర్చ కొనసాగేదే కూడా. భారత పురావస్తు శాఖ నివేదిక వెలువడడం, జనవరి 29న ఉత్తరాఖండ్ జ్యోతిషపీఠం శంకరాచార్యులు స్వామి అవిముక్తేశ్వరానందను జ్ఞానవాపి ప్రదక్షిణ చేయడానికి అనుమతించకపోవడం దేశంలో చర్చకు రాకుండా ఉండడం సాధ్యం కాదు. జ్ఞానవాపి హిందువులదా? ముస్లింలదా? తేల్చే అంశం కోర్టులో ఉన్నది కాబట్టి, ముందస్తు అనుమతి తీసుకోలేదు కాబట్టి స్వామి ప్రదక్షిణను అనుమతించడం లేదని పోలీసులు చెబుతున్నారు. పైగా అక్కడ 144 సెక్షన్ కూడా అమలులో ఉన్నది. అయినా ఒక మఠాధిపతికి ఇలాంటి అనుభవం ఎదురుకావడం సరైనది కాదు.

జ్ఞానవాపి ఒక బ్రహ్మాండమైన హిందూ దేవాలయం మీద కట్టిన మసీదేనని భారత పురావస్తు శాఖ ఇచ్చిన 839 పేజీల నివేదిక చెబుతున్నది. ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'జ్ఞానవాపి మసీదు' అనవద్దు, అలా పిలవడం వల్ల వివాదం పరిధి పెరిగిపోతుందని సున్నితంగా హెచ్చరించడం దేశమంతా గమనించింది.

భారత పురావస్తు శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం జ్ఞానవాపి లోపల 55 హిందూ దేవీదేవతల ప్రతిమలు లభ్యమైనాయి. వినాయకుడు, నంది, మారుతి వంటి ప్రతిమలు ఉన్నాయి. స్వస్తిక్, త్రిశూలం వంటి గుర్తులు కూడా కనిపించాయి. కొద్దినెలల క్రితమే శివలింగం బయటపడి జ్ఞానవాపి కేసు స్వరూపాన్నే మార్చి వేసింది. నమాజ్‌కు ముందు చేసే వజూ (చేతులు శుభ్రం చేసుకోవడం) దగ్గర ఈ శివలింగం ఉంది. అది ఫౌంటేన్ అని ముస్లిం వర్గాలు వాదించబోయి బొక్క బోర్లా పడ్డాయి. శివలింగం ఉన్న ప్రాంతాన్ని ఇంతకాలం వినియోగించుకున్న తీరు, ఇప్పుడు దాని మీద ముస్లిం వర్గాలు వినిపిస్తున్న వాదన రెండూ కూడా హిందువులకు అవమానకరమే.

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ పుష్య బహుళ దశమి**




6లో

ముఖపత్ర కథనం

**ఆధారాలివిగో.. ఆలోచించండి!**

అయోధ్య తరువాత కోర్టుల మీద హిందువులు ఇంకాస్త నమ్మకం పెంచుకున్నారు.జ్ఞానవాపి మసీదును సర్వే చేయించడానికి కోర్టు ఆదేశించిన తరువాత దేశంలో పలుచోట్ల మసీదుల సర్వే కోసం విన్నపాలు వెల్లువెత్తాయి. ఢిల్లీలో కుతుబ్ మీనార్ దాదాపు పాతిక హిందూ దేవాలయాలను కూల్చి కట్టినదని భారత పురావస్తు శాఖ నివేదిక ఇచ్చింది. కొద్దికాలం క్రితం మంగళూరులో ఒక మసీదును పునర్ నిర్మించడానికి కూల్చితే దాని కింద, పక్కన హిందూ ఆలయాల ఆనవాళ్లు బయట పడ్డాయి. తాజ్‌మహల్‌లో కూడా సర్వే చేయించాలని కొందరు కోరారు. అది తాజ్‌మహల్ కాదు, తేజోమహల్ అనే శివాలయమన్న వాదన ఇప్పటిది కూడా కాదు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే 140 వరకు ఇలాంటి వివాదాలు ఉన్నాయి. కానీ ముస్లింల వైఖరి ఏమిటి? కోర్టుల మాట పట్టదు. పురావస్తు శాఖ ఆధారాలు నమ్మమని చెబుతారు.

లోపలి పేజీలలో...



జాతీయం

**బిహార్‌లో ఎత్తుకు పైఎత్తు రాజకీయం**

12లో



పురస్కారం

**జననాయక్‌కు భారతరత్న**

26లో



సందేశం

**రామరాజ్య స్థాపనకు నాందీ వచనం**

34లో

# జాగృతి

## సంపాదకీయం

హిందూధర్మానికి సంబంధించిన ఇన్ని ఆనవాళ్లు ఉంటే, నిజంగానే ఆ కట్టడం నమాజ్ చేయడానికి పనికి వస్తుందా? ఈ విషయం మీద ముస్లింలలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని అనిపిస్తుంది. 29వ తేదీ రాత్రి ఒక ప్రముఖ టీవీ చానల్‌లో వచ్చిన చర్చా కార్యక్రమంలో ప్రముఖ ముస్లిం పండితుడు అతీక్ ఉర్ రహమాన్ ఒక మాట అన్నారు. తానైతే ఆ మసీదుకు పోను, నమాజ్ చేయను అన్నారాయన. కారణం ఇదే. కానీ స్థానిక ముస్లింలు అందులో నమాజ్ చేస్తున్నారు. అది ముస్లింల అధీనంలోనే ఉన్నది. జ్ఞానవాపిని మసీదు అని

## ఎక్కడ సామరస్యం?

చెప్పడానికి ఇస్లాం నిబంధనలే ఆమోదించడం లేదు. ఈ వాస్తవాన్ని ఒక పండితుడు (రహమాన్) అంగీకరించారు. అయినా హిందూ చిహ్నాలను దాచిపెట్టి, వాటిని సర్వే చేయకుండా కోర్టు కేసుల ద్వారా అడ్డుకుంటూ జాప్యం చేయడం ప్రశ్నార్థకమే. అయోధ్యలో అయిందేమిటో తెలుసు. ఇప్పుడు కాశీలో. రేపు మధురలో కూడా కావచ్చు. చారిత్రక సత్యాలను ఎక్కువ కాలం మరుగుపరచలేరు. అవి ఏదో ఒక మూల నుంచి బయటకు వస్తాయి. ఎటొచ్చీ అలాంటి ఒక సందర్భం రావాలి. కాశీలో ఇప్పుడు అలాంటి సందర్భం వచ్చి ఆధారాలు బయటపడ్డాయి. మరి ఆ కట్టడాన్ని హిందువులకు అప్పగించవచ్చు కదా అని వ్యాఖ్యాత ప్రశ్నించారు. ఈ ప్రశ్న నిర్మాణాత్మకమైనదే. అయోధ్య అనుభవాన్ని బట్టి అయినా ముస్లింలు ఆ పని చేయవచ్చు. అయోధ్య వివాదం ఐదువందల ఏళ్ల నాటిది. గడచిన మూడున్నర దశాబ్దాలుగా భారత రాజకీయ, సామాజిక వ్యవస్థలను శాసించింది. ఒక ఉద్రిక్తత వాతావరణాన్ని కాపాడుకుంటూ వచ్చింది. ఇది పునరావృతం కాకుండా నివారించడానికైనా జ్ఞానవాపిని, ఈ ఆధారాలను బట్టి హిందువుల పరం చేయవచ్చు కదా అన్నారు వ్యాఖ్యాత. అందుకు మాత్రం ఆ ముస్లిం పండితుడు జవాబు దాటవేశారు.

అయోధ్య, కాశీ, మధుర ఇవి మాత్రమే మేం కోరుతున్నాం, పెద్ద మనసు చేసుకుని, వాస్తవిక పరిస్థితులను, వర్తమాన కాలాన్నీ దృష్టిలో ఉంచుకుని ముస్లింలు ఆ పని చేస్తే మంచిదని హిందువులు చిరకాలంగా కోరుతున్నారు. జ్ఞానవాపి విషయంలో తొలిసారి విశ్వహిందూ పరిషత్ కూడా గొంతెత్తింది. ఆ ప్రాంగణాన్ని హిందువులకు అప్పగించాలని కోరింది. ఈ దృక్పథం నుంచి హిందువులు, ముస్లింల మధ్య చర్చ ప్రారంభం కావడమే మంచిది. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడానికి బొత్తిగా ఇష్టపడని మతోన్మాదం, మొగలుల కాలం నాటి ఆధిక్యతనే ఇప్పటికీ కోరుకుంటున్న ఆధిపత్య ధోరణి జడలు విప్పరాదు. అయినా అందుకు సంబంధించిన జాడలు అప్పుడే కనిపిస్తున్నాయి. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠకు హాజరైనందుకు భారత ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు ఇల్యాసీ మీద ఫత్వా జారీ చేసి ఒక అవాంఛనీయ వాతావరణానికి తెర తీశారు. భారత పురావస్తు శాఖ నివేదికను కూడా కొట్టిపారేసేందుకు ఎంఐఎం నాయకుడు ఒవైసీ తహతహ లాడుతున్నారు. ఇలాంటి గొంతులు బలపడక ముందే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావడం అవసరం. ఎందుకంటే ఈ దేశంలో అన్ని వర్గాలు సయోధ్యతో, సామరస్యంతో జీవించవలసి ఉందనేదే పరమ సత్యం. వాస్తవిక దృష్టి. అయితే అది మెజారిటీ ప్రజల బాధ్యత మాత్రమే కాదు. ఇన్ని సాక్ష్యాధారాలు బయటపడిన తరువాత కోర్టులు ఎలాంటి తీర్పును ఇస్తాయో ఊహించవచ్చు. ప్రతి మసీదులోను శివలింగాలు వెతికే ప్రయత్నం చేయరాదని ఇప్పటికే హిందువులు భావిస్తున్నారు. కాబట్టి వారు న్యాయంగా కోరుతున్న మూడు మహా పుణ్యక్షేత్రాలను సగౌరవంగా అప్పగిస్తే దేశ చరిత్రలో అదొక మహోన్నత ఘట్టమే అవుతుంది. ★

05 ఫిబ్రవరి 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**నులకమంచం!**

– రాయప్రోలు వెంకటరమణశాస్త్రి





ప్రత్యేకాధికారులకు 'గ్రామ' పగ్గాలు (తెలంగాణ) – 14
వైసీపీ పాలనలో బీసీలే బాధితులు..! (ఆంధ్రప్రదేశ్) – 16
స్వధర్మే నిధనం (కథ) – చంద్రమౌళి రామనాథశర్మ – 20
శీతల్... సవాల్ (మహిళ) – 22
ఉద్యోగం వీడి.. ఉలి పట్టి (మనకాలపు జక్కన్న) – 28
జిహాదీ మనస్తత్వం వీడరా? (చర్చ) – 32
'ఖేల్‌రత్నం' తెలుగుతేజం! (క్రీడ) – 43
సినీ కొలనులో విరిసిన పద్మాలు! (సినిమా) – 50



'జ్ఞానవాపి అడుగున భారీ ఆలయం ఆనవాళ్లు. దేవనాగరి, తెలుగు, కన్నడ భాషల్లో శాసనాలు. ఈ శాసనాల్లో జనార్దన, రుద్ర, ఉమేశ్వర వంటి దేవతల పేర్లు.'

జ్ఞానవాపి మసీదుగా పిలుస్తున్న ఆ కట్టడం హిందూ దేవాలయాన్ని కూల్చి, ఆ శిథిలాల మీద కట్టినదేనని అందరికీ తెలుసు. కానీ హిందువులు సహనశీలురు. శాస్త్రీయంగా చారిత్రక మూలాలను వెలికి తీయగలిగే భారత పురావస్తు పరిశోధన శాఖ, న్యాయ వ్యవస్థ ఇచ్చిన నివేదికలు, తీర్పుల ఆధారంగా మాత్రమే దానిని తమ పరం చేసుకోవాలని అనుకుంటున్నారు. దాదాపు 1990లో ప్రారంభమైన ఈ న్యాయపోరాటం ఇప్పటికీ కొనసాగుతున్నది.

# ఆధారాలివిగో..

అంటే మూడున్నర దశాబ్దాల పోరాటం. ఎన్ని ప్రబల సాక్ష్యాలు ఉన్నా వాటిని నిరాకరిస్తూ, కోర్టులకు వెళుతూ వివాదాన్ని నాన్చే ప్రక్రియనే ముస్లిం వైపు పక్షాలు అనుసరిస్తున్న మాట కూడా వాస్తవం. కోర్టులకు వెళ్లి అయోధ్య విషయంలో జరిగింది కూడా అదే. కానీ అయోధ్యకీ, వారణాసికీ పోలిక ఇంతవరకే. 2019లో సుప్రీంకోర్టు అయోధ్య వివాదాస్పద స్థలం హిందువులదేనని తీర్పు ఇచ్చింది. ఈ సంవత్సరం జనవరి 22న అక్కడ ఆలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కూడా పూర్తయింది. అయోధ్య, కాశీ, మధుర తమ పరం కావాలన్నదే హిందువుల అభిమతం. వాటి మీద జరుగుతున్న న్యాయ, ఆధ్యాత్మిక పోరాటాలు ఒక ప్రణాళికతో మొదలుపెట్టి జరుగుతున్నవి మాత్రం కావు. ఆయా ప్రాంత పోరాటం ఆ ప్రాంతం వారిదే. వారందరిని నడిపిస్తున్నది మాత్రం హిందూధర్మం విషయంలో చరిత్రలో జరిగిన ఘోర తప్పిదాలను సరిచేసుకోవాలన్న ఏకాత్మ సూత్రమే.

## పురావస్తు శాఖ నివేదిక

జ్ఞానవాపి మసీదు ప్రాంగణం స్థానంలో భారీ హిందూ ఆలయ నిర్మాణం ఉండేదని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నివేదిక స్పష్టం చేసింది. హిందూ పక్షం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ జనవరి

# ఆలోచించండి!

**జనవరి 26, 2024న అన్ని పత్రికలలోను ప్రముఖంగా వెలువడిన వార్త ఇది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, వారణాసిలో జ్ఞానవాపి మసీదుగా పిలుస్తున్న, ముస్లింలు నమాజ్ చేసుకుంటున్న కట్టడం నిజంగా ఎవరిదో, దాని చరిత్ర ఏమిటో నిగ్గు తేల్చాలంటూ మొదలైన న్యాయపోరాటం ఇప్పుడు పరాకాష్ఠకు చేరుకుంది. జ్ఞానవాపి మసీదు అడుగున హిందూ దేవాలయం ఆనవాళ్లు సుస్పష్టం అంటూ సాక్షాత్తు భారత పురావస్తు పరిశోధన శాఖే కోర్టుకు తెలియచేసింది. కోర్టు కక్షిదారుల న్యాయవాదులకు అందించింది. ఆ అంశాలను హిందూపక్షం న్యాయవాది విష్ణుశంకర్ జైన్ పత్రికలకు వెల్లడించారు. ఇదొక చిదంబర రహస్యం మాత్రమే. 839 పేజీల పురావస్తు శాఖ జ్ఞానవాపి మసీదు హిందూ కట్టడాన్ని కూల్చి కట్టినదేనని బల్లగుద్ది చెప్పింది. జ్ఞానవాపి న్యాయపోరాటం కూడా శతాబ్దాల నాటిది. 1937లోనే ఈ వివాదం కోర్టు ముందుకు చేరింది. జ్ఞానవాపి అంటే జ్ఞానపు బావి. ఇప్పుడు చారిత్రక జ్ఞానాన్ని తోడిస్తున్న బావిగా కనిపిస్తున్నది.**

24న వారణాసిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఏఎస్ఐ నివేదికలోని అంశాలను చదివి వినిపించారు. గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేలో వెల్లడైన అంశాలు కూడా ఈ నివేదికలో ఉన్నాయి. మసీదులో చేసిన మార్పులను ఈ సర్వే గుర్తించింది. పూర్వమున్న స్తంభాలను, ప్లాస్టర్‌తో చిన్న చిన్న మార్పులతో తిరిగి ఉపయోగించినట్లు కనిపిస్తున్నాయి. హిందూ ఆలయం నుంచి తీసుకున్న కొన్ని స్తంభాలను కొద్దిగా మార్చి వేసి కొత్త నిర్మాణంలో ఉపయోగించారు. స్తంభాలపై ఉన్న చెక్కడాలను తొలగించే ప్రయత్నం చేశారు. దేవనాగరి, తెలుగు, కన్నడ, ఇతర లిపిలలో వేయించిన మొత్తం 34 శాసనాలు ప్రస్తుత, పూర్వపు నిర్మాణాలపై ఉన్నాయి. ఇవన్నీ పూర్వం ఉన్న హిందూ దేవాలయంలో ఉన్న శాసనాలు. ఇవే ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోనూ మరమ్మతుల సమయంలో ఉపయోగించారు. దీనిని బట్టి పూర్వం అక్కడ ఉన్న హిందూ ఆలయాన్ని ధ్వంసం చేసి, దానికి సంబంధించిన భాగాలను తిరిగి వాడినట్లుగా రుజువవుతోంది. ఈ శాసనాల్లో జనార్దన, రుద్ర, ఉమేశ్వర వంటి దేవతల పేర్లు కూడా ఉన్నాయి.

తమ చుట్టూ నిర్మించిన అబద్ధాల కోటలను ఛేదించుకుని చారిత్రకసత్యాలు నేరుగా న్యాయస్థానాల ముంగిట నిలబడడం ఇవాల్టి పరిణామం. ఈ మహా యజ్ఞమే సరికాదంటున్నాయి ఉదారవాద, వామపక్ష శక్తులు. అబద్ధాల కింద, వక్రభాష్యాల చాటున ఉండిపోయిన చరిత్రను ప్రపంచానికి తెలియనీయడం దేశానికి శ్రేయస్కరం కాదట. మత సామరస్యానికి విఘాతమట. దానర్థం హిందువులు రాజీ పడాలనే. మసీదుల కింద మగ్గుతున్న ఆలయాలు వెలుగు చూడకూడదనే. విదేశీ దురాక్రమణదారులు హిందూధర్మాన్ని నాశనం చేసి, ఆలయాలను నేలకూల్చిన మాట నిజమే కావచ్చు. కానీ దానిని మరచిపోవడం భవిష్యత్తుకు మంచిదన్నది సెక్యులరిస్టుల సూత్రీకరణ. వందా రెండు వందలా! 40,000 మసీదుల కింద ఉన్న దేవాలయాలను వెనక్కి ఇమ్మని కోరడం అంటే మైనారిటీల మనసుకు కష్టం కలుగుతుంది కదా పాపం అంటున్నారు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, స్వయం ప్రకటిత మేధావులు. ఫలితం ఏమిటి? జ్ఞానవాపి విషయంలోను ముస్లిం మతోన్మాదులు, ఆధిపత్య భావనను వీడని వాళ్లు భారత పురావస్తు శాఖ నివేదికను సైతం తప్పుల తడకగా చెప్పడానికి వెనుకాడడం లేదు. ఆ విధంగా పరోక్షంగా కోర్టులను కూడా అవమానిస్తున్నారు.

## జ్ఞానవాపి ఉనికి ఎలాంటిది?

వారణాసిలో పురాణ ప్రసిద్ధమైన విశ్వనాథుని మందిరాన్ని కబళిస్తున్నట్టే ఉంటుంది జ్ఞాన్‌వాపి మసీదు. మసీదులో హిందూ ఆనవాళ్లు తిరుగులేని సత్యమని హిందువుల వాదన. ఒక సుదీర్ఘ న్యాయ పోరాటం తరువాత మే 19, 2022న వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశంతో ఈ మసీదు లోపలి భాగాలను వీడియో సర్వే చేసి, కోర్టుకు సమర్పించారు. కోర్టు నియమించిన ప్రత్యేక సహాయ కమిషనర్ ఈ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య తరువాత హిందువులు చేస్తున్న మరొక ఆత్మగౌరవ ప్రకటనగా ఇప్పుడు అంతా భావిస్తున్న ఈ సర్వే కార్యక్రమం ఐదుగురు సాధారణ గృహిణులు కోర్టుకు చేసుకున్న విన్నపం మేరకు పునఃప్రారంభమైంది. వీరంతా ఏ రాజకీయ దురుద్దేశాలు లేకుండా కేవలం ధార్మిక దృష్టితో తమ మత హక్కును నిలబెట్టి న్యాయం చేయవలసిందని కోర్టును అర్థించారు. జ్ఞానవాపి గోడను ఆనుకుని ఉన్న శృంగార గౌరీ అమ్మవారికి నిత్యం పూజలు చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నదే ఆ విన్నపం అసలు ఉద్దేశం. తీరా తీగ లాగితే చరిత్ర డొంకంతా కదిలినట్టయింది. శృంగార గౌరీ నిత్య ఆరాధన అంశం 40,000 మసీదుల కింద ఉన్న పవిత్ర దేవాలయాల శిథిలాలకు గొంతును ఇచ్చింది. ఇది జ్ఞానవాపి మసీదు మీద తమకు ఉన్న హక్కు గురించి హిందువులు సాగిస్తున్న న్యాయ పోరాట స్వరూపం.

## న్యాయపోరాటం

వారణాసి మాత్రమే కాదు, అయోధ్య, మథుర – ఈ మూడు పరమ పవిత్ర క్షేత్రాల మీద హిందువులు తమ హక్కును నిరూపించుకోవడానికి న్యాయస్థానాలనే ఆశ్రయించారు. దశాబ్దాలు, శతాబ్దాలు నిరీక్షించారు. అయోధ్య ఉద్యమం తారస్థాయిలో ఉన్నప్పుడే 1991లో, అంటే అయోధ్యలో వివాదాస్పద కట్టడం కూలడానికి ఒక సంవత్సరం ముందే వారణాసికి చెందిన కొందరు అర్చక స్వాములు అక్కడి జిల్లా న్యాయస్థానంలో ఒక పిటిషన్ దాఖలు చేశారు. మసీదు ప్రాంగణంలో ఉన్న హిందూ దేవుళ్లకు నిత్యపూజలకు అనుమతించాలన్నదే వారి విన్నపం. కానీ వారణాసి కోర్టులో జరుగుతున్న విచారణను మూడు దశాబ్దాల తరువాత అలహాబాద్ హైకోర్టు 2021లో నిలిపివేసింది. 17వ శతాబ్దంలో



న్యాయవాదులు హరివిష్ణు జైన్, హరిశంకర్ జైన్

# 1236 నుంచి 2024 వరకు

జ్ఞానవాపి మసీదు హిందూ దేవాలయం స్థానంలో కట్టినదేనని అంతా విశ్వసించక తప్పడం లేదు. జ్ఞానవాపి మసీదులో ఉన్నట్టు చెబుతున్న హిందూ దేవాలయ ఆనవాళ్లలో ఇవి ఐదు శాతం కూడా కాదు. నమాజ్‌కు ముందు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునే చోటు (వజూఖానా) శివలింగం ఉంది. మసీదులో ఉన్నట్టు చెబుతున్న హిందూ దేవుళ్ల ప్రతిమల పట్ల హిందువులు సహజంగానే ఆసక్తిని పెంచుకున్నారు. అసలు ఈ వివాదం ఎప్పటిది?

1236లో విశ్వనాథ మందిరాన్ని అవిముక్తేశ్వరాలయం పేరుతో పునర్ నిర్మించారు. బానిసరాజుల కాలంలోనే దీని మీద దాడులు జరిగాయి.

1669లో ఔరంగజేబు ఆజ్ఞతో ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారు.

**1937:** 1937లో అలహాబాద్ హైకోర్టు ఈ వివాదానికి సంబంధించి ఒక డిక్రీ ఇచ్చింది. ఇది దీన్ మహమ్మద్ వర్సెస్ రాష్ట్ర కార్యదర్శి కేసుగా ప్రసిద్ధి గాంచింది. దీని ప్రకారం జ్ఞాన్‌వాపిని వక్ఫ్ బోర్డు ఆస్తిగాను, మసీదు కింది భాగం వ్యాస్ కుటుంబీకులకు చెందినదిగాను ఆ డిక్రీ ప్రకటించింది.

**1991:** అయోధ్య వివాదం తారస్థాయికి చేరిన దశలో పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రార్థనాస్థలాల (స్పెషల్ ప్రావిజన్స్) చట్టాన్ని తీసుకువచ్చింది. అయోధ్యలోని రామజన్మ భూమి తప్ప దేశంలోని మిగిలిన అన్ని ప్రార్థనా స్థలాల విషయంలో ఆగస్ట్ 15,1947 నాటి స్థితిని యథాతథంగా కొనసాగించాలి. ఈ చట్టాన్ని చూపుతూ శృంగార గౌరీ మాత పూజకు అనుమతించాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని ముస్లింలు వారణాసి కోర్టుకు వెళ్లారు. అసదుద్దీన్ ఒవైసీ ఈ ఒక్క చట్టాన్ని అడ్డం పెట్టుకునే మొత్తం వ్యవహారం నడుపుదామని అనుకుంటున్నారు. అసలు ఈ చట్టాన్ని తొలగిస్తే సమస్య తీరుతుందని పలువురి వాదన.

**అక్టోబర్ 15, 1991:** జ్ఞాన్‌వాపిలో కొత్త ఆలయాన్ని నిర్మించుకుని, అక్కడ పూజాదికాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ పండిట్ సోమ్‌నాథ్ వ్యాస్, డాక్టర్ రామ్‌రంగ్ శర్మ వారణాసి కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసును జిల్లా జడ్జీ ఆగస్ట్ 13, 1998కి వాయిదా వేశారు. అయితే వారణాసి కోర్టు ఆదేశాల మీద అలహాబాద్ హైకోర్టు స్టే విధించింది.


మసీదులో దొరికిన శివలింగం

**మార్చి 2000:** సోమ్‌నాథ్ వ్యాస్ మరణించారు. దీనితో ఆ కేసును నిర్వహించే బాధ్యతను 2018లో న్యాయస్థానం న్యాయవాది విజయ్‌శంకర్ రస్తోగికి అప్పగించింది. తరువాత రస్తోగి జ్ఞాన్‌వాపిలో సర్వే నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కేసును కోర్టు స్వీకరించడంతోనే జ్ఞానవాపి మసీదు నిర్వాహకులు సర్వేకు వ్యతిరేకంగా కేసు వేశారు.

**ఆగస్ట్ 18, 2021:** జ్ఞానవాపి గోడకు ఉన్న శృంగార గౌరీమాతనే కాకుండా అక్కడ మిగిలి ఉన్న హిందూ దేవతా ప్రతిమలకు పూజలు చేసేందుకు అనుమతించాలని కోరుతూ ఐదుగురు మహిళలు వారణాసి కోర్టును ఆశ్రయించారు. దీని ప్రాతిపదికగా మసీదులో సర్వే జరిపించాలని ఏప్రిల్ 26, 2022న కోర్టు ఆదేశించింది. మొదట ముస్లింలు ఇందుకు అంగీకరించక పోయినా తరువాత వెనక్కి తగ్గారు. ఎట్టకేలకు మే 14-16 తేదీలలో సర్వే పూర్తయింది.

**మే 16:** శివలింగం ఆకృతి బయటపడిందని ఆరోజు వెల్లడైంది. కానీ ఇది వజూఖానాలో ఏర్పాటు చేసిన ఫౌంటేన్ అని ముస్లింలు వాదించారు. దీనితో శివలింగం ఉన్న ప్రాంతానికి సీలు వేయవలసిందిగా వారణాసి కోర్టు ఆదేశించింది. మే 17న సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను చేపట్టింది.మసీదులో దొరికిన శివలింగం ప్రస్తుతం ముస్లింల అధీనంలోనే ఉందని, ఆకృతిని మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని హిందువుల తరఫు న్యాయవాది విష్ణు జైన్ కోర్టులో ఫిర్యాదు చేశారు. అది శివలింగం కాదని, అది ఫౌంటేన్ అని చెప్పడానికి 60 సెంటీమీటర్ల రంధ్రం చేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ ఉంది.

**జనవరి 25, 2024:** హిందూ ఆలయాన్ని కూల్చి దానిపైనే మసీదు నిర్మించారని భారత పురావస్తు శాఖ నివేదికలో తేలింది. ★

ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారన్న ఆరోపణలో నిజమెంతో తేల్చడానికి తలపెట్టిన సర్వేను కూడా సస్పెండ్ చేసింది. ఇంకోపక్క, ఇలా సర్వే చేయించడం జూలై 11,1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించింది. ఈ చట్టం ప్రకారం 1947 నాటికి ఆలయాలు ఏ స్థితిలో ఉన్నాయో అదే స్థితిని కొనసాగించాలి. ఇలా వివాదాన్ని త్రిశంకు స్వర్గంలో వదిలివేసిన సమయంలోనే మరొక పరిణామం జరిగింది. ఐదుగురు హిందూ సోదరీమణుల ద్వారా కేసు మళ్లీ పట్టాలెక్కింది. అంతకుముందే ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య, వాస్తవం మీద ముసుగును ఈ సర్వే తొలగిస్తుందని ప్రకటించి, దేశప్రజల దృష్టిని ఈ అంశం మీదకు మళ్లించారు. ఇక్కడొక విషయం గుర్తు చేసుకోవాలి. 1991 నాటి ప్రార్థనాస్థలాల పరిరక్షణ చట్టం చెల్లుబాటును పరిశీలించ వలసిందేనని 2021 మార్చిలో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే ధర్మాసనం ప్రకటించింది. సాక్ష్యాలు పరిపూర్ణంగా ఉన్నప్పుడు ఒక కట్టడం మూలరూపాన్ని నిరాకరించడం తగదని చాలా మంది న్యాయ నిపుణులు అభిప్రాయ పడ్డారు కూడా.

**నడుం కట్టిన మహిళాలోకం**

జ్ఞానవాపి గోడల మీద కనిపించే హిందూ దేవతా మూర్తులను నిత్యం పూజించుకోవడానికి అనుమతి మంజూరు చేయించవలసిందిగా ఢిల్లీలో ఉండే ఆ ఐదుగురు మహిళల విన్నపం. వీడియో సర్వే నిర్వహించి మే 10, 2022కు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ సర్వే జ్ఞానవాపి-శృంగార గౌరీ అమ్మవారి ప్రతిమ ఉన్న ప్రాంతంలో చేయాలి. కానీ కోర్టు ఆదేశాలను మొదట మసీదు నిర్వహణ సంఘం అనుమతించలేదు. కోర్టు నియమించిన కమిషనర్ అజయ్‌కుమార్ మిశ్రాకు పక్షపాత దృష్టి ఉందని, కాబట్టి వేరే కమిషనర్‌ను నియమించాలని కోరింది. ఆ విన్నపాన్ని కోర్టు పట్టించుకోలేదు. ప్రాథమిక సర్వే నిర్వహించిన మిశ్రా కొన్ని అంశాలను మీడియాకు వెల్లడించారన్న ఆరోపణతో ఆయనను తరువాత తొలగించవలసి వచ్చింది. మిశ్రా స్థానంలో విశాల్‌సింగ్‌ను నియమించారు. మే 17, 2022కు సర్వే పూర్తి చేయాలని మే 12న ఆదేశించింది. మే 13న అంజు మన్ ఇంతేజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టుకు వెళ్లి, సర్వే మీద స్టే కోరింది. కమిటీకి చుక్కెదురైంది. 14వ తేదీన సర్వే మొదలయింది. మొదటి రోజున నాలుగు గదులలో సర్వే జరిగింది. ఇందులో మూడు ముస్లింలవి, ఒకటి హిందువులది. రెండో రోజు సర్వేలోనే హిందూ

ఆలయం ధ్వంసం చేసినట్టుగా చెప్పే ఆనవాళ్లు దొరికాయి. అంటే ఆనాడే అది హిందూ దేవాలయ మని రుజువైంది. మే 16న సర్వే పూర్తయింది. అప్పుడే హిందువుల తరఫున వాదిస్తున్న ఒక న్యాయవాది వజూఖానాలో శివలింగం ఉన్నట్టు బయటకు చెప్పారు. వెంటనే సుప్రీంకోర్టు ముస్లింల ప్రార్థనలకు అడ్డు లేకుండా, శివలింగం ఉన్న ప్రదేశాన్ని సీజ్ చేయవలసిందని ఆదేశాలు ఇచ్చింది. ఇది హిందువుల మనోబలాన్ని పెంచింది.

అయోధ్య, కాశీ, మధుర మాత్రమే కాదు, ఈ దేశంలో దాదాపు నలభయ్ వేల మసీదులు అలా హిందువుల ఆత్మగౌరవాన్ని తొక్కుతూ నిలబడినవే. సాకి మస్తాయిద్ ఖాన్ రాసిన 'మాసీర్ ఇ అలంగిరి' అనే గ్రంథం ఉంది. ఔరంగజేబ్ పాలనా కాలం మీద వ్యాఖ్యానం వంటి చరిత్ర గ్రంథం. ఇది కాశీ ఆలయం గురించి ప్రస్తావించింది. పర్షియా భాషలో ఉన్న ఈ గ్రంథాన్ని ప్రముఖ చరిత్రకారుడు జదునాథ్ సర్కార్ అనువదించారు. ఆ పని బీజేపీ చేయించిందనుకుంటే పొరపాటు. బ్రిటిష్ ఇండియా కాలంలోనే సర్కార్ అనువదించారు. 'మాసీర్ ఇ అలంగిరి' చెబుతున్నదాని ప్రకారం పాదుషా ఆజ్ఞ మేరకు సెప్టెంబర్ 2,1669న మొగలాయిల అధికారులు విశ్వనాథుని ఆలయాన్ని నేలకూల్చారు.

రుజువులే ఒక ప్రార్థనాస్థలం ఎవరిదో చెబుతాయనుకుంటే వర్తమానకాలంలో జరిగిన దేమిటో కూడా చూడాలి. మే 19, 2022వ తేదీన కోర్టుకు సర్వే నివేదిక అందింది. మసీదు లోపల సనాతన ధర్మానికి చెందిన డమరుకం, త్రిశూలం, కమలం కనిపించాయి. మొదటిగా సర్వే నిర్వహించిన మిశ్రా కూడా పగిలిన హిందూ దేవతాప్రతిమలు మసీదులో ఉన్నాయని నమోదు చేశారు. అవి శేషుదు, దీపం. కానీ మసీదులోని వజూఖానాలో దొరికిన శివలింగాన్ని ఫౌంటేన్‌గా నమ్మించడానికి ముస్లింలు శతవిధాల ప్రయత్నించినా దానిని దేశం నమ్మలేదు.

ఇందుకు సంబంధించి కొన్ని అంతర్జాతీయ ఆధారాల గురించి చూద్దాం. అబుల్ ఫజల్ రాసిన 'అల్ బేహకి' గ్రంథం ప్రకారం భారత్‌లో గజనీ తరఫు పాలకునిగా ఉన్న అహ్మద్ నియాల్‌తిగిన్ క్రీస్తుశకం 1033లో ఆ పవిత్ర నగరాన్ని దోచుకున్నాడు. ఉదయం పూట ప్రార్థన సమయంలో మొదలైన దోపిడీ మధ్యాహ్న ప్రార్థనల దాకా సాగిందట. కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని ఔరంగజేబ్ కూల్చాడని చెబుతూ ప్రపంచ ప్రఖ్యాత ఇండాలజిస్ట్ జేమ్స్ ప్రిన్సెప్ చూపించిన సాక్ష్యాలు ఉన్నాయి. అయినా ముస్లింలు తమ పూర్వీకుల దురాక్రమణల మీద తమకే హక్కు ఉండాలనీ, అవి అలాగే ఉండాలని, దురాక్రమణతో కట్టిన మసీదులే అయినా అవి హిందూ ఆలయాల కంటే పవిత్రమైనవనీ చెబుతున్నట్టే ఉంది. పైగా ఒకసారి ముస్లింల అధీనంలోకి వచ్చిన స్థలం లేదా కట్టడం సూర్యచంద్రులు ఉన్నంత వరకు ముస్లింలకే అంటే తమ దైవానికే చెందుతాయని వాదిస్తున్నారు. నిజానికి ఇదే అసలు సమస్య. జ్ఞానవాపి సర్వేకు అనుమతి ఇచ్చిన నాడే, 'మేం ఒక్క మసీదును కూడా వదిలిపెట్టబోమ'ని అసదుద్దీన్ ఒవైసీ యుద్ధభేరీ మోగించారు. గతంలో చట్టవిరుద్ధంగా అయోధ్యను (అది సుప్రీంకోర్టు తీర్పు కదా!) లాక్కున్నా, మరొక మసీదు ఏదీ అప్పగించడానికి సిద్ధంగా లేమని ముస్లింలు అంటున్నారు. తాజాగా పురావస్తు శాఖ ఇచ్చిన నివేదిక విషయంలో కూడా ఆయన ఇదే మాట్లాడారు. అది అభిప్రాయమే తప్ప, ఆధారం కాదని ఈయన తేల్చేశారు.

అయోధ్య తరువాత కోర్టుల మీద హిందువులు ఇంకాస్త నమ్మకం పెంచుకున్నారు. జ్ఞానవాపి మసీదును సర్వే చేయించడానికి కోర్టు ఆదేశించిన తరువాత దేశంలో పలుచోట్ల మసీదుల సర్వే కోసం విన్నపాలు వెల్లువెత్తాయి. ఢిల్లీలో కుతుబ్ మీనార్ దాదాపు పాతిక హిందూ దేవాలయాలను కూల్చి కట్టినదని భారత పురావస్తు శాఖ నివేదిక ఇచ్చింది. కొద్దికాలం క్రితం మంగళూరులో ఒక మసీదును పునర్ నిర్మించడానికి కూల్చితే దాని కింద, పక్కన హిందూ ఆలయాల ఆనవాళ్లు బయటపడ్డాయి. తాజ్‌మహల్‌లో కూడా సర్వే చేయించాలని కొందరు కోరారు. అది తాజ్‌మహల్ కాదు, తేజోమహల్ అనే శివాలయమన్న వాదన ఇప్పటిది కూడా కాదు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే 140 వరకు ఇలాంటి వివాదాలు ఉన్నాయి. కానీ ముస్లింల వైఖరి ఏమిటి? కోర్టుల మాట పట్టదు. పురావస్తు శాఖ ఆధారాలు నమ్మమని చెబుతారు.

ఇప్పుడు హిందువులు మసీదు భూగృహంలోని పది ప్రాంతాల మీద కూడా సర్వే జరపాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది తప్పదు. హిందూ ఆలయాలుగా చెప్పే ఎన్ని ఆధారాలు ఉన్నా ఒక్క మసీదును కూడా వదలబోమని మొండిగా వాదిస్తున్న వర్గంతో హిందువులు తలొంచుకుని రాజీకి రావాలని మేధావులు, సెక్యులరిస్టులు ఎలా కోరతారు? కాబట్టి కోర్టుల నిర్ణయమే తుది నిర్ణయం కావాలి.

**– జాగృతి డెస్క్**



శృంగార గౌరీ మాత పూజలకోసం కోర్టును ఆశ్రయించిన మహిళలు

## మసీదు అని పిలవవద్దు: యోగి ఆదిత్యనాథ్



వారణాసిలో విశ్వేశ్వరుని మందిరం పక్కనే కట్టడాన్ని కేవలం జ్ఞానవాపి అని మాత్రమే పిలవాలని, మసీదు అని పిలవరాదని, అలా పిలిస్తే వివాదం విస్తరిస్తుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆగస్ట్ 1,2023న ఒక ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం. సర్వే గురించి అలహాబాద్ హైకోర్టు తన నిర్ణయాన్ని మూడు రోజుల్లో ప్రకటించవలసి ఉండగా యోగి ఈ ప్రకటన చేశారు. తగినన్ని చారిత్రక ఆధారాలు ఉన్నాయి కాబట్టి కోర్టు సరైన తీర్పు ఇస్తుందనే భావిస్తున్నట్టు కూడా వ్యాఖ్యానించారు. పాత తప్పులు మరొకసారి చేయరాదని ముస్లింలకు ఆయన పిలుపునిచ్చారు. లోపల త్రిశూలం ఎందుకు ఉందని ఆయన ప్రశ్నించారు (గుర్తు). తామెవ్వరం ఆ గుర్తును లోపల వేయలేదని కూడా అన్నారు. అప్పుడు కొందరు హిందూ చిహ్నాలు కొందరి కుట్ర అన్న వాదం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో అయోధ్య విషయంలో చరిత్రకారులు వాదించిన సంగతి గుర్తుండే ఉంటుంది. జ్ఞానవాపి కేంద్ర బలగాల అధీనంలో ఉంటుంది. ముతావలి ఉంటాడు. కాబట్టి లోపలికి ఎవరైనా ఇతరులు ఎలా వెళతారని యోగి ప్రశ్నించారు. అమ్మవారి విగ్రహం బయట ఉంది. లోపలి జ్యోతిర్లింగం దొరికింది. గోడల మీద అమ్మవార్ల బొమ్మలు ఉన్నాయి. హిందూ గుర్తులు ఉన్నాయి. ఇంకా ఎందుకు అంధత్వం నటించాలని ఆయన వ్యాఖ్యానించారు.



భారతదేశం అత్యంత సంప్రదాయక దేశమని, మహిళలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవని, వారు అణచివేతకు గురయ్యే వర్గాల కిందకు వస్తారని ప్రచారం చేస్తారు. అలాంటి వారికి ఇక్కడి ఉదారవాదులు కూడా చేతనైన సాయం చేస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అలాంటి ప్రచారాలను పటాపంచలు చేస్తూ, ఇది ఝాన్సీ లక్ష్మీబాయి, రాణీ అబ్బక్క రుద్రమ దేవి పోరాడిన గడ్డ అని గుర్తు చేస్తూ ఈసారి గణతంత్ర వేడుకలు జరిగాయి. ప్రపంచానికి స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని ఇచ్చింది తామేననే భావనతో ఉండే ఫ్రెంచి దేశ అధ్యక్షుడు ఇమాన్యువల్ మాక్రోన్ ఎదుట భారత మహిళలు ఆ భ్రమలను పటాపంచలు చేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో కలసి ఆయన ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేడుకలలో మరొక విశేషం, దాదాపు నలభై ఏళ్ల తర్వాత 'సంప్రదాయ బగ్గీ'లో రాష్ట్రపతి ముర్ము, ఫ్రెంచి అధ్యక్షుడితో కలసి కర్తవ్యపథ్‌కు విచ్చేయడం.

# 'నారీశక్తి' విశ్వరూపాన్ని ప్రదర్శించిన
# 75వ గణతంత్ర వేడుకలు

చారిత్రిక 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో తొలిసారి మహిళా శక్తికి సంకేతంగా 'ఆవాహన్' పేరుతో పలు భారతీయ సంగీత వాద్యాలను వాయిస్తూ 112మంది మహిళా కళాకారులు కవాతు చేసి, విశిష్ట వేడుక ప్రారంభానికి తగిన వాతావరణాన్ని ఏర్పరిచారు. తొలిసారి మొత్తం మహిళా సైనికులతో కూడిన దళం సగర్వంగా కర్తవ్యపథ్‌పై కవాతు చేయడం ద్వారా ఈ మొత్తం వేడుకలకు కేంద్రం అయ్యారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికత 'వికసిత భారత్'కు దోహదం చేస్తూ కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకలు 'మహిళా నేతృత్వంలో అభివృద్ధి'ని పట్టి చూపాయి. 'వికసిత్ భారత్', 'భారత్ – లోక్‌తంత్ర మాతృక' వంటి ఇతివృత్తాలతో అత్యంత వైభవంగా జరిగిన వేడుకలలో తొలిసారి మహిళా కేంద్రితంగా కవాతు జరగడం విశేషం. మొదటిసారి త్రివిధ దళాలకు చెందిన మహిళా బృందం కవాతులో పాల్గొంది. భారత వైమానిక దళం నిర్వహించిన ఫ్లైపాస్ట్‌లో పదిహేను మంది మహిళా పైలట్లు ఉన్నారు. దీనితో పాటుగా కేంద్ర సాయుధ పోలీసుదళాలు (సీఏపీఎఫ్), సీఆర్‌పీఎఫ్ దళాలలో కూడా మొత్తం మహిళలే ఉండటం విశేషం. సాయుధ దళాల వైద్య సేవలకు చెందిన మహిళా బృందం మేజర్ సృష్టి ఖుల్లార్ నేతృత్వంలో కవాతు చేసింది.

మరొక చారిత్రిక తొలి ఘట్టంలో గత ఏడాది ఫిరంగి దళంలోకి తీసుకున్న 10 మంది మహిళల్లో ఉన్న లెఫ్టినెంట్‌లు దీప్తీ రాణా, ప్రియాంక సేవ్దాలు కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో ఆయుధాలను గుర్తించే రాడార్ 'స్వాతి'కి, 'పినాకా రాకెట్ వ్యవస్థ'కు నాయకత్వం వహించారు.

దాదాపు 150మంది సిబ్బందితో కూడిన ఢిల్లీ మహిళా పోలీసు దళం కూడా ఈసారి కవాతులో పాలుపంచుకుని, రక్షణ మంత్రిత్వ శాఖ అవార్డును కూడా అందుకోవడం విశేషం. ఇందులో ముగ్గురు మహిళా గెజిటెడ్ అధికారులు, ముగ్గురు సబ్ ఇనస్పెక్టర్లు, 44మంది హెడ్ కానిస్టేబుళ్లు, 100మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరితో పాటుగా, 'ఢిల్లీ పోలీసు గీతాన్ని' వాయించిన ఢిల్లీ పోలీసు బ్రాస్ అండ్ పైప్ బ్యాండ్‌లో 81మంది మహిళా కానిస్టేబుళ్లు, నలుగురు సబ్ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

భారతీయ నావికదళ టాబ్లో కూడా 'నారీశక్తి'ని, 'ఆత్మనిర్భరత'ను పట్టి చూపాయి. ఈసారి ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్' (ఇస్రో) టాబ్లో విజయవంతమైన చంద్రయాన్ 3ను, ఆదిత్య ఎల్–1 మిషన్‌తో పాటు భవిష్యత్‌లో చేపట్టనున్న గగన్‌యాన్, భారతీయ అంతరిక్ష స్టేషన్‌లను ప్రదర్శిస్తూ మహిళాశాస్త్రవేత్తలు ఇందులో పాల్గొన్నారు. వీటితో పాటుగా ప్రాచీన అంతరిక్ష శాస్త్రవేత్తలు ఆర్యభట్ట, వరాహమిహిర వంటివారి చిత్రాలను కూడా ప్రదర్శించారు. డీఆర్‌డీఓ కూడా దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ఆయుధాలను ప్రదర్శించడమే కాక అందులో మహిళా శాస్త్రవేత్తల పాత్రను పట్టి చూపడం విశేషం.

ప్లాటినం జూబ్లీ గణతంత్ర దినోత్సవాలకు అంతర్జాతీయ వాసనలను అద్దుతూ విదేశీ సైనిక మ్యూజిక్ బ్యాండ్‌తో సహా ఫ్రెంచి దళాలు, వైమానిక దళాలు ఈ వేడుకలలో పాలుపంచుకోవడం మరొక విశిష్ట ఘట్టం.

అనంతరం భారతీయ సైనిక దళాలు, 'ఆత్మనిర్భరత'కు అద్దం పడుతూ, దేశీయంగా రూపొందించిన, ఉత్పత్తి చేసిన క్షిపణులు, డ్రోన్ జామర్లు, పర్యవేక్షణ వ్యవస్థలు, వాహనంపై ఏర్పరచిన మోర్టార్లు, బీఎంపీ –2 పదాతిదళ యుద్ధ వాహనాలు సహా సైనిక హార్డ్ వేర్‌ను ప్రదర్శించారు.

తొమ్మిది కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలతో పాటుగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పదహారు టాబ్లోలు (అలంకరించిన వాహనాలు) భారతదేశ సుసంపన్న సాంస్కృతిక చిత్రయవనికను ప్రతిఫలిస్తూ కర్తవ్యపథ్‌పై పయనించాయి. ఈ టాబ్లోలు కూడా 'మహిళా సాధికారత' అన్న ఇతివృత్తాన్ని పట్టి చూపడం తొలిసారి. ఇందులో ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వాహనం ఇటీవలే ప్రాణప్రతిష్ఠ జరిగిన అయోధ్య రామమందిరాన్ని ప్రదర్శించడం విశేషం.

ఫ్రెంచి వైమానిక, అంతరిక్ష దళానికి చెందిన మూడు విమానాలు సహా మొత్తం 54 విమానాలు కర్తవ్యపథ్ ఉత్తేజకరమైన ఫ్లైపాస్ట్ నిర్వహించాయి. ఒక డకోటా విమానం, అనంతరం రెండు డోర్నియర్ విమానాలు 'టాంగైల్' వ్యూహంతో ఆకట్టుకునే ఫ్లైఓవర్‌ను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమానికి పరాకాష్ఠగా ఆరు రఫేల్ విమానాలు 'మారుత్' వ్యూహంతో ఏర్పరచిన 'వజ్రాంగ్' నిర్మాణం అని చెప్పవచ్చు. రెండు అపాచే హెలికాప్టర్లు, రెండు ఎఎల్‌హెచ్ ఎంకె –IV 'బాణం ఆకారంలో' ఏర్పడుతూ ఎగురుతుండగా, ఒక ఎల్‌సిహెచ్‌తో పైలెట్లు 'ప్రచండ్' వ్యూహంతో ఈ ఫ్లైపాస్ట్‌ను ప్రారంభించారు. ఇందులో కూడా మహిళా పైలెట్లు ఉండడం గమనార్హం. మొత్తం మీద, ఈ వేడుకల ద్వారా జెండర్ సమానత్వంలో భారత్ ఏ మాత్రం వెనుకబడి లేదని రుజువు చేసింది.

– జాగృతి డెస్క్


# చరిత్రకు ఇద్దరు నరేంద్రులు



**చారిత్రక ఘటనను గుర్తించడం దగ్గరే చరిత్ర కలిగిన ఒక పత్రిక ఔన్నత్యం వెల్లడవుతుంది. ఒక పరిణామానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తించడమే పత్రికల బాధ్యత. బెంగాల్ కేంద్రంగా వెలువడే ది స్టేట్స్‌మన్ ఆ పని చేసింది. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పత్రిక అయోధ్యలో జనవరి 22న జరిగిన ప్రాణప్రతిష్ఠ ప్రాధాన్యాన్ని విశిష్టమైన రీతిలో నమోదు చేసింది.**

నరేంద్ర లేదా నరేంద్రనాథ్ దత్, ఇది స్వామి వివేకానందులు సన్యాస దీక్ష తీసుకోవడానికి ముందు పేరు. వివేకానంద పేరుతోనే ఆయన విశ్వ వ్యాప్తమయ్యారు. షికాగోలో (అమెరికా) జరిగిన ప్రపంచ సర్వమత సభలో ఆయన ప్రసంగించి, హిందూత్వం గురించి ప్రపంచానికి సరైన కోణంతో పరిచయం చేశారు. హిందూత్వం మత సహనానికి పెట్టింది పేరనీ, ఫాసిజానికీ తీవ్ర వ్యతిరేకి అని ఆయన అక్కడ చాటి చెప్పారు. సర్వమతాలకు తల్లి వంటిదని కూడా ప్రకటించారు. రుషులు స్థాపించిన ఈ మతానికి ప్రపంచ నాగరికతలన్నింటిలోను అనుచరులు ఉన్నారని కూడా తెలియచేశారు. అన్ని మతాల ఉనికిని గౌరవిస్తూ, విశ్వ మానవాళి మధ్య సామరస్యాన్ని హిందూత్వం ప్రతిపాదిస్తుందని ప్రపంచ ప్రజలకు తెలిపారాయన.

ఇవాళ (జనవరి 22) భారత ప్రధాని నరేంద్ర చేసింది కూడా అదేనని పేర్కొన్నది ఆ వ్యాసం.



రామరాజ్య సూత్రాల ద్వారా భారత జాతీయత అంటే ఏమిటో ఆయన ప్రపంచానికి చాటి చెప్పారని వ్యాసకర్త జేపీ గుప్తా వ్యాఖ్యానించారు. రాముడు అంటే కరుణగల, పురోగామి శక్తి. అలాగే ప్రజలను ఏకం చేసేవాడు అని మోదీ చెప్పారు. భారత్‌కు ఉన్న 7000–8000 ఏళ్ల నాగరికతకు వారసత్వం రాముడని చెబుతూ ఆలయంలో బాల రాముడి ప్రతిమకు ప్రధాని ప్రాణప్రతిష్ఠ చేశారని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. రాముడు ప్రతి భారతీయునిలోను వసుధైవ కుటుంబకం అన్న విలువను కల్పించాడని ప్రధాని అన్నారు. ఒక సాధారణ భారతీయుని ఇంటిలోనే కాదు, విశ్వవ్యాప్తంగా వాషింగ్టన్ నుంచి న్యూయార్క్ వరకు ప్యారిస్, లండన్, ఉగాండా, సిడ్నీలలో రామనామం మారుమోగింది. దాదాపు భారతీయులంతా ప్రధాని మోదీ నిర్వహించిన కార్యక్రమానికి జేజేలు పలుకుతున్నారు. అయోధ్యలో ఆధునిక కాలపు వాటికన్ నగరాన్ని దర్శిస్తున్నారు. బ్రిటిష్ శృంఖలాలు తెంచుకున్న భారతజాతికి ఆగస్ట్ 15న స్వరాజ్యం వచ్చింది. జనవరి 22 (ప్రాణప్రతిష్ఠ జరిగిన రోజు) ఆగస్ట్ 15తో సమానమైనదే. రాముని సూత్రాలు, జీవన విధానాల గురించి 21వ శతాబ్దపు ప్రపంచానికి పరిచయం చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ఆయన విలువలను విశ్వవ్యాప్తం చేయాలి. ఇండోనేషియా నేతలు తమ వెంట ఉంచుకునే చిన్న పెట్టెలో రామాయణ పాత్రల బొమ్మలు పెట్టుకుంటారు. ముస్లింల ఆధిపత్యం ఉన్న ఆ దేశంలో జరిగే ఏ కార్యక్రమంలో అయినా రాముడు, రామాయణ ప్రస్తావన ఉంటుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మారుతి చిత్రాన్ని తన జేబులో ఉంచుకుంటారు.

రాముని జీవితం తెలిస్తే వర్తమానతరం నేతలు యుద్ధం కంటే శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్న ఆలోచనకు వస్తారు. నిజానికి వర్తమాన భారత నరేంద్రుడు గతంలో ఇది యుద్ధాల కాలం కాదని చెప్పడం ఈ నేపథ్యంతోనే. శాంతి మార్గంలోనే సమస్యలను పరిష్కరించుకోవడం వీలవు తుందని ఆయన ప్రపంచ నేతలకు పిలుపునిచ్చారు. రామరాజ్యం అంటే అంతా తలెత్తుకు తిరగడం. అంతా న్యాయం కోసం నిలబడడం. అందరినీ సమంగా చూడడం. బలహీనుల పక్షం వహించడం. ఎవరి బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించడం. ఈ సూత్రాలనే వర్తమాన భారత నరేంద్రుడు ప్రపంచ నేతలకు తెలియచేశారు. ఆ విధంగా భారత్‌కు విశ్వగురు స్థానానికి బాటలు వేశారు.

**(ది స్టేట్స్‌మన్, 24.1.2024)**

ఒకవైపు ప్రధాని మోదీ ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ అని నినదిస్తూ, కులమతాలకు అతీతంగా పాలనను అందిస్తున్న నేపథ్యంలో బిహార్ రాష్ట్రం ఇటీవల బరితెగించి కుల రాజకీయాలకు శ్రీకారం చుట్టడంతో అక్కడి పరిణామాలు అనూహ్య మలుపు తిరిగాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో ప్రభుత్వం తొంభై రెండేళ్ల తర్వాత గత ఏడాది కుల గణన చేయించడమే కాదు ఫలితాలను కూడా ప్రకటించింది. దీనితో బీజేపీని ఇరుకున పెట్టవచ్చని భావించింది. ఈ క్రమంలోనే ప్రధాని సోషలిస్టు నాయకుడు కర్పూరి ఠాకూర్‌కు 'భారతరత్న'ను ప్రకటించి, తనదైన శైలిలో ప్రతి పక్షాలకు దిమ్మతిరిగేలా మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. నితీశ్ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే గూటికి చేరిపోయారు. బిహార్‌లోని ఈ పరిణామానికి మరొక పేరే ఇండీ కూటమి పతనం. మోదీ ఓటమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆ కూటమికి ప్రాణప్రతిష్ఠ చేసిన వ్యక్తే ఇప్పుడు మోదీ చెంతకు చేరడం పెద్ద మలుపు.

# బిహార్‌లో ఎత్తుకు

2022 బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీయే కూటమికి మెజారిటీ కన్నా ఆరు ఎక్కువగా 128 స్థానాలు సాధించగా, మహాఘట్‌బంధన్‌లో (ఆర్జేడీ, కాంగ్రెస్ వామపక్ష పార్టీలు) 114స్థానాలు గెలుచుకుంది. మొత్తం 243 స్థానాలు గల బిహార్ అసెంబ్లీలో 79మందితో అతిపెద్ద పార్టీగా ఆర్జేడీ అవతరించగా, 78 స్థానాలతో బీజేపీ, 45 స్థానాలతో జేడీ(యు), 19 స్థానాలతో కాంగ్రెస్ 18 స్థానాలు వామపక్షాలు, మాంఝీ పార్టీ నాలుగు స్థానాలు ఎఐఎంఐఎం ఒక స్థానాన్ని సాధించాయి. జనతాదళ్ యు (జేడీయు) అధినేత నితీశ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ఆగస్టు 2022లో బీజేపీ తన పార్టీని చీల్చే ప్రయత్నం చేస్తోందనే సాకుతో మహాఘట బంధన్‌లో చేరారు.

'పల్టూమార్' అన్న బిరుదు పొందిన నితీశ్‌కు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పల్టీ కొట్టడం కొత్తకాకపోయినా, ఆయన జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించేందుకు చేసిన గత ప్రయత్నాల నేపథ్యంలో ఎన్డీయేతో చేతులు కలుపుతారని ఎవరూ ఊహించ లేదు. ఎందుకంటే, ఆయన 'ఇండీ కూటమి' ఏర్పడకముందు నుంచే ప్రతిపక్ష పార్టీలతో కూటమిని ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. 'ఇండీ కూటమి' ఏర్పడిన అనంతరం తనను దానికి కన్వీనర్‌గా చేస్తారని, చేయాలని ఆశించారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం తాను కాక, మరెవరూ నాయకత్వ బాధ్యతలలో ఉండేందుకు అర్హులు కారన్నట్టు ప్రవర్తించడం ఆయనను నిరాశకులోను చేసింది. ఆ నిరాశలోంచి వచ్చిన అసహనాన్ని ఆయన దాచుకోకుండా ప్రదర్శిం చారు. అయినప్పటికీ ఇండీ కూటమి దానిని విస్మరించడమే ప్రస్తుత పరిణామా లకు దారి తీసిందని చెప్పవచ్చు. కాగా, దాదాపు నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికలలో ఎన్డీయేతో కలిసిపోటీ చేసి, గెలిచిన తర్వాత వారిని కాదని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) పార్టీతో ప్రేమలోపడి వారితో ఇతర ప్రతిపక్షాలను కలుపుకొని మహా ఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నితీశ్, ఇప్పుడు వారికి విడాకులు ఇవ్వడాన్ని ప్రతిపక్ష కూటమి తప్పుపట్టడం సరే, ప్రజలు అంగీకరిస్తారా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారిందని కొందరి భావన.

**లల్లన్ సింగ్ ట్విస్ట్**

కాగా, గత డిసెంబర్ వరకూ జేడీయు అధ్యక్షుడిగా ఉన్న లల్లన్ సింగ్ కొంత కాలం కిందట లాలూ కుమారుడు తేజస్విని ముఖ్యమంత్రిని చేయవలసిం దిగా సూచిస్తూ12 నుంచి 13మంది ఎమ్మెల్యేలను వెంటవేసుకొని వెళ్లడంతో, ఏదో కుట్ర జరుగుతోందని సంశయించిన నితీశ్ వెంటనే పార్టీ అధ్యక్ష పదవి నుంచి లల్లన్‌ను తొలగించి, ఆ బాధ్యతను తనే స్వీకరించాలని నిర్ణయించుకున్నారని డిసెంబర్‌లోనే జితేన్‌రాం మాంఝీ బహిరంగంగా వెల్లడించడం వాస్తవమేనని ఈ పరిణామాలు చెప్తున్నాయి. కాగా, లల్లన్ సింగ్ ఆర్జేడీ నేత లాలూ యాదవ్‌తో కలిసిపోయి, పార్టీలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న వాసనలు నితీశ్ పట్టేయడం వల్లనే ఆయనను తొలగించి, తాను పార్టీ అధ్యక్షుడయ్యాడని మరొక వర్గం చెప్తున్నమాట. ఏది ఏమైనా, నితీశ్ మనసు మార్చుకొని, ఎన్డీయే వైపు మొగ్గడానికి ప్రధాన కారణంగా దీనిని చూడవచ్చు.

ఈ అంశంలో రాజకీయ వ్యూహకర్త, ప్రశాంత్ కిశోర్ మాత్రం చాలా స్పష్టంగా మాట్లాడుతున్నారు. జేడీయుతో పొత్తు రానున్న 2025 ఎన్నికల్లో బీజేపీకి హాని చేస్తుందని ఆయన అంటున్నారు. అప్పటివరకూ ఈ కూటమి కొనసాగదని కూడా ప్రశాంత్ కిశోర్ జోస్యం చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో నితీశ్‌కు తమ ద్వారాలను మూసివేశామని స్పష్టంగా ప్రకటించిన బీజేపీ తిరిగి అతడి పార్టీతో ఎందుకు కలిసిందో ప్రజలకు చెప్పి, ఒప్పించడం కష్టమవు తుందని ఆయన అన్నారు.

**కుల రాజకీయాలకు పుట్టిల్లు**

బిహార్ కులరాజకీయాలకు పుట్టిల్లు అన్న విషయం విదితమే. ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో నితీశ్ ప్రభుత్వం తొంభై రెండేళ్ల తర్వాత కుల గణన చేయించి, గత అక్టోబర్‌లో దాని ఫలితాలను ప్రకటించింది. కుల గణన నివేదిక ప్రకారం రాష్ట్రంలో వెనుకబడిన కుల జనాభా (బీసీ)27.12 శాతం ఉండగా, అత్యంత వెనుకబడిన కులాలు (ఇబిసి) 36.01శాతం, షెడ్యూల్డు కులాలు (ఎస్‌సీలు) 19.65శాతం, షెడ్యూల్డు తెగలు (ఎస్‌టి) 1.68శాతం, సాధారణ (అగ్రవర్ణ, ఆధిపత్య)కుల జనాభా 15.52శాతం ఉన్నారు. ఈ గణాంకాలను మండల రాజకీయాల కోసం ఉపయోగించుకుని, నితీశ్‌కూటమి లబ్ధి పొందుతుందని రాజకీయ విశ్లేషకులు భావించారు. అయితే, అదే సమయంలో 1990లో జరిగిన మండల రాజకీయాలంత అవకాశం ఉండదని కూడా వారు హెచ్చరించారు. అందుకు కారణం ప్రస్తుతం ఉన్న ప్రధానమంత్రి ఓబిసి కావడం, ఆయన నేతృత్వంలో బీజేపీ కూడా వెనుకబడిన వర్గాల రాజకీయాలు చేస్తుండడం. కనుక, ఆశించినంతగా ఫలితాలు దక్కకపోవచ్చన్నది వారి భావన.

మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రతి ఎన్నికల్లో కూడా రాజకీయ అధికారానికి దూరంగా ఉన్న కులాలను ప్రధాన రాజకీయ స్రవంతిలోకి తీసుకురావడం జరుగుతున్నది. ఒక రకంగా, ఇదే బీజేపీకి ఒక పెద్ద అస్త్రంగా మారింది కూడా. ఈ రకంగా బీజేపీ అగ్రవర్ణ పార్టీ అనే అపవాదును ప్రధాని మోదీ తుడిచిపెడుతున్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు ఏ మేరకు గమనించాయో వారికే తెలియాలి. ఎందుకంటే, 2014 ముందువరకూ ఒకలాగా, 2014 తర్వాత ఒకలాగా రాజకీయాలు సాగుతున్నాయి. ప్రస్తుతం సమ్మిళిత అభివృద్ధి దిశగా ప్రధాని దేశాన్ని నడిపిస్తున్నారు. మారుమూల గ్రామాల వరకు కూడా ప్రభుత్వ పథకాల లాభాలను అందించాలన్న లక్ష్యంతో పని చేయడమే కాదు, అవి అందుతున్నాయో లేదో కూడా గమనిస్తూ,



# పైఎత్తు రాజకీయం

అందనివారికి వాటి గురించి వివరించి, అందులోకి చేర్చడమే 'వికసిత భారత సంకల్ప యాత్ర' లక్ష్యం. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు పాతచింతకాయ పచ్చడి వ్యూహాలను వదలకపోతే, ఏ రకంగానూ లాభపడ లేరన్నది బిహార్ అనుభవం స్పష్టం చేస్తోంది.

**మోదీ పట్ల నితీశ్ ప్రేమ**

నిజానికి ప్రధాని నరేంద్ర మోదీ పట్ల బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కి లవ్–హేట్ (ప్రేమ–ద్వేషం) సంబంధం ఉంది. మధ్య మధ్యలో అలకలు పోయినా, మోదీ పట్ల తనకున్న ఆదరభావాన్ని నితీశ్ ఎన్నడూ దాచుకోలేదు. అందుకే, 2003లో అటల్ బిహారీ మంత్రివర్గంలో ఉన్నప్పుడే అందరికన్నా ముందుగా మోదీలో జాతీయ నాయకుడి లక్షణాలను గమనించడమే కాదు, ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు కూడా. అప్పుడే ఆయన 2002లో జరిగిన అల్లర్లను పెద్దది చేసి చూడకుండా గుజరాత్‌లో మోదీ చేస్తున్న అభివృద్ధి పనులను చూడాలని కూడా సూచించారు. అటువంటి ఆప్యాయత మోదీ పట్ల ప్రదర్శించినప్పటికీ, జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలన్న ఆకాంక్ష సమసిపోక పోవడం వల్లనే నితీశ్ ఈ పల్టీ రాజకీయాలు చేస్తున్నారనుకోవాలి.

**ఏకకాలంలో మందిర - మండల రాజకీయంతో దెబ్బ**

దేశమంతా రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంతో మురిసిపోతున్న సమయంలో ప్రధాని మోదీ సోషలిస్టు, బీసీ నేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రకటించారు. ఇది వాస్తవానికి ఎప్పటి నుంచో నితీష్‌కుమార్ చేస్తున్న డిమాండ్. ఈ రకంగా, నితీశ్ కూటమి వేసిన మండల రాజకీయ వ్యూహాన్ని మోదీ తిప్పి కొట్టారు. సరిగ్గా కర్పూరీ ఠాకూర్ శతజయంతోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మోదీ ఆయనకు దేశంలోనే అత్యున్నత అవార్డును ప్రకటించడంతో, నితీశ్ ఆయనకు కృతజ్ఞతలు చెప్పకతప్పలేదు. ఠాకూర్ శత జయంతోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెప్పడమే కాదు, కర్పూరీ ఠాకూర్‌లా తాను కూడా కుటుంబాన్ని రాజకీయాల్లోకి తేలేదని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు ఆ పని చేశాయంటూ ఆర్‌జెడిని పరోక్షంగా ఎద్దేవాచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో బీహార్‌లో రాజకీయంగా కొద్ది గందర గోళం ఏర్పడడం, ఆ సమయంలోనే మోదీతో నితీష్ చేతులు కలపడం నాటకీయంగా జరిగిపోయాయి.

**అయోమయంలో లాలూ కుమారుడి భవితవ్యం**

నితీష్ కుమార్ తీసుకున్న హఠాత్ నిర్ణయంతో లాలూ కుమారుల రాజకీయ జీవితం అయో మయంలో పడిపోయింది. ఒకవైపు ఉన్న ఉపముఖ్య మంత్రి పదవి ఊడిపోయిన ఆవేదన, మరోవైపు తండ్రి రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలకు, భూములు తీసుకున్న స్కాంలో అటు లాలూ, ఇటు తేజస్వి యాదవ్‌ను ఇడీ ప్రశ్నిస్తుండటం వారికే కాదు ఆ పార్టీకి కూడా ఇబ్బందిగా పరిణ మించింది. నిజానికి, ఆర్జేడీకి పుష్కలమైన యాదవ్ ఓటు బ్యాంకు బీహార్‌లో ఉంది. దానితో పాటుగా కొంత ముస్లిం ఓటు బ్యాంకు కూడా. అయితే, ఇప్పుడు నితీష్ వెళ్లి బీజేపీతో కలవడం, జితేన్‌రాం మాంఝీ వంటి నాయకులు బీజేపీతోనే కొనసాగు తుండడం వల్ల వీరి ఓట్లన్నీ కలిస్తే, ఆర్జేడీ ఎందుకూ పెట్టదు. 2019లో ఎన్డీయే కూటమి 40లో మొత్తం 39 సీట్లను గెలుచుకుంది. ఈసారి కూడా చరిత్ర పునరావృతమయ్యే అవకాశం కనిపిస్తోంది.

**9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం**

తాను ఆర్జేడీతో సంబంధాన్ని తెంచుకుంటు న్నానని ప్రకటించి, తన రాజీనామాను సమర్పించి అసెంబ్లీని రద్దు చేసిన నితీశ్ 48 గంటలు తిరుగకుం డానే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అత్యధిక సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వ్యక్తిగా రికార్డు సాధించారు. వాస్తవానికి ఆయన వేసే పిల్లిమొగ్గలే ఆయన చేత తొమ్మిదిసార్లు ప్రమాణ స్వీకారం చేయించాయి. ఈ క్రమంలోనే నిన్నటివరకూ ఉపముఖ్యమంత్రిగా ఉన్న తేజస్వీ యాదవ్ 'ఆయన అలసిపోయిన ముఖ్యమంత్రి' అటువంటి వాడి చేత మేం పని చేయించాం అంటూ ఎద్దేవా చేశారు. అంతేకాదు, నితీష్ ఏం మాట్లాడు తున్నాడో ఆయనకే తెలియడం లేదని, ఆయన రాజకీయ జీవితం 2024తో ముగిసిపోతుందని, జోస్యం కూడా చెప్పారు. అయితే, తేజస్వి ఇంకా ఇడీని ఎదుర్కొనవలసి ఉంది.

ఇదిలా ఉండగా, ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ, జేడీయులు పరస్పర విమర్శలకు దిగాయి. ముందస్తు ప్రణాళికతోనే నితీశ్ ఈ పని చేశారంటూ కాంగ్రెస్ ఆరోపణలు చేయగా, అది ముందస్తు ప్రణాళికే అయితే మొదటి ఇండీ సమావేశాన్ని తామెందుకు నిర్వహిస్తామని, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ అఖిలేష్ వంటి నాయకులను ఎందుకు మీకు అనుకూలంగా కూడగడతామంటూ జెడియు నాయకుడు కెసి త్యాగి విరుచుకుపడటమే కాదు, కాంగ్రెస్ పార్టీ దృష్టి ఎప్పుడూ ప్రధాని పదవి పైనే ఉంటుందని విమర్శించారు.

**అన్యాయమవుతున్న కాంగ్రెస్ న్యాయయాత్ర**

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న 'భారత్ జోడో న్యాయయాత్ర' జనవరి 29న కిషన్‌గంజ్ నుంచి బీహార్‌లో ప్రవేశించనున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి మొత్తం 19మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 10మంది మాత్రమే హాజరు కావడం సంచలనం కాగా, పార్టీ నాయకులు మాత్రం దానిని చిన్న విషయంగా తీసేస్తూ, బహిరంగ సభకు అందరూ హాజరవుతారని విశ్వాసంతో చెప్పారు.

ఈ రాజకీయ చదరంగంలో బీహార్ ప్రజలు ఎవరికి చెక్ పెడతారనే విషయం వేచి చూడవలసిన విషయమే.

– జాగృతి డెస్క్



# ప్రత్యేకాధికారులకు 'గ్రా

**తెలంగాణ గ్రామ పంచాయతీల్లో మరోసారి ప్రత్యేక పాలన మొదలయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా 12వేల 769 గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీన ముగిసిపోయింది. దీంతో పాలనా బాధ్యతలు అధికారులకు బదిలీ అయ్యాయి. దీంతో, ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలోనే సెలవుల్లో ఉన్న పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది అందరూ తక్షణమే విధుల్లో చేరాలని నాలుగురోజుల ముందే ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జెడ్పీ సీఈఓలు, డీపీవోలకు సంకేతాలు ఇచ్చింది. మరోవైపు.. పెండింగ్‌లో ఉన్న బిల్లుల పరిస్థితిపై సర్పంచ్‌లలో ఆందోళన నెలకొంది.**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యపడదని ప్రభుత్వం భావించింది. రాష్ట్రంలో అధికార బదలాయింపు జరిగి రెండు నెలలు కూడా పూర్తి కాకపోవడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, అస్తవ్యస్త పాలన కారణంగా దెబ్బతిన్న వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఎన్నికలను పక్కనబెట్టింది. కనీసం అటువైపు ఆలోచించనూలేదు. అందుకే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అనివార్యంగా మారింది.

పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించాలన్న ప్రభుత్వం నిర్ణయం మేరకు, కలెక్టర్లు ప్రభుత్వానికి అధికారుల జాబితాలను పంపించారు. ప్రతిపాదిత ప్రత్యేకాధికారుల జాబితాను పరిశీలించిన ప్రభుత్వం.. అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర



రేవంత్‌రెడ్డి

పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారి ముందుగానే జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు. సిద్ధం చేసిన జాబితా ప్రకారం పంచాయతీల వారీగా నియామకం, నిబంధనలకు తగినవిధంగా లేనివారి స్థానంలో మరొకరిని నియమించడం వంటి వాటిపై ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ప్రత్యేకాధికారులంతా మండల స్థాయి వాళ్లే కావడంతో.. బాధ్యతలు చేపట్టిన వెంటనే.. సంబంధిత ఫైళ్లు అన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ప్రత్యేక పాలన సమయంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, సంబంధిత అధికారులు గ్రామాల పర్యవేక్షణపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని డీపీవోలు, సీఈవోలను రాష్ట్ర ఉన్నతాధికారి ఆదేశించారు. అవసరమైన మార్గదర్శకాలు జారీచేశారు.

సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో.. పాలనా వ్యవస్థ స్తంభించకుండా ఉండేందుకు.. ఈ ప్రత్యేకాధికారులను నియమించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల విద్యాధికారులు, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యానవన శాఖ అధికారులు, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, టైపిస్టులు, గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. కొన్ని మండలాలు చిన్నవి కావడంతో.. పంచాయతీల సంఖ్యను బట్టి ఇతర శాఖల అధికారులసేవలను కూడా వినియోగించుకుంటున్నారు.

అయితే, ఈ పరిణామాలపై సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మొత్తంలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. ఆ అభివృద్ధి పనులన్నింటినీ సర్పంచ్‌లే చేయించారు. సాధారణంగా గ్రామీణ స్థాయిలో మెజారిటీ స్థాయి సర్పంచ్‌లు మధ్యతరగతికి చెందిన వాళ్లే ఉండటంతో పాటు.. ఆర్థికంగా అంత ఉన్నత స్థితిలో లేని వాళ్లే ఎక్కువగా ఉండటంతో.. చాలా మంది తమ గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకోసం పెద్దమొత్తంలో అప్పుడు చేసి పనులు చేయించారు. వాటికి సంబంధించి ఒక్కొక్కరికీ లక్షల రూపాయల్లో బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. సగటున ఒక్కో సర్పంచ్‌కు 3లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయల దాకా బిల్లులు పేరుకుపోయాయని చెబుతున్నారు.

కాగా, తమ పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌ల నుంచి డిమాండ్‌లు వచ్చాయి. ప్రత్యేక అధికారులను నియమించే బదులు.. ఇప్పటిదాకా పాలన సాగించిన సర్పంచ్‌ల పదవీకాలాన్నే తదుపరి ఎన్నికలు జరిగేదాకా పొడిగిస్తే బాగుంటుందన్న ప్రతిపాదనలు చేశారు. అంతేకాదు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామ పంచాయతీలకు తాళాలు వేసి నిరాహార దీక్షలు చేస్తామని సర్పంచ్‌లు హెచ్చరించారు. అంతేకాదు..

సుజాత గోపగోని, 6302164068



# మ' పగ్గాలు

తమ బకాయిలు చెల్లిస్తేనే కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ఇస్తామని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు 1,200 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందని, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 30 నెలలుగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పంచాయతీలకు తాళాలు వేసి రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశారని, నిధులు విడుదల కాకపోవడం వల్ల కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా ఉంటామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభుత్వం సర్పంచ్‌లను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సర్పంచ్‌లకు న్యాయం చేయాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం బాధ్యులు కోరారు. అంతేకాదు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సర్పంచ్‌ల సంఘం నేతలు స్వయంగా కలిసి తమ పదవీకాలాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, గ్రామ పంచాయతీల భవనాలు, సీసీరోడ్లు, బీటీరోడ్ల నిర్మాణాలకు సంబంధించి 1200 కోట్ల రూపాయల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని వెంటనే విడుదల చేయించాలని కోరారు. ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ.. తమను కూడా విధులకు హాజరయ్యేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈమేరకు వినతిపత్రం సమర్పించారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

జాగృతి డెస్క్


# దివ్య స్వప్న సాకారం

'అయోధ్యలో రామచంద్ర ప్రభువుకి భవ్య మందిరం నిర్మించాలన్నది భగవన్నిర్ణయం. ఆ పనికి భగవంతుడు మన ప్రధాని నరేంద్ర మోదీని ఎంచుకున్నాడు.' అయోధ్యలో రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన అనగానే అందరికి మొదట గుర్తుకు వచ్చిన పేరు నిస్సంశయంగా లాల్ కృష్ణ అద్వానిదే. ఆయన 33 ఏళ్ల క్రితం సోమనాథ్ నుంచి అయోధ్య వరకు చేపట్టిన యాత్ర మందిర నిర్మాణ ఉద్యమాన్ని మలుపు తిప్పింది. ఆ మలుపు భారత రాజకీయ, సామాజిక రంగాలలో మలుపుగా కూడా మారింది. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా బీజేపీ కురువృద్ధ నాయకుడు అద్వానీ రాష్ట్రధర్మ పత్రికకు వ్యాసం రాశారు. రామమందిర్ నిర్మాణ్, ఏక్ దివ్య స్వప్న కి పూర్తి' అన్న శీర్షికతో ఈ వ్యాసం వెలువడింది. అయోధ్య ఉద్యమం గొప్ప నిర్ణయాత్మక, పరిణామాత్మక ఘట్టమని ఆయన వ్యాఖ్యానించారు. ఆ యాత్ర తన రాజకీయ ప్రస్థానంలో భారత్‌ను పునఃదర్శనం చేసుకునే అవకాశాన్నీ, తనను తాను పునర్ మూల్యాంకన చేసుకోవడానికీ కూడా గొప్పగా దోహదం చేసిందని ఆయన రాశారు.

ఆనాడు అయోధ్య ఉద్యమంలో అగ్రభాగాన నిలిచినవారు అద్వానీ. ఇప్పుడు అక్కడ భవ్య మందిరం నిర్మాణం కావడం, ప్రాణప్రతిష్ఠ కూడా జరుగుతూ ఉన్న సందర్భం కూడా వచ్చాయి. ఈ సమయంలో



రథయాత్రలో అద్వానితో మోదీ



అద్వాని

ఆయన తలుచుకోవలసిన వ్యక్తినే తలుచుకున్నారు. ఆయన– అటల్ బిహారీ వాజపేయి. ఆయన లేకపోవడం పెద్ద వెలితి అని అద్వానీ భావించారు. ఇవాళ్టికి ముప్పయ్ ఏళ్ల క్రితం రథయాత్ర పూర్తయింది. తాము సెప్టెంబర్ 25, 1990 ఉదయం యాత్ర ఆరంభించామనీ, మాకు రాముని మీద ఉన్న విశ్వాసమే మేము ప్రారంభించిన ఈ యాత్రతో దేశంలో ఒక ఉద్యమం నిర్మితమవుతుందని ఆనాడు మేము అనుకోలేదని అద్వానీ గుర్తు చేసుకున్నారు. ఈ యాత్ర మొత్తం తన వెంట ఉన్న వ్యక్తి నరేంద్ర మోదీ అని కూడా అద్వానీ గుర్తు చేసుకున్నారు.

అప్పటికి మోదీ ప్రఖ్యాతుడు కాదనీ, కానీ ఆ సమయంలోనే తన ఆలయాన్ని నిర్మించే భక్తుడిగా (మోదీ) రాముడు ఆయనను ఎంచుకున్నాడని అద్వానీ అన్నారు. తాను కూడా రామమందిర నిర్మాణం భగవత్ సంకల్పమని, అది జరిగి తీరుతుందనీ అనుకున్నానని కూడా అద్వానీ గుర్తు చేసుకున్నారు. అయితే అందుకు కొంతకాలం పట్టిందని వ్యాఖ్యానించారాయన. ప్రధాని మోదీ అక్కడ విగ్రహ ప్రతిష్ఠ చేశారంటే, ప్రతి భారతీయుని ప్రతినిధిగానే చేశారని అద్వానీ రాశారు. ఈ ఆలయం ఇచ్చే స్ఫూర్తితో ప్రతి భారతీయుడి రాముని గుణగణాలు అలవాటు చేసుకోవాలని ప్రార్థిస్తున్నానని అద్వానీ అభిలషించారు. తన జీవితాన్ని కూడా ప్రభావితం చేసిన అనేక అనుభవాలు రథయాత్రలో తనకు ఎదురయ్యాయని అద్వానీ గుర్తు చేసుకున్నారు. 'ఎక్కడెక్కడివారో ప్రజానీకం, మారుమూల గ్రామాల నుంచి రథం దగ్గరకు వచ్చేవారు. ఆ రథాన్ని చూశాక వారు ఉద్విగ్నతతో తడిసి ముద్దయ్యేవారు. రథానికి ప్రణామం చేసి, రాములవారిని తలుచుకుంటూ వెళ్లేవారు' అని చెప్పారు అద్వానీ. ఇదంతా చూస్తే ఈ దేశంలో ఎందరో అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం కలగన్నారని అనిపిస్తుంది. జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠతో అణగిపోయి ఉన్న అలాంటివారి కల నెరవేరిందని చెప్పాలి అని రాశారు అద్వానీ. ఈ సందర్భంగా అద్వానీ ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలియచేశారు. ★

**బీసీల పక్షపాతిగా చెప్పుకుంటున్న వైసీపీలో తామే బాధితులమని బీసీలు చెబుతున్నారు. తమకు అసెంబ్లీ సీట్లు, పార్టీ బాధ్యతలు ఇచ్చినా పెత్తనం మాత్రం రెడ్లదే. 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులివ్వలేదు. ఏళ్ల తరబడి అమలు చేస్తున్న స్వయం ఉపాధి రుణాలు, ఆధునిక పనిముట్ల పంపిణి, ఇతర ఆర్థిక సహాయాలు నిలిపివేశారు. నవరత్నాల పథకాల్లో బీసీ లబ్ధిదారులనే ఆయా బీసీ కార్పొరేషన్ల లబ్ధిదారులుగా చూపిస్తున్నారు. ఎన్నికలు సమీపించడంతో తమ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఎమ్మెల్యేలపై నెట్టి బీసీ అభ్యర్థులకు టిక్కెట్లు నిరాకరిస్తున్నారు. కొందరిని వేరే ప్రాంతాలకు మార్చుతున్నారు. ఇదీ వైసీపీ అధిష్టానం జరుపుతున్న తంతు. మొత్తానికి వైసీపీలో బీసీలే బాధితులుగా మారారు.**

# వైసీపీ పాలనలో




వైసీపీ ప్రభుత్వం బీసీలను కేంద్రంగా చేసుకుని రాజకీయాలు చేస్తోంది. ప్రభుత్వంలో బీసీలకు ఎన్నో పదవులిచ్చామని, ఎంతో లబ్ధి చేకూర్చామని ప్రచారం చేసుకుంటూ ఆ వర్గాల ఓట్లకు గాలం వేస్తోంది. కాని ఇవన్నీ పచ్చి అసత్యాలని నాలుగున్నరేళ్ల పాలనలో తమకు ఎలాంటి మేలు జరగలేదని బీసీలు విమర్శిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులుగా ఉన్నా పెత్తనమంతా ఒక వర్గం వారిదేనని బీసీ ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. త్వరలో జరిగే ఎన్నికలకు టిక్కెట్లు ఇవ్వకపోవడం, నియోజక వర్గాలు మార్చడం ద్వారా తమనే బాధితుల్ని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకూ వైసీపీ ప్రకటించిన మూడు అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల జాబితాల్లో మొత్తంగా 59 స్థానాల్లో మార్పులు, చేర్పులు చేసింది. అందులో ఎమ్మెల్యేలు 24, సమన్వయకర్తలు అయిదుగురు, 20 మంది సిటింగ్‌ల స్థానాలు గల్లంతయ్యాయి. ఈ 20లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 16 మంది ఉన్నారు. మరోవైపు టికెట్ లేకుండా పూర్తిగా పక్కనపెట్టిన ముగ్గురు ఎంపీల్లో ఇద్దరు బీసిలే. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఏడుగురు, ఒక సమన్వయకర్తను తొలగించారు. బీసీలకు సంబంధించి ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురిని పక్కన పెట్టారు. ఎస్టీ, ముస్లిం మైనారిటీలు ఒక్కొక్కరిని చొప్పున తప్పించారు. రాబోయే జాబితాల్లో కూడా ఇదే రీతిన తమనే టార్గెట్ చేస్తారని వెనుకబడిన వర్గాల నేతలంటున్నారు. ఈ పార్టీలో బీసీలకు ప్రాధాన్యం ఉండేదని అనుకున్నామని, ప్రస్తుత పరిణామాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని బీసీ ప్రజా ప్రతినిధులంటున్నారు. నిజంగా పరిస్థితులు బాగోలేక మారిస్తే పర్వాలేదని కాని, కేవలం ఒక వర్గం కోసం మార్చడం దారుణమని చెబుతున్నారు. బీసీలు, దళితులు ఒకరి చెప్పుచేతల్లో ఉండటం బాధ కలిగిస్తోందంటున్నారు.

ఇదొక్కటే కాదు..అధికారం కోసం ఎన్నో హామీలిచ్చిన వైసీపీ నేత మాట తప్పి వాటిని గాలి కొదిలేశారని బీసీలంతా ఆక్షేపిస్తున్నారు. పలు పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని, గతంలోని ఎన్నో పథకాలను రద్దు చేశారంటున్నారు. నవరత్నాల కింద అన్ని వర్గాలకు ఇచ్చే నగదు బదిలీల లెక్కలు చెబుతూ బీసీలకు అన్నీ ఇచ్చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని అంటున్నారు. వైసీపీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అత్యధిక శాతం హామీలు అమలు చేయలేదని, 'అన్నీ నెరవేర్చాం' అనడం శుద్ధ అబద్ధమని ఆరోపిస్తున్నారు. కొద్దిమంది బీసీ నేతలకు నిధులు లేని కార్పొరేషన్ పదవులిచ్చి మొత్తం బీసీ వర్గాలను ఉద్ధరించినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడుతున్నారు.

**రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ వృత్తిని చేపట్టిన కొన్ని కులాలను, మత్స్యకారులు, చేనేత వృత్తి వారికే నవరత్నాల పథకంలో నగదు అందుతోందని బాధిత వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు ఇచ్చేవారు. అందులో 50 శాతం సబ్సిడీ ఉండేది. ఒక్కొక్కరికి రూ.లక్ష సబ్సిడీ అందేది.**




**ఏది సామాజిక న్యాయం?**

'వెనుకబడిన వర్గాలకు అత్యధిక పదవులిచ్చాం. సామాజిక న్యాయం మేమే చేస్తున్నాం. దానిపై మాట్లాడే హక్కు మాకే ఉంది' అంటూ వైసీపీ నేతలు గొప్పలు చెబుతుంటారు. అన్నీ అసత్యాలు. బీసీలకు మంత్రి పదవులిచ్చినా సొంతగా నిర్ణయం తీసుకునే హక్కు, అధికారం మాత్రం వారికి లేదు. అధికారం మొత్తం అధినేత, ఆయన నమ్మినబంటులుగా ఉన్న, అధినేతకు సంబంధించిన అగ్రకుల సామాజిక వర్గానికే చెందిన ప్రాంతీయ ఇన్‌ఛార్జులదే. తమ

# బీసీలే బాధితులు..!

టీఎన్. భూషణ్




సామాజిక వర్గాలకు ఏదైనా మంచి చేద్దామనుకున్నా అవకాశం లేకుండా పోయింది' అని బీసీ ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేకపోయినట్లు తమ వారి వద్ద చెప్పుకుని బాధపడుతున్నారు.

నియోజకవర్గ సమన్వయకర్తలుగా వచ్చిన అగ్రకుల నాయకులు తమపై పెత్తనం చెలాయించడాన్ని బీసీ ఎమ్మెల్యేలు తప్పుపడుతున్నారు. విధాన నిర్ణయం లేకపోతే ఇక అధికారం ఉండి ఉపయోగమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రాధాన్యత లేని పదవులు ఎందుకని అంటున్నారు. ఇక ఈ వర్గాలకు వైసీపీ అధిష్ఠానం ఎలాంటి ప్రాధాన్యమిస్తున్నదీ సమన్వయకర్తల మార్పులు చేర్పుల్లో స్పష్టమవుతోంది.


**నిధులులేని కార్పొరేషన్‌లు**


రాష్ట్రంలో వెనుకబడిన కులాల అభివృద్ధే లక్ష్యంగా చెబుతూ వైసీపీ ప్రభుత్వం డిసెంబర్ 17,2020న బీసీ కార్పోరేషన్లను ఆర్భాటంగా ప్రకటించింది. ప్రతి కార్పోరేషన్‌కు ఛైర్మన్ సహా 12 మంది డైరెక్టర్లతో మొత్తం 136 కులాలకు గాను 56 కార్పోరేషన్లను ఏర్పాటు చేసింది. అయితే వాటికి తగినన్ని విధులు ఏవీ లేవని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మెజారిటీ సంస్థలకు కనీసం కార్యాలయం లేదని, ఛైర్మన్ డైరెక్టర్లకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. పైగా ఛైర్మన్‌కి నెలకు రూ.56 వేలు, డైరెక్టర్లకి రూ.12 వేల వంతున, ఛైర్మన్‌కు వాహనభత్యం కింద మరో రూ.60 వేలు, ఆయన సహాయకులకు రూ.12 వేలు పారితోషికంతో పేరుతో ప్రతినెలా పెద్ద మొత్తంలో దుబారా చేశారనే విమర్శలూ లేకపోలేదు. నవరత్నాల పేరుతో కొందరికి నగదు జమ చేసి మొత్తం బీసీలందరినీ ఉద్ధరించినట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, రాష్ట్రంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీలకు సంక్షేమ పథకాలు నామమాత్రంగానే అందుతున్నాయని అంటున్నారు. 2.14 కోట్ల బీసీ జనాభాలో కేవలం ఐదు రకాల కులాలకు చెందిన 44 లక్షల జనాభాకు తప్ప మిగతా 1.70 కోట్ల మందిని పట్టించుకోవడం లేదని మిగతా కులాల వారంటున్నారు. రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ వృత్తిని చేపట్టిన కొన్ని కులాలను, మత్స్యకారులు, చేనేత వృత్తి వారికే నవరత్నాల పథకంలో నగదు అందుతోందని బాధిత వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు ఇచ్చేవారు. అందులో 50 శాతం సబ్సిడీ ఉండేది. ఒక్కొక్కరికి రూ.లక్ష సబ్సిడీ అందేది. ఇవికాక కులవృత్తులు చేసుకునే బీసీ వర్గాలకు అదరణ పథకం పేరుతో స్వయం ఉపాధి యూనిట్ల కొనుగోలు, పనిముట్లకు 90 శాతం సబ్సిడీ రూపంలో అందించేవారు. వైసీపీ అధికారానికి వచ్చాక ఈ పథకాలు అమలు కావడం లేదు.

**ఎన్‌బీసీఎఫ్‌డీసీ రుణాల నిలిపివేత**

బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సంకల్పంతో జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ), రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్వయం ఉపాధి రుణాలు అందిస్తుంది. యూనిట్ ఏర్పాటుకు ఇచ్చే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం 25% రాయితీ అందిస్తే.. లబ్ధిదారుడు 10% చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని ఎన్‌బీసీఎఫ్‌డీసీ రుణంగా ఇస్తుంది. ఈ పథకం అన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌నూ అమలు జరిగింది. వైసీపీ ప్రభుత్వం దీనిని పక్కన పెట్టేసింది. 2019లో దీన్ని అమలుచేసిన రాష్ట్ర ప్రభుత్వం తర్వాత పక్కనపెట్టింది. ఆ సంవత్సరం రూ.36 కోట్ల రుణ మంజూరుతో ప్రక్రియను చేపట్టి, నిబంధనల్ని కఠినతరం చేసి ఆ రుణాన్ని రూ.26 కోట్లకు పరిమితం చేసింది. దీని ద్వారా 305 మందికే ఆర్థికసాయం అందించినట్లు సమాచారం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్






10

## గంగా యమునల పావన సంగమం
## రామాయణకాలపు సామాజిక జీవనం

వాల్మీకి మహర్షి అయోధ్య ప్రజలను వర్ణించడంలో ప్రజలంతా పూర్తిగా ధార్మికులుగా, పవిత్రులుగా ఉంటూ సమస్త ఉత్తమ ఉపభోగాలను సేవించేవారని స్పష్టం చేశారు. భౌతిక సుఖలాలస అనే వినాశకరమైన విశృంఖలత్వానికి కూడ దానిలో తావు లేదు. రామాయణకాలం నాటి ఈ కమనీయ స్వరూపంలో ధార్మిక శ్రద్ధ అనే జ్వాలలోను, పరమేశ్వర భక్తిలోను సమస్త సుఖసాధనాలు ఉపస్థితమై ఉన్నాయనే గోచరిస్తుంది.

సమాజంలో జాతీయశీలం వికసించినందువల్ల సుఖసమృద్ధులు గల జీవనం సహజంగానే సులభసాధ్యమవుతుంది. నేటి ప్రపంచంలో నలువైపులా భౌతికవాదం, హక్కుల ఆధారంగా పరిభాషలు ఏర్పడుతున్నాయి. కాని నేటివరకు ఏ దేశంలో కూడ హక్కుల శాస్త్రం (లా) ఆధారంగా సమాజంలో పశుత్వాన్ని, అన్యాయాన్ని ఉన్మూలనం చేయడం సంభవం కాలేదు, సంభవం కాబోదు. కనుకనే భారతీయ సంస్కృతికి హక్కుల పరిభాషను అంగీకరించరు. కర్తవ్యం ఆధారంగానే శాశ్వతము, సుసంపన్నము అయిన సమాజజీవనం నిర్మితమవుతుంది. హక్కులు ఆధారంగా నిర్మితమైన ఎంతటి మంచి సమాజ వ్యవస్థలో అయిన సంఘర్షణ ఉత్పన్నమవుతుంది. కర్తవ్యం ఆధారంగా నిర్మితమైన ప్రతి కార్యంలోనూ ప్రగతి సంగీతం ధ్వనిస్తూ ఉంటుంది. చట్టాలు ఎంత ఎక్కువయితే దండనీతి ఉగ్రత అంత ఎక్కువవుతుంది. నియమ నిబంధనల పరిభాష అంత కఠోరమవుతుంది. ఫలితంగా సమాజంలో మిథ్యాచారం చేసే కళ కూడా పెరుగుతుంది. కాని కర్తవ్యం ఆధారంగా తన్ను తాను నియమించుకుంటూ, హీనత్వం, దుర్గుణాలు, పశుత్వాల ఎడ అంతఃకరణంలో తనలో అసహ్యాన్ని ఏర్పరచుకునే పక్షంలో సమాజంలోని అవగుణాలు సహజంగానే దూరమవుతాయి. ప్రగతి సాధ్యమవుతుంది.

అయోధ్య ప్రజల జీవన నైతిక స్థాయి ఎంత ఉన్నతంగా ఉన్నదంటే, వారి అంతఃకరణాలతో పశుత్వ భావన ఉదయించడమే జరగదు. కాని నేడు ఉదాత్త నైతిక జీవన పరిభాషకు వికృత అర్థమే చెబుతున్నారు. నేడు ఆధ్యాత్మిక జీవనం లేదా శీలసంపన్న జీవనం అంటే లోక విలక్షణమైన ఆచార వ్యవహారాలనీ, సుఖోపభోగాల ఎడ, కళాత్మకత ఎడ విముఖత అనీ, జీవనం పట్ల సంపూర్ణ నిరాశావాద దృష్టిని కలిగి ఉండడమనీ అర్థం చెబుతున్నారు. రామాయణ కాలం నాటి పవిత్ర దృక్పథాన్ని చూచే అవకాశం కూడా లభించడం లేదు, వాస్తవానికి సుఖోపభోగాలను హేయంగా, తిరస్కారపూర్వక దృష్టితో చూడడం శీలం కాదు. "ధర్మో విరుద్ధో భూతేషు కమోష్మి భరతర్షభ" అని గీతలో ఉంది. ఇదే పూర్ణావతారం. విశ్వంలో ఉపభోగవస్తువులనన్నిటినీ కళాత్మకతతో అనుభవించడం, సౌందర్యపానం పట్ల అభిరుచిని కలిగి ఉండడం , సాధ్యమైనంత వరకు ఉత్తమమైన ఆహార విహారాలను, వేషభూషలను స్వీకరించడం, అపరిశుభ్రత ఎడ ఏహ్యభావాన్ని కలిగి ఉండడం – ఇదే అభిజాత్య లక్షణం. కాని ఈ రసికతకు, ఉపభోగానికి సంయమం అనే ప్రతిబంధం ఉన్నదని గుర్తించడం కూడా అవసరం.

భారతీయ జీవనం సంపన్న మనోహరమైన ఈ దృష్టి రుగ్వేదం నుండి రామాయణం వరకు ప్రాచీన గ్రంథాలన్నిటిలోనూ ఒకే విధంగా వర్ణితమైది. ఆ తర్వాత మహాభారత కాలంలో జీవనం ఎడ నిరాశావాద దృష్టి అనే నీడ నిర్మితమైనట్లు కనపడుతుంది;

– బాలశాస్త్రి హరదాస్

'జాగృతి' 13.04.1962 సంచిక నుంచి




సప్త చిరంజీవులు


## వేదోద్ధారకుడు వ్యాసభగవానుడు

**'వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమ కల్మషం**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం'**

వ్యాసుడు మహాభారతం కాలం నుంచి పరిచయమైనా అంతకు పూర్వం ఉన్నవాడు, సనాతనుడు. కారణజన్ముడు. బ్రహ్మ ముఖం నుంచి పుట్టిన వేదాలను ప్రచరించచేసేందుకు శ్రీమన్నారాయణుడు 'అపాంతరతముడు'అనే మానస పుత్రుడిని సృష్టించాడు. ఆయన తరువాతి మన్వంతరంలో వేదవ్యాసుడుగా ప్రసిద్ధులు. వేదాలను విభజించడం వల్ల వేదవ్యాసుడని ప్రసిద్ధులయ్యారు. 'వ్యాసం' అంటే వ్యాప్తి చేయడం, 'వ్యాసుడు' అంటే విపులంగా చెప్పేవాడని భావం. తనకు 'పరా'స్థితిలో అందిన వేదవాఙ్మయాన్ని సక్రమంగా విశ్లేషించి, ఇతరుల అధ్యయనానికి వీలుగా రూపొందించారు. 'వేదవిభజన, విస్తారం చేయాలన్న నా సంకల్పాన్ని నెరవేర్చావు కనుక అన్ని మన్వంతరాలలో ఈ వ్యాస ప్రక్రియతో నన్ను సంతోష పెడుతుంటావు. తరువాతి మన్వంతరంలో వశిష్ఠుని మునిమనవడిగా జన్మిస్తావు. త్రికాలవేదులు సహా ఎవరికి ఏ సందేహం కలిగినా వాటిని నివృత్తి చేయగల విజ్ఞానకోశం నీ నుంచి వెలువడుతుంది' అని ఆశీర్వదించాడు. ఆ ప్రకారం, వశిష్ఠ మహర్షి మనుమడు పరాశర మత్స్యగంధి (సత్యవతిల)లకు కపిలజటలతో దండ కమండ లాలతో జన్మించాడు. కృష్ణ (యమునా) ద్వీపంలో పుట్టాడు కనుక కృష్ణ ద్వైపాయనుడయ్యారు. ఆ ద్వీపం నది మధ్యలో ఉండడం వల్ల 'కృష్ణద్వీపం'గా వ్యవ హారంలోకి వచ్చింది. మహాభారతంలో ఆయన కృష్ణ, కృష్ణద్వైపాయన, ద్వైపాయన, పారాశరాత్మజ, బాదారాయణ, సత్యవతీసుత, సత్యవతాత్మజ, సాత్యవతేయుడు, వేదవ్యాస అనే పేర్లతో కనిపిస్తారు వ్యాసుడు కురూపి అని, మత్స్యగంధికి పుట్టడంవల్ల ఆయన దేహం కూడా సుగంధం కాదని, కనుక సంఘజీవనాన్ని అంగీకరించలేదని చెబుతారు. 'అవసరమైనప్పుడు తలచుకో! వస్తాను' అని తల్లికి

# మహాభారతం పాలక పాలితులెవరైనా ధర్మబద్ధులే

10




ధృతరాష్ట్రుని తాతయగు శంతనునకు రాజ్యాధికారము విచిత్ర పరిస్థితులో కలిగినది. ప్రతీప మహారాజునకు ముగ్గురు కుమారులు గలరు. వారు దేవాసి, బాహ్లిక, శంతనులు. వారిలో బాహ్లికుడు మేనమామల యింట పెరిగి, వారిని ఆశ్రయించినాడు. జ్యేష్ఠుడును కనిష్ఠుడును ఇచ్చటనే పెరుగుచుండిరి అందు పెద్దవాడు దేవాసి సజ్జనుడు, సమర్థుడు, సర్వజనప్రియుడు.

" దేవాసిస్తు మహాతేజాస్త్వ గ్దోషీ రాజ సత్తమః
ధార్మికః సత్యవాధిరా పితుః శుశ్రూష నే రథః
పౌర ధ్యాన పదానంత సమ్మతః సాధు సత్కృతః
సర్వేషాం బాల వృద్ధానాం దేవాసిర్హృదయంగమః
వదాన్యః సత్యసన్ధశ్చ సర్వ భూత హితేరతః
వర్తమానః పితుః శాస్త్రే బ్రాహ్మణానంత దైవత (ఉద్యో 149-17-19)

ఇట్టి సుజనుని రాజు చేయవలెనని ప్రతీపుడు తలంచెను కాని సద్గుణుడైనను త్వగ్దోష కళంకితుని రాజుగా ప్రజ స్వీకరించలేదు.

హీనాఙ్గం పృథివీపాలం నాభివన్దన్తి దేవతాః'

అని ప్రజ అతనిని నిరాకరించినారు. రాజు ఈ నిర్ణయమునకు తలయొగ్గక తప్పలేదు. అంతట దేవాన్ నగరమును వీడి వనములనాశ్రయించెను. ప్రతీపుడు కొన్నినాళ్ళకు మరణించెను. అంతట బాహ్లికానుమతితో శంతనుడు సింహాసనా రూఢుడయ్యెను. " ప్రియః ప్రజానామసి" అని కీర్తింపబడిన దేవానే రాజు కాదగడని ప్రజయే నిషేధించినా, మహారాజు మారుపలకలేదు. శంతనుడు రాజు గాకయు తప్పలేదు.

ఇట గమనింపవలసినది ఒక్కటి గలదు. ప్రజలకు అనుకూలురైనంత మాత్రమున, అతడు రాజుగా తగినవాడు అనలేము. వానిని శాస్త్రము ఒప్పవలెను. సర్వసద్గుణ సుశోభితుడైనను, తమకు అన్ని విధములను అనుకూలుడైనను. శాస్త్రము అంగీకరింపని వానిని రాజును సేయుటకు వారు అంగీకరింపలేదు. తామేది కోరిన అదియే తగునని ప్రజయనలేదు. రాజు నిరంకుశుడుగాడు. ప్రజయును నిరంకుశులు గారు. రాజైనను, ప్రజయైనను తామే సర్వస్వమనెడి తీరు నాడు గానరాదు. తామేది నిర్ణయించిన అదియే సర్వోత్తమమైనది అని వారు భావింప లేదు. ఎవరైననూ ధర్మమునకు బద్ధులైయుండవలసినదే తమ ఇష్టానిష్టములకు ధర్మమును బలిచేయు ప్రబుద్ధులు ఆనాటి వారు కారు. తాము ఏ ధర్మమును ఆశ్రయించిరో ఆ ధర్మమునే తిరస్కరించెడి అధికారము వారికే లేదుగదా! ధర్మోల్లంఘనమును చేయుటకు నాడు రాజైనను, ప్రజయైనను తాము సమర్థులమని యనుకొనలేదు. వారు రాజ్యాంగమున భాగముల మనుకొన్నారు. ధర్మమే వారిని తీర్చి దిద్దవలెననుకొన్నాడు. ధర్మమే వారిని రక్షించినది. 'మహాభారతము-ప్రజాపరిస్థితి'అనే ఈ వ్యాసాన్ని వర్తమానంతో తులనాత్మకంగా పరిశీలిస్తే అనేక అంశాలు బోధపడతాయి 'భారత కాలమున రాజు నిరంకుశుడు గాడు. ప్రజయును మూగవారు గారు. రాజు, ప్రజల మధ్య పొరపొచ్చెములు మచ్చుకైనను లేవు...రాజు నే కార్యమును తలపెట్టినను, ప్రజాభిప్రాయమును గోరి, వారి యనుమతితోడనే చేయుచుండెడివాడు.'అనే వాక్యాలను బట్టి రాజు ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవడం, ప్రజావ్యతిరేకత వెల్లువెత్తితే వాటిని ఉపసంహ రించుకోవడం వంటివి లేవని తెలుస్తోంది అదే సమయంలో ప్రజలను ప్రీతులుగా నొనర్చుటకై ప్రయత్నించెను. ప్రజా సమ్మతిని బడయుటకు బహువిధముల ప్రయత్నముగావించి వారిని తన కనుకూలముగా మార్చుకునుటకు యత్నించెను' అనే వాఖ్యము 'భూమిపై ఉన్నదంతా భారతంలో ఉన్నది' అనే వ్యాసుని వ్యాఖ్య ప్రతిబింబిస్తుంది. 'దుర్యోధనుడు కురుపాండవుల మధ్య రాజ్యాధికారం కోసం పెనగులాట చోటు చేసుకుంది తప్ప ప్రజాసంక్షేమానికి విఘాతం కలగలేదని ఈ వివరణాత్మక వ్యాసం బట్టి అవతగమవుతోంది.

'ధర్మో రక్షతి రక్షితః'

-డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి

'జాగృతి' 19-07-1965 సంచిక నుంచి

విన్నవించి తపోవనానికి వెళ్లాడని పురాణాలు పేర్కొంటున్నాయి.

రుషులు తపోధనాన్ని ఇతరులకు ధారాపోస్తారు కానీ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోరనే సూక్తిని అక్షరాల పాటించారు వ్యాసుడు.వారసత్వంలేక అంతరించి పోతుందనుకునే కురువంశాన్ని తమ తపశ్శక్తితో సంరక్షించాడు. సవతి సోదరులు చిత్రాంగద, విచిత్రవీరులు సంతానం లేకుండానే మరణించడంతో, తల్లి సూచన మేరకు తన తపోబలంతో వారి పత్నులు అంబిక, అంబాలికలకు ధృతరాష్ట్ర, పాండు రాజులును ప్రసాదించారు. తరువాతి తరంలో గాంధారి గర్భవిచ్ఛిత్తికి పాల్పడినప్పుడు గర్భస్రావ పిండాన్ని పాత్రల (కుండలలో)లో సంరక్షించి దుర్యోధనాదుల జననానికి కారకుడయ్యాడు. తాను కాపాడిన కౌరవ వంశం కూలిపోకుండా ఉండేందుకు, కురుక్షేత్ర యుద్ధ నివారణకు ప్రయత్నించాడు. త్రికాలవేది అయిన ఆయన భవిష్యత్ పరిణామాల పట్ల అవగాహన ఉన్నా. తన వంతు బాధ్యతగా పాండవ కౌరవులకు సమ దృష్టితో సలహాలు, సూచనలు ఇచ్చారు. విశిష్టమైన వైదిక, రాజధర్మాలతో పాటు సమాజ, వ్యక్తిగత, కుటుంబ ధర్మాలను విశ్లేషణాత్మ కంగా వివరించిన మహనీయుడు వ్యాసుడు.

కలియుగంలోనూ వేదవ్యాసుడి సాక్షాత్కారం పొందిన పరమపురుషులలో జగద్గురు ఆది శంకరులు ప్రథములు. వ్యాసభగవానుడి సూచన ప్రకారం శంకరులు ఆయన బ్రహ్మసూత్రాలకు భాష్యం రాశారని అందుకోసం ఆయన పదహారేళ్ల ఆయుర్దాయాన్ని రెట్టింపు అయ్యేలా వ్యాసుడు వరమిచ్చారని 'శంకరవిజయం' చెబుతోంది. ★

## వివేకానంద సూక్తిశతి

Whatever you think, that you will be,
If you think yourself weak,
\'weak you will be;
if you think yourself
strong, strong you will be.

దీనుడగుదువీను దీనుండవనుకొన్న
బలముగల్గునన్న బలయుతుడవు
నీవు దలచినట్లు నీవు కాగలవురా
వినుడి స్వామి సద్వివేకవాణి!!





బండిరాజుల శంకర్

కథ

# స్వధర్మే

విజయదశమి భోజనాలు గారెలు, అపడలు, పాయసం, పులిహోర, పిల్లలకు మిర్చిబజ్జీలతో అందరూ కలిసి ఏకపంక్తిన పూర్తి చేశారు. ఇక సాయంత్రం గుడిలో శమీపూజకు వెళ్లారు.

“గోపాలం నేను చెప్పినట్లు చెయ్యి! శివయ్య భవిష్యత్తు బాగుంటుంది. నీకూ ఆర్థికంగా లాభిస్తుంది! ఆలోచించు” అన్నాడు అన్నయ్య గోవింద దీక్షితులు!

గోవింద దీక్షితులు సెయింట్ జోసెఫ్స్ హై స్కూలులో ప్రథమ శ్రేణి తెలుగు పండితులుగా పని చేస్తున్నాడు. ఆ పాఠశాల హెడ్‌మాస్టరుకి, చర్చి ఫాదర్ (కరస్పాండెంట్)కి యాజమాన్యంలోని పెద్దలకు అందరికీ గోవిందయ్య పట్ల ప్రత్యేక గౌరవం, అభిమానం ఉన్నాయి. ఆ విషయాన్ని చాలా గర్వంగా చెప్పుకుంటారు దీక్షితులు..

దీక్షితులి పాండిత్యం విద్యార్హతలు చూచి ఉద్యోగమిచ్చారు. ఇంటర్వ్యూ చేసిన వారిలో ఒకరు “మీరు బ్రాహ్మణులు కదా! మతం మారి క్రైస్తవ మతంలోకి వస్తే మీకు చాలా ప్రయోజనాలుంటాయి ఆలోచించుకోండి” అన్నారు. తనని మతం మార్చుకో మన్నందుకు చాలా కోపం వచ్చింది. ఉద్రేకంతో గీతా శ్లోకం చెప్పాడు.

‘శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్

స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః (3-35)8..అంటూ అర్థాన్ని వివరించాడు. ఉద్యోగం కోసం మతం మార్చుకోను అవసరమైతే యాయావారం చేసుకుంటానన్నాడు.

చర్చి ఫాదర్ “సార్! సార్! ఆవేశం వద్దు. మీ



ఉద్యోగానికి అది కండిషన్ కాదు. మీ వంటి మహాపండితులు, మా పాఠశాలలో పని చేయటమే మాకు గొప్ప. మీరు వెంటనే ఉద్యోగంలో చేరండి" అన్నాడు.

గత పుష్కర కాలంగా అక్కడే పని చేస్తున్నారు దీక్షితులు. క్రైస్తవ విద్యా సంస్థలు హిందూ పండితులను ఎంత ఘనంగా గౌరవిస్తాయో అందరికీ గొప్పగా చెప్తామంటారు ఆయన.

* * *

తను ఉద్యోగంలో చేరిన సంవత్సరం తర్వాత అంటూ ప్రోత్సహించింది. దీక్షితులు ఆలోచించారు. రోజు సంధ్య వారుస్తూ, గాయత్రీ జపం, ఇష్టదేవతారాధన చేస్తున్నాను. పిల్లలకు బైబిల్ సూక్తులు చెప్పటంవల్ల నా ధర్మానుష్ఠానానికి ప్రమాదం లేదు. స్వీయ ఆరాధన అన్య ఆదరణ" సమ్మతమే!

* * *

కొంతకాలం తర్వాత "దీక్షితులు గారి క్రైస్తవ సూక్తిసుధ" అందమైన పుస్తకం చేశారు. ఉచితంగా విస్తృతంగా పంచారు. పట్టణం అనేక ప్రాంతాలలోని

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**

# నిర్ధనం

## చంద్రమౌళి రామనాథశర్మ

స్టాఫ్ మీటింగ్‌లో విద్యార్థులలో నైతికత, వ్యక్తిత్వ వికాసం కోసం అసెంబ్లీలో ప్రతి రోజు ఒక సూక్తిని వివరించటం మంచిదని గోవింద దీక్షితులు ప్రతిపాదించారు. అందరూ ఆమోదించారు. దీక్షితులు ఆ పని చేయటానికి సమర్థులుగా నిర్ణయించారు. క్రైస్తవ పాఠశాలలో సూక్తిసుధ కార్యక్రమము ప్రారంభించటం తన వ్యక్తిగత విజయంగా భావించి చాలా ఆనందపడ్డారు ఆయన. ఆ తరువాతి సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు ఉపాధ్యాయులు బాగా ఆనందిస్తున్నారు. ఒక రోజు స్కూలు అసెంబీకి చర్చి ఫాదర్ వచ్చి విన్నారు. దీక్షితులును తన గదికి పిలిపించుకొని, పుష్ప గుచ్ఛమిచ్చి శాలువా కప్పారు. "తమ సేవ అద్భుతం. తమరు మాకు గురుతుల్యులు' అంటూ... 'తమరు మూడు రోజులు సంస్కృత సూక్తులు, మూడు రోజులు బైబిల్ సూక్తులు చెప్పగోరెదను. ఈ సూక్తిసుధ సేవకు నెలకు ప్రత్యేక వేతనంగా 5000 రూపాయలు ఇస్తాము. బైబిల్ సూక్తులను నేను తమకు చెప్తాను. మీరు ఈ పని చేస్తే యాజమాన్యం ప్రజలు కూడా చాలా సంతోషిస్తారు" అన్నారు.



"నేను బైబిల్ చెప్పటం ఏమిటి సార్! ఆలోచించి చెప్తాను" అన్నారు దీక్షితులు. ఆ రాత్రి ఆయన భార్య "పాఠ్య పుస్తకంలో ఉ ండే ఏసు క్రీస్తును గూర్చి చెప్తున్నారు కదా! మీ బోధనలో భాగంగానే భావించి బైబిల్ సూక్తులు చెప్పండి 5000 వస్తాయి కదా!'

క్రైస్తవులు దీక్షితులి ఆశీస్సులు పొందుతున్నారు. ధనవంతులు విలువైన బహుమతులు ఇస్తున్నారు. అన్ని క్రైస్తవ సమాజాలు కారులో తీసుకొని వెళ్లి బైబిల్ సూక్తులు తెప్పించుకుంటున్నారు. సన్మానాలు చేస్తున్నారు. పొగడ్తలు... సన్మానాలతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. ప్రతి ఆదివారం వెళ్తున్నారు. నెలకు 50 వేలకు వరకు గిట్టుబాటు అవుతున్నది. కారు కొన్నారు.హోదా పెరిగింది! కుమార్తెలిద్దరు క్రైస్తవ విద్యాసంస్థలలో ఉన్నత విద్యలు చదివి ఒకరు అమెరికాలో, మరొకరు ఆస్ట్రేలియాలోనూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పెద్ద అమ్మాయికి అమెరికన్‌తో వివాహం జరిగింది. రెండో అమ్మాయి పెళ్లి చేయాలి.

* * *

బంధువులకు స్నేహితులకు జరుగుతున్నది తెలియటంలేదు. దీక్షితులుకు అంత సంపద ఎట్లా సమకూరుతున్నదో అర్థం కావటం లేదు. ఆయన ఇంట్లో నిత్యం పూజలు, జపాలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాలు జరుగుతున్నాయి. ఇంట్లో ఆయన నూటికి నూరు పాళ్లు హిందువు సత్ బ్రాహ్మణుడు! అనుమానం లేదు. ఆయన అతిథులను కలిసే డ్రాయింగ్ రూంలో రెండగుల ఏసుక్రీస్తు విగ్రహం, బుద్ధుడి విగ్రహం ఉంటాయట. ఆ గది తలుపులు ఎప్పుడూ మూసే ఉంటాయి.

తన ప్రవర్తన ఇంట్లో హిందువుగా ఆదివారం క్రైస్తవ ప్రచారం అధర్మం అనిపిస్తున్నది. బుద్ధి హెచ్చరిస్తున్నది! "స్వధర్మ ఆచరణ పరధర్మ ఆదరణ" కనుక తను ధర్మమే చేస్తున్నట్లు సమాధాన పడేవాడు.

వర్తమానంలోకి వచ్చి తమ్ముడు గోపాలం, "అన్నా! నీవు తోవ తప్పుతున్నావు. క్రైస్తవుడిగా మారి ప్రచారం చేస్తూ! అందరినీ మోసం చేస్తున్నావు. మన ఊరి జక్రియ్య పంతులు అన్ని విషయాలు చెప్పారు. నీతో కలసి పండుగ చేసుకోవటం నాకు ఇష్టం లేదు. అయినా కుటుంబబంధం వల్ల రమ్మన్నాను. నీవు క్రైస్తవుడిగా మారదలచుకుంటే, నాటకాలు ఆపి ఆ మతంలోకి వెళ్లిపో! మన బంధం తెగినట్లే! నీ మొహం నాకు చూపకు" అని గట్టిగా మాట్లాడాడు. గోవింద దీక్షితులు చిత్తరపోయాడు. వెంటనే భార్యను తీసుకొని పట్నం బయలుదేరాడు. ఆనందం లేదు! కారును గ్రామ దేవాలయం వద్ద ఆపాడు. శమీ వృక్షానికి నమస్కరించాడు. 'శమీ శమయతే పాపం..' శ్లోకం చదివి జమ్మి తీసుకొనివెళ్లాడు!

తర్వాత 10 రోజులకు విశాఖపట్నంలో క్రైస్తవ కూటమి సమావేశంలో గోవింద దీక్షితులు అనే హిందే బ్రాహ్మణుడు ఉపన్యాసిస్తూ "నేను హిందువుగా పుట్టాను. హిందువుగానే బతుకుతున్నాను. హిందువుగానే చచ్చిపోతాను. నేను మతం మారలేదు, మారను'' అని చెప్ప విషం తాగి వేదికపైన మరణించినట్లు పత్రికలలో వార్త వచ్చింది! గోపాలం కంటతడిపెట్టాడు.

ఆ మరునాడు గోపాలానికి గోవింద దీక్షితులు రాసిన జాబు అందినది. "గోపాలం! దేవుడు కూడా నన్ను క్షమించడు. నేను హిందువుగానే ఉంటూ పొగడ్తలకు, ప్రలోభాలకులొంగి క్రైస్తవ మతం ద్వారా ప్రయోజనాలు పొంది నా ధర్మానికి ద్రోహం చేశాను. నాకు లాగానే అనేక మంది క్రైస్తవులుగా ఉంటూ హిందువులు పొందవలసిన ప్రయోజనాలను పొందుతున్నారు. నువ్వు నా కళ్లు తెరిపించావు. మన జమ్మి నాకు పాప విముక్తి కల్గించింది. వచ్చేవారం విశాఖపట్నంలో ఒక కూటమి వెళ్తున్నాను. 5 లక్షల రూపాయలు అడ్వాన్సుగా తీసుకున్నాను. ఆ డబ్బు నీకు పంపుతున్నాను. శివయ్యను చదివించు.మళ్లీ జన్మలో కూడా మనం అన్నదమ్ములుగానే పుడదాం! నా పాపానికి ప్రాయశ్చిత్తం ఆలోచించాను! "

శాంతిః శాంతిః శాంతిః ★

**విలువిద్య....అర్జున పురస్కారం**
**అందుకున్న మహిళామణి శీతల్ దేవి.**
**కొత్త సంవత్సరాది తరుణంలో మహత్తర విశేషమిది!**
**ఎందుకంటే– ఆ ఆర్చరీ ఛాంపియన్‌కి చేతులు లేవు!'**
**అదేమిటి? అసలు చేతులు లేని ఆమెకు విలువిద్య**
**పురస్కారమా?'అని  నివ్వెరపోకండి.**
**కాళ్లనే చేతులుగా ఉపయోగించిన శక్తిరూపిణి ఆమె.**
**ఇంతకీ  ఆ అమ్మాయికి పదిహేడేళ్లే!!**
**హాట్సాఫ్ శీతల్ దేవీ!!!**



# శీతల్...

అరుదైన ఆకారం తనది. తాను సాధించిందీ ఎంతో అరుదైన ఘనతే! శీతల్‌ది జమ్మూకశ్మీర్‌లోని మారుమూల గ్రామం లోయిధర్ ఆమె పుట్టిన ఊరు. అతి సాధారణ కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణ విజయాలతో ఆశ్చర్యపరుస్తోంది.

తల్లిపేరు శక్తి. ఆ పేరులోని తీరు కూతురికి ప్రాప్తించింది. తండ్రి మన్‌సింగ్. శక్తి సంపన్నతనే నమ్మిన వ్యక్తి. పుట్టిన బిడ్డను చూసి ఆ దంపతులు నిర్ఘాంతపోయారు. షాక్ మెలియా అనే అరుదైన వ్యాధి ఫలితం ఆ పాప. అత్యంత అరుదైన రుగ్మత. లక్షమందిలో ఒకరికి సంక్రమించే అరుదైన రుగ్మత. చేతుల పైభాగం కనిపించదు. శరీరం లోపలే జోడించినట్లు ఉంటుంది.

నిలువునా కుంగిపోయిన అమ్మానాన్న వెంటనే తేరుకున్నారు. విధి వైచిత్రిని ఒక సవాలుగా స్వీకరించారు. అదీ, తల్లీ తండ్రీ, కూతురి గొప్పతనం.

'కుదిరితే పరిగెత్తు.... లేకపోతే నడువు
అదీ చేతకాకపోతే పాకుతూ పో



మోదీతో

అంతే కానీ – ఒకేచోట అలా
కదలకుండా ఉండిపోవద్దు.
అలాగే ఉండిపోతే ఎలా?
పారే నది, వీచే గాలి, ఊగే చెట్టు
ఏదీ ఆగదు; ఆగడానికి వీల్లేదు
అనుకున్నది సాధించి తీరాల్సిందే. నీలో....
కసికసిగా ప్రవహిస్తుందే ఆ నెత్తురు
దానితో సహా ఏదీ ఆగకూడదంతే.
లే... కదులు... ముందుకు సాగు...
సంకెళ్లను తెంచు. నువ్వు ఉన్నచోట నుంచే పరుగు ఆరంభించు?'

ఇదే శీతల్ పంతం, పట్టుదలా.

ఆ అమ్మాయి పేరులో చల్లదనం ఉన్నా తీరు మొత్తం సలసలకాగే వేడి తనమే. మహామహా ఉత్సాహం. అలుపూ సొలుపూ ఏ మాత్రం లేని, రాని శక్తితత్వం.ఆమెకు 12 సంవత్సరాలపుడు జిల్లా కేంద్రం కిష్త్వార్‌లో జరిగిన ఓ యువజన సమ్మేళనానికి వెళ్లింది.

ఆ కార్యక్రమాన్ని నిర్వహించింది రాష్ట్రీయ రైఫిల్స్. దేశంలో తీవ్రవాద వెన్ను విరిచిపారేసే సాయుధ దళం. యువశక్తిని చక్కగా వినియోగించుకునే భారతీయ బృందం. సైన్యంలోని కీలక విభాగం.

ఆ అధికారుల గుర్తించారీ అమ్మాయిని. అసాధారణ ఘన వియాలు సాధించే అద్భుతశక్తి ఆమె లోలోపల ఉందని గ్రహించారు. 'చేతుల్లో ఉండాల్సిన బలమంతా ఆమె కాళ్లలో కేంద్రీకృతమైందని గుర్తించారు. తన నైపుణ్య కేంద్రం అదే కాబట్టి, ఆ కాళ్లతోనే ఆమెకు ఇష్టమైన విలువిద్య శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. 'అమ్మాయీ! భవిష్యత్తు నీదే' అంటూ ప్రోత్సహించారు.వారి నమ్మకం వమ్ము కాలేదు. ఆమె ఆత్మవిశ్వాసంతో శిక్షణలో దూసుకెళ్లింది. ఏడాది తిరగకుండానే, 'జయహో' అనిపించింది.

విద్య, వైద్యం, శిక్షణ, సౌలభ్యం – అన్నింటా అంతటా గట్టి మద్దతు లభించిందా యువతికి. కాలంతో పాటే తన విశ్వాసశక్తీ సమాంతరంగా ప్రవహించింది. అమేయమైన ఆమె ఆత్మబలం ముందు అంతటి వైకల్యమూ తలవంచింది.

2023 సంవత్సరంలో 'నారీ భేరి' మోగింది.





# సవాల్

కేవలం ఆ ఒక్క ఏడాదిలోనే అన్ని రికార్డులనీ బద్దలు కొట్టిందా జగజ్జెట్టి. ఆసియా పారాలింపిక్ కమిటీ నుంచి 'అత్యుత్తమ యూత్ అథ్లెట్' అవార్డు సంపాదించింది. అదే సంవత్సరానికి సంబంధించి, అర్జున అవార్డు!

అంతకుముందు...2022లో వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్, డబుల్స్ విభాగాలలో 'హాంగ్‌జ్' వేదిక నుంచి పురస్కారాలు.

అవి నాలుగో ఆసియా పారాగేమ్స్. ఆసియా క్రీడలకు సమాంతరం. దివ్యాంగ అథ్లెట్ల కోసం ఏర్పాటైన విశ్వక్రీడోత్సవాలు. వాటిల్లో వరసగా అన్నింటిలోనూ అపార పటిమ చూపింది శీతల్‌దేవి. గత అక్టోబరులో చైనాలో ముగిసిన ఆ పోటీల్లో ఎంతో ధాటి కనబరచి, క్రీడా విశ్లేషకులతో 'శభాష్' అనిపించుకుంది. భేష్ భేష్ అని పురస్కృతులందచేసింది ఆసియన్ పారాలింపిక్ కమిటీ.

అది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని విఖ్యాత సంస్థ. ఆసియా ఖండంలోని పదుల కొద్దీ జాతీయస్థాయి కమిటీలకు అందులో సభ్యత్వముంది. అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీకి అనుబంధం. ఆ సంస్థ ఆమెను సమున్నత రీతిన సత్కరించింది. అథ్లెట్లు అందరికీ మార్గదర్శనిగా అభివర్ణించింది.

'వనితాలోకంలో ఆమె నవయువరాణి' అని ప్రసార ప్రచార సమాచార మాధ్యమాలు ప్రస్తుతించాయి. ఏ ఆయుధాలు లేకుండానే సమర రంగాన నిలిచి గెలిచిందని ఎంతగానో కొనియాడాయి. 'క్రీడా సముద్రాన పెను అలలు సృష్టించిన ధీరవనిత' అంటూ పతాక శీర్షికల్లో ప్రకటించాయి. పారాగేమ్స్‌లో మొట్టమొదటగా స్వర్ణపతకం గెలుచుకున్న యువతీలలామ, ఆత్మవిశ్వాసమే ఆమెకు రెక్కలని ప్రశంసించాయి.



**ఆ అమ్మాయి పేరులో చల్లదనం ఉన్నా తీరు మొత్తం సలసలకాగే వేడి తనమే. మహామహా ఉత్సాహం. అలుపూ సొలుపూ ఏ మాత్రం లేని, రాని శక్తితత్వం.ఆమెకు 12 సంవత్సరాలపుడు జిల్లా కేంద్రం కిష్వార్‌లో జరిగిన ఓ యువజన సమ్మేళనానికి వెళ్లింది.**

చేతులు లేకున్నా తన చేతలతో కూడా పతకాలనీ చేజిక్కించుకున్న ధీర చరితురాలని పత్రికలూ, టీవీలూ కీర్తించాయి.

'బెస్ట్ యూత్ అథ్లెట్ ఆఫ్ ఏషియన్ అవార్డ్స్'. ఆ మహోన్నత గౌరవం ఆమెకే సొంతమని దేశదేశాలూ శ్లాఘించాయి.

భారత ప్రభుత్వం 'అర్జున్' ప్రకటించింది. 'అర్జున' అనేది ఎంతెంతో సాధికారికం. అత్యుత్తమ క్రీడా ప్రదర్శనకు భారత ప్రభుత్వమే బహూకరించే శిఖరస్థాయి పురస్కారం.

విభిన్న శ్రేణి వైకల్యాలున్న విలు విద్య ధీరుల కోసం ఒక స్థాయి ఆట. ఆ క్రీడా మైదానంలో మెరుపులన్నింటినీ ఒక్కసారిగా మెరిపించిన ఆమెను ఆడపిల్ల... కేంద్రం పరమోన్నత తీరున సత్కరించింది. అంతర్జాతీయ ఆర్చరీ ఫెడరేషన్ శుభాకాంక్షల వర్షం కురిపించింది.

పిడికిలి, మణికట్టు, మోచేయి, భుజం – ఇవీ కదా ఏ మనిషికైనా ప్రథమ, ప్రధాన ఆధారాలు.



**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా అర్జున పురస్కారం అందుకుంటున్న శీతల్**

అవి లోపించినా, చెదరకుండా అదరకుండా బెదరకుండా విజయఢంకా మోగించిన ఆమెను దేశదేశాలూ అన్ని క్రీడా వ్యవస్థలూ అగ్రస్థానాన నిలబెట్టాయి.

ప్రపంచ నెంబర్ వన్ ఆర్చర్‌గా, పారా రంగాన దీటుగా మేటిగా ధాటగా వెలుగుతోంది. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున పురస్కారం స్వీకరణ వేళ శీతల్ భావోద్వేగం అనంతంగా మారింది... క్రీడోత్సవాల సాహసపథంలో దూసుకెళ్లిన యువతిని రాష్ట్రపతి నిండు మనసుతో ఆశీర్వదించారు. 'అమ్మాయీ! సాహసం అంటే నీదే, సాహసి ఎవరంటే నువ్వే' అంటూ అభినందనలతో ముంచెత్తారు.

యువశక్తికి తిరుగులేదు. ఎదురు ఉండదు.

అర్జునుడులానే ఈ అర్జున అవార్డీ మహిళా సవ్యసాచి.

రెండు చేతులతోనే ఒకే పని చేయగలగడం. కుడి, ఎడమచేతి పనిని ఒక్కసారిగా చేయడం. మరి.... చేతులు లేకున్నా విల్లు సంధించి ప్రయోగించి రికార్డులు సృష్టించిన మన శీతల్ దేవిని ఏమని పిలవాలి?

మీరే చెప్పండి. ★



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# హిందువులు గందరగోళంలో ఉండిపోయారు

భారతీయులుగా పుట్టినప్పటికీ కొందరిలో తమ మూలాలను అవమానించే, శంకించే గుణం పుష్కలంగా కనిపిస్తుంది. ఇక్కడ మెజారిటీలుగా ఉన్న హిందువుల మత విశ్వాసాలను, మనోభావాలను కించపరచడమే ధ్యేయంగా బతుకుతున్నారు. కానీ ఫ్రాంకాయిస్ గాటీర్ ఫ్రెంచ్ భాషా పత్రికా. భారతదేశంలో ఉంటూ ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా తన దేశంలోని ఎన్నో పత్రికలకు దక్షిణ ఆసియా సమాచారం ఇచ్చేవారు. జనవరి 22న అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ విజయంలో ఆయనకు కూడా పాత్ర ఉంది. అయోధ్యలో రామమందిరం నిర్మించాలన్న అతడి కల నెరవేరింది. 'ఇది చాలా గొప్ప విషయం. 1980, 1990 దశకాలలో నేను అయోధ్య అంశం మీద ఎన్నో వార్తా కథనాలు రాశాను. ఇలా కట్టడం కూల్చిన చోటే మందిర నిర్మాణం సాధ్యమవుతుందని ఆనాడు నేను ఊహించలేకపోయాను.' అన్నారాయన. ఆనాడు హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, మార్క్సిస్టులు అంతా ఒకే గూటి పక్షుల్లా ఉండేవారని, కానీ హిందువుల కోసం ప్రత్యేకంగా మాట్లాడేవారు పరిమితంగా ఉండేవారని అన్నారు. ఇప్పుడు ఆ దృశ్యం పూర్తిగా మారిందని గుర్తు చేసుకున్నారు. అప్పుడు హిందువులు చేసిన ప్రతి ఉద్యమానికి ఫ్రాంకాయిస్ మద్దతు ఇచ్చారు. ఇది భారత ప్రధాని నరేంద్ర మోదీ వల్ల మాత్రమే సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికలలోను ఆయనదే గెలుపని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, ప్రధానంగా రాహుల్ గాంధీ వర్తమానంలో జీవించాలని హితవు పలికారు.

'దాదాపు 15 శతాబ్దాల పాటు భారత్ మీద రక్తపాతంతో కూడిన దారుణ దండయాత్రలు జరిగాయి. వీరిని బానిసలను చేశారు. లక్షలాది దేవాలయాలను నేలకూల్చారు. తాజాగా రామ మందిరం ప్రాణప్రతిష్ఠతో తొలిసారి హిందువులలో అంకురించిన ఐక్య భావనకు ప్రతీక ఈ మందిరమని ఫ్రాంకాయిస్ అన్నారు. చిరకాలంగా హిందువుల తమ అస్తిత్వం గురించి తీవ్ర గందరగోళంలో ఉండిపోయారని, బ్రిటిష్ వలస ప్రభావం భారతీయుల మెదళ్ల మీద చాలా బలమైన ప్రభావం చూపిందని అన్నారు. ఈ ప్రభావమే పాశ్చాత్య ప్రపంచం నుంచి వచ్చిన ఏదైనా గొప్పదేనన్న భావనతో ఆలోచించే టట్టు చేసిందని చెప్పారాయన. ఫ్రాంకాయిస్



# జనక్‌పురిలోను రెండో దీపావళి

నేపాల్‌లోని జనక్‌పురిని సీతామ్మవారి పుట్టిల్లుగా చెప్పుకుంటారు. జనవరి 22 అయోధ్య ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆ పట్టణంలో ఆ సాయంకాలం 2.5 లక్షల దీపాలు వెలిగించారు. ప్రాణప్రతిష్ఠకు వారం ముందు నుంచే అక్కడ అలంకరణలు మొదలయ్యాయి. దీపాలతో పాటు జైసీతారాం అన్న అక్షరాలతో కూడిన ముగ్గులు కూడా వేశారు. గంట పాటు శ్రమించి దీపాలు వెలిగించి ఆ దివ్య వెలుగులను చూసి అంతా ఆనందించారు. ఆ రోజు ఉదయం అక్కడ కూడా ఊరేగింపులు నిర్వహించారు. పెద్ద టీవీలు ఏర్పాటు చేసుకుని అయోధ్య ఉత్సవానికి తిలకరించారు. జనక్‌పురి సీతాదేవి ఆలయ ప్రధాన పూజారి చొటే మహంత్ కూడా హాజరయ్యారు. ★

# జమ్ముకశ్మీర్ అంతటా గణతంత్ర వేడుకలు



గణతంత్ర దినోత్సవం లేదా ఆగస్ట్ 15 ఏ జాతీయ ఉత్సవమైనా ఆ రోజును జమ్ముకశ్మీర్‌లో ఏం జరుగుతుందోనని భారత్ అంతటా గుబులు ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ గణతంత్ర వేడుకలు కూడా ప్రశాంతంగా అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలోను జరిగాయి. అందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జమ్ములోని ఎంఏ మైదానంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనడానికి మన సమాజం ఐక్యంగా, ధైర్యంగా, క్రమశిక్షణతో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీనగర్‌లోని బక్షి మైదానంలో జరిగిన ప్రధాన వేడుకకు లెఫ్టినెంట్ గవర్నర్ సలహాదారు రాజేష్‌రాయ్ భట్నాగర్ హాజరయ్యారు. ఎముకలు కొరికే చలిలోనూ పోలీసు, సీఆర్‌పీఎఫ్, ఎన్‌సీసీ, ఎస్ఎస్‌బీ సభ్యులు, విద్యార్థులు కూడా కవాతులో పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అని విధాలా పాటు పడుతున్నదని భట్నాగర్ చెప్పారు. 2022లో 1.88 కోట్లు, 2023లో 2.11 కోట్ల మంది పర్యాటకులు కశ్మీర్‌కు వచ్చారని భట్నాగర్ తెలియచేశారు. పీఎస్‌సీ, ఎస్ఎస్ఆర్‌బీల ద్వారా 31 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కూడా చెప్పారు. మైదానమంతా చుట్టిన తీరులో అతి పెద్ద మూడు రంగుల వస్త్రాన్ని కట్టారు. అంతటా జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. మొత్తానికి అక్కడ జాతీయ భావన వెల్లివిరిసింది. జనం బక్షీ మైదానంలోకి రావడానికి బారులు తీరారు. ★

# కమ్యూనిస్టు విద్యార్థులు

కమ్యూనిస్టులంటేనే విజ్ఞత లేని మూక. ఇక దాని అనుబంధ విద్యార్థి సంఘాల గురించి చెప్పేదేముంది? కేరళ గవర్నర్ మీద కక్ష కట్టి వ్యవహరిస్తున్న సంస్థ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ). పేరుకు విద్యార్థి సంఘమే అయినా ఇది నేరగాళ్లకీ, గూండాలకీ నిలయం. జనవరి 27వ తేదీన కేరళలో జరిగిన తాజా ఉదంతం దీనిని మరొకసారి రుజువు చేసింది. కొట్టారక్కర్ అనే చోట ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తిరువనంతపురం నుంచి వెళుతుంటే, దారిలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు నల్లజెండాలు చూపుతూ కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. 'సంఘీ గవర్నర్ వెనక్కి పో' అంటూ నినాదాలు చేశారు. గవర్నర్ కిందకి దిగి 'ఆవో' (రండి) అంటూ సవాలు విసిరి వారి మీదకు వెళ్లారు. అయితే పోలీసులు వచ్చి గవర్నర్



ఫ్రాంకాయిస్

2012లో పుణేలో ఒక మ్యూజియం ఏర్పాటు చేశారు. దాని పేరు శివాజీ మహారాజ్ మ్యూజియం ఆఫ్ హిస్టరీ మ్యూజియం. అది లాభాపేక్షతో ఏర్పాటు చేసినది కాకుండా, రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాలు పెంచడానికి చేశారు.

1980, 1990 దశకాలలో భారత్‌లో జరిగిన సైద్ధాంతిక యుద్ధాలను యువతరం తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వాటిలో తాను కూడా పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. ‘సీతారాం గోయెల్ గొప్ప ద్రష్ట, అలాగే అసాధారణ హిందువు. హిందూ పునరుజ్జీవనోద్యమానికి బాటలు వేసినవారు ఆయనే. హిందువులకు మేధోపరమైన మద్దతును కూడగట్ట డానికి రాజీవ్ మల్హోత్రా సంపదను, ఆరోగ్యాన్ని కూడా ధారపోశారు. బెల్జియం జాతీయుడైన కొన్రాడ్ ఎల్స్ భారతదేశ చరిత్రను,సంస్కృతిని అధ్యయనం చేసిన గొప్ప పండితుడు.‘నెహ్రూవియన్ చరిత్రకారులు రోమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ వంటివారు చెబుతున్న, ముస్లింలు, మార్క్సిస్టులు గుర్తించడానికి నిరాకరిస్తున్న అంశాల గురించి, ముస్లింల దండ యాత్రలను మరుగు పరచడానికి చేస్తున్న ప్రయత్నాల మీద మొదట పైన చెప్పుకున్న వారే గళమెత్తారు. నిజం చెప్పాలంటే ప్రపంచంలో శాంతియుతంగా విస్తరించిన ఏకైక మతం హిందూత్వ అని ఫ్రాంకాయిస్ స్పష్టం చేశారు. 3500 ఏళ్ల చరిత్రలో ఎక్కడా హిందువులు పరదేశం మీద సైనిక దాడి చేయలేదని, వారి మతాన్ని రుద్దడానికి కూడా ప్రయత్నం చేయలేదని, మతాంతరీకరణలకు పాల్పడలేదని అన్నారు. వాస్తవం చెప్పాలంటే మతం పట్ల తక్కువ పట్టింపు ఉన్న వారు హిందువులలో తప్ప వేరే మతంలో కనిపించరని, కానీ హిందూ మతోన్మాదం అంటూ అమాయకులను చంపే మతోన్మాదులతో వారిని పోల్చడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందని ఫ్రాంకాయిస్ ఆవేదన వ్యక్తం చేశారు. ★

# బాలక్‌రామ్ శిల్పి అరుణ్‌కు సత్కారం



అయోధ్య భవ్య మందిరంలో ప్రతిష్ఠించిన బాలరాముని ప్రతిమ ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఆధునిక అద్భుత కళాఖండం. ఇంతటి ప్రతిభను చూపినందుకు శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ జనవరి 28న ఒక ప్రత్యేక కార్యక్రమంలో సత్కరించారు. అరుణ్ కర్ణాటకకు చెందిన వారే. శిలాన్ని చెక్కడానికి తాను ఎంత తపన పడినది ఈ సమావేశంలో అరుణ్ వెల్లడించారు. అయితే ఆ శిల్పం కోసం కృష్ణశిలను తీసుకువచ్చిన గని యజమాని మీద కర్ణాటక ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం రూ. 80,000 జరిమానా విధించింది. అక్రమ గని తవ్వకం పేరుతో ఈ జరిమానా విధించడం గమనార్హం.



సిబ్బందికీ, విద్యార్థులకీ మధ్య నిలిచి ప్రమాదాన్ని నివారించారు. దీనితో గవర్నర్ అక్కడే ఒక చిన్న హోటల్ నుంచి కుర్చీ తెప్పించుకుని రోడ్డు పక్కన వేయించుకుని కూర్చున్నారు. పోలీస్ కమిషనర్‌ను పిలవండి లేదా ప్రధాని కార్యాలయానికి ఫోన్ చేయండి అంటూ తన రక్షణ సిబ్బందిని ఆదేశిం చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడి మీద క్రిమినల్ కేసులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి అతడిని కాపాడు తున్నారని ఖాన్ ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇలా వెళుతుంటే విద్యార్థులు ఇలా నిరసనలకు దిగడానికి అనుమతించేవారేనా అని కూడా ప్రశ్నించారు. దాదాపు రెండు గంటలు రోడ్డు మీద బైఠాయించిన ఖాన్ చివరికి పోలీసులు ప్రదర్శనకారుల మీద కేసులు పెట్టిన తరువాత శాంతించారు. మొత్తం 17 మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తల మీద ఎఫ్ఐఆర్ లను చేతికి ఇచ్చిన తరువాత మాత్రమే ఆయన దీక్ష విరమించారు. నిజానికి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను ఎస్ఎఫ్ఐ వెంటాడడం కొత్త కాదు. కొద్దికాలంగా ఇదే జరుగుతున్నది. ఇదంతా ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఆదేశాలతో జరుగుతున్నదని కొద్దికాలం క్రితమే గవర్నర్ ఆరోపించారు కూడా. ఇంత జరిగిన తరువాత పినరయ్ విజయన్ అనే సంస్కార హీన ముఖ్యమంత్రి గవర్నర్ తన వాహనం నుంచి దిగడం సరికాదనీ, ఇది ప్రజాస్వామ్యా నికి విరుద్ధమనీ ధర్మపన్నాలు వల్లించాడు. అతని కంటె ఘనుడు ముఖ్యమంత్రి పినరయ్ విజయన్. ఎస్ఎఫ్ఐని ఒక్కమాట కూడా అనకుండా, అసలు గవర్నర్ వాహనం దిగడమే ప్రోటోకాల్‌కు విరుద్ధం. అలాగే రోడ్డు పక్కన బైఠాయించడం అప్రజాస్వామికం అంటూ నీతిసూత్రాలు ప్రబోధించాడు. ★



# అంబేడ్కర్ పేరు చెప్పి అమానుషం


హక్కుల రక్షణకు అంతా ఉపయోగించుకునే పేరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. కానీ ఆయన పేరుతోనే అత్యాచారాలకు ఒడిగడితే ఏమనాలి? అన్ని అరాచకాలకు కేంద్రంగా మారిపోయిన కర్ణాటకలో గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు గురువారం కలుబురిగిలోని ఒక విద్యార్థి వసతి గృహంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. అంబేడ్కర్ పూజకు రావడానికి నిరాకరించినందుకు కొందరు సహ విద్యార్థులు ఒక విద్యార్థినిని అంబేడ్కర్ పటంతో అర్ధనగ్నంగా రోడ్ల మీద తిప్పారు. తనకు వేరే పని ఉంది చెప్పి పూజకు రానందుకు ఆగ్రహించి ఆ విద్యార్థులు ఇలాంటి శిక్ష వేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ★

**1977లో కర్పూరి ఠాకూర్ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో, లోక్‌నాయక్ జేపీ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్నాలో జనతా పార్టీ నేతలు సమావేశమయ్యారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు అనేకమంది ప్రముఖులతో కలసి ముఖ్యమంత్రి హోదాలో కర్పూరి ఠాకూర్ కూడా వెళ్లారు. ఆయన కుర్తా చిరిగి ఉంది. ఇది చూసి చంద్రశేఖర్ (జనతా పార్టీ అధ్యక్షుడు, తరువాత ప్రధాని) తనదైన శైలిలో కర్పూరి ఠాకూర్ కొత్త కుర్తా కొనుక్కోవడానికి కొంత డబ్బు విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆ డబ్బు కర్పూరి ఠాకూర్ స్వీకరించారు కూడా. కానీ క్షణం ఆలోచించకుండా, ఆ మొత్తాన్నిముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. కర్పూరి ఠాకూర్ వ్యక్తిత్వం ఎలాంటిదో చెప్పే ఒక ఉదాహరణ మాత్రమే ఇది.**

# జననాయక్‌కు భారతరత్న

కర్పూరి ఠాకూర్... ఈ పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది, అయన నిరాడంబరత. సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం, చేసిన తపస్సు.

వందేళ్ల నాడు జనవరి 24,1924న బిహార్‌లోని సమస్తిపూర్‌లో, నిరు పేద వెనుకబడిన వర్గాల వారి కుటుంబంలో జన్మించిన, కర్పూరి ఠాకూర్, ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. సామాజిక న్యాయం లక్ష్యంగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం సాగించారు. స్వల్ప కాలమే అయినా రెండుసార్లు, (1970 డిసెంబర్ నుంచి 1971 జూన్ వరకు మొదటిసారి, 1977 జూన్ నుంచి 1979ఏప్రిల్ వరకు రెండవసారి) ముఖ్యమంత్రిగా సేవలందించారు. అంతకు ముందు, తొలిసారిగా 1952 సోషలిస్ట్ పార్టీ సభ్యునిగా అసెంబ్లీ అడుగు పెట్టిన నాటి, నుంచి శాసనసభ్యునిగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా ఇంకా అనేక హోదాల్లో వివిధ పదవుల్లో సేవలందించారు. నిజమైన ప్రజా ప్రతినిధికి నిలువెత్తు నిదర్శనంగా కర్పూరీ ఠాకూర్ నిలిచారు.


కర్పూరి ఠాకూర్

కర్పూరి ఠాకూర్, పేరుకు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినా, అధికారంలో ఉన్నది కొద్ది కాలమే అయినా,ఆ కొద్ది కాలంలోనే సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. సామాజిక న్యాయం అనగానే ఆయన రూపమే గుర్తుకు వచ్చేలా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. కర్పూరి ఠాకూర్ ఈ నాటికీ, బిహార్ ప్రజల గుండెల్లో ముఖ్యంగా బడుగులు, నిరుపేదల గుండెల్లో, జననాయక్'గా పదిలంగా ఉన్నారు.

**ఒక్కరే కాదు ...**

ఒక్క కర్పూరి ఠాకూర్ అనే కాదు, అలాంటి మహనీయులు, మహా పురుషులు ఎందరో ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ, భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను కుటుంబ చట్రంలోకి కుదించి వేసింది. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో భాగస్వాములైన మహనీయులు ఎందరినో మరుగు పరిచింది. అంతే కాదు, నెహ్రూ గాంధీ కుటుంబం పాలనలో సాగిన కాంగ్రెస్ ప్రభుత్వాలు, కాంగ్రెస్ సారధ్య సంకీర్ణ ప్రభుత్వాలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న, ఎన్నో త్యాగాలు చేసిన నాయకులు సహా జాతీయ నాయకులను, మరీ ముఖ్యంగా నిమ్నవర్గాలకు చెందిన నాయకులను గుర్తించలేదు. గౌరవించలేదు. ఇంకా చెప్పాలంటే చిన్నచూపు చూసింది. ఈ రోజుకూ కాంగ్రెస్ పార్టీది అదే వైఖరి. నిమ్నవర్గాలను ఓటు బ్యాంకుగా చూస్తుందే, కానీ, మనుషులుగా చూడడం మరిచిపోయింది.

ముఖ్యంగా నిమ్నవర్గాలకు, బడుగుజీవులకు అన్నింటా జరిగిన అన్యాయమే పురస్కారాల విషయంలోనూ జరిగింది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను సైతం కాంగ్రెస్ ప్రభుత్వాలు అవమానించాయి. నెహ్రూ, ఇందిర తమకు తామే భారతరత్న పురస్కారం ఇచ్చుకున్నారే కానీ, అన్ని విధాల అర్హుడైనా అంబేద్కర్‌ను భారతరత్నతో గౌరవించాలన్న ఆలోచన చేయలేదు. చివరకు 1990లో విశ్వనాథ ప్రతాప సింగ్ ప్రభుత్వం మరణానంతరం 'భారతరత్న'తో

సత్కరించింది. జాతీయ పురస్కారాల విషయంలో రాజకీయ తూకాలు, కొలతలు ఘనంగా పనిచేస్తూ వచ్చాయి. అందుకే అనంతర కాలంలో అవార్డు వాపసీ మేధావులు పుట్టుకొచ్చారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొత్త వరవడికి శ్రీకారం చుట్టారు. రాజకీయ ప్రాతిపదికన పురస్కారాలను తొడిగే సంస్కృతికి చుక్క పెట్టారు. అసామాన్యులుగా ఎదిగిన సామాన్యులను గుర్తించి గౌరవించే సంస్కృతికి శ్రీకారం చుట్టారు. సమాజంలో మార్పు కోసం క్షేత్ర స్థాయిలో కృషి చేసిన సామాన్యులను జాతీయ పురస్కారాలతో సత్కరించారు. తాజాగా ప్రస్తుత సంవత్సరానికి పద్మ పురస్కారాల ప్రకటన నేపథ్యంగా, ఇదే విషయాన్ని ప్రధాని ఆకాశవాణి మన్ కీ బాత్‌లో మరో మారు ప్రస్తావించారు.

**జననేతకు భారతరత్న**

ఆ క్రమంలోనే స్వయంగా అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం, జననేత కర్పూరి ఠాకూర్ సేవలను గుర్తింపుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం, 'భారతరత్న' ప్రకటించింది.

మట్టిలో మాణిక్యంలా ఎదిగొచ్చిన బడుగుజీవి కర్పూరీ ఠాకూర్ ఈరోజుకూ చీకటిబతుకులకు వెలుగురేఖగా నిలిచారు. ప్రధానమంత్రి అన్నట్లుగా, దివంగత కర్పూరి ఠాకూర్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివి, మరపురానివి. జననాయక్ కర్పూరి ఠాకూర్ వ్యక్తిత్వ విశేషాలను,ఆయన వదిలి వెళ్లిన విలువలను గుర్తు చేసుకుంటే, ఇప్పుడు కాదు, ఎప్పుడోనే, ఆయనకు ఆ గౌరవం దక్కవలసింది. నిజానికి, కర్పూరి ఠాకూర్ ఈ తరానికే కాదు, భవిష్యత్ తరాలకు సైతం ఆదర్శపురుషునిగా నిలుస్తారు. నమ్మిన విలువలకు ప్రాణ పోసిన పుణ్య మూర్తి కర్పూరి ఠాకూర్, అందుకే, ఒక్క బిహార్ అనే కాదు, దేశంలో ఎక్కడైనా సామాజిక న్యాయం అనగానే, కర్పూరి ఠాకూర్ స్ఫురణకొస్తారు. అంతటిమహనీయునికి మరణానంతరం అయినా భారత దేశ అత్యున్నత పౌర పురస్కారం, 'భారతరత్న'తో సత్కరించుకోవడం, మన అదృష్టం. ఒక విధంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిమ్న జాతులకు ఇచ్చిన మరో కానుక. మరో భరోసా.

**ఆదర్శపురుషుడు**

ఆదర్శాలు అందరికీ ఉంటాయి, కానీ, వాటి ఆచరణ రూపం ఇచ్చే మహనీయులు కొందరే ఉంటారు. కర్పూరి ఠాకూర్ ఆ రెండవ కోవకు చెందిన మహనీయుల జాబితాలో ముందు వరసలో ఉంటారు. ఏ నాడు స్వలాభం చూసుకోలేదు. అలాగే, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఏ నాడు నమ్మిన సిద్ధాంతాలను, ఆదర్శాలను వదులుకోలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నా, కుమార్తె వివాహం కోసం సొంత సొమ్ములు ఖర్చుచేశారే, తప్ప సర్కార్ సొమ్ము ముట్టలేదు. చివరకు సొంత ఆస్తి అనేది చిల్లి గవ్వ అయినా లేకుండానే తనువు చాలించారు. ఆయన కన్ను మూసిన సమయంలో ఆయన నివాసానికి చేరుకున్న అనేక మంది ప్రముఖులు, ఆ ఇంటిని, ఇంటి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారంటే, ఆయన చివరిక్షణం వరకు ఎంత నిజాయతీగా నిరాడంబరంగా జీవించారో వేరే చెప్పనక్కరలేదు. జననాయక్ కర్పూరి ఠాకూర్ ఆస్తులు సంపాదించుకోలేదు. కానీ, కోట్లాదిమంది పేద, బడుగుజనుల జీవితాల్లో కర్పూరకాంతులు వెలిగించారు. అందుకే ఆయన కర్పూర క్రాంతి హారతులు అందుకుంటున్నారు.

**ప్రధాని మాటల్లో**

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించిన సమయంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, "నిరాడంబరంగా జీవించిన జన్‌నాయక్ కర్పూరి ఠాకూర్ సామాజిక న్యాయం కోసం పోరాడారు. ఆ పోరాటమే ఆయన జీవితం. తన చివరిశ్వాస వరకు నిరాడంబరమైన జీవనశైలి అనుసరించిన కరూరి ఠాకూర్ సామాన్య ప్రజలతో మమేకమై సామాజిక న్యాయం కోసం కృషి చేశారు" చేసిన వ్యాఖ్య స్వర్గీయనేత గొప్పతనాన్ని కళ్లకు కట్టింది. స్వర్గీయ కర్పూరి ఠాకూర్ నిరాడంబరత చాటిచెప్పే ఉదంతాలను కూడా మోదీ గుర్తుచేసుకున్నారు.


**అడుగు జాడల్లో**

నరేంద్ర మోదీ జన్‌నాయక్ కర్పూరి ఠాకూర్



**రాజనాల బాలకృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్

భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకున్నారు. ఆ విషయం ఆయనే చెప్పారు. "గత పదేళ్లుగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది" అని పేర్కొన్నారు. నిమ్న వర్గాల అభ్యున్నతికి గత ప్రభుత్వాల విధానాలకు భిన్నంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అందుకే, పదేళ్ల కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందారు. కర్పూరి ఠాకూర్‌కు ఇంతకు మించి ఇవ్వగల నివాళి మరొకటి ఉండదు. సామాజిక న్యాయం సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అందుకే, ప్రభుత్వ విధానాలు, సాధించిన విజయాలు చూసి జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను, అన్నారు ప్రధాని. మోదీ ప్రభుత్వం సామాజిక న్యాయ సంకల్పంతో ముందుకు సాగుతుంది. ఈ నేపథ్యంలో కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడం. బడుగుజీవుల జననేతకు కర్పూర హారతి. ★





# ఉద్యోగం వీడి..

జనవరి 22న అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ వేళ బాలరాముడి విగ్రహం తొలిసారి టీవీ తెరల మీద దర్శనమీయగానే భారతీయులు పులకించిపోయారంటే అతిశయోక్తి కాదు. నిజంగా దివ్య మంగళ విగ్రహమే. అంతటి భవ్య మందిరానికి ఎంత పేరు వచ్చిందో, గర్భాలయంలో ప్రతిష్ఠించు కున్న 51 అంగుళాల కృష్ణశిలతో చెక్కిన బాలక్ రామ్ ప్రతిమకు కూడా అంతే ఆకర్షణ కనిపించింది. ఐదేళ్ల వయసు ఉన్న బాలుని రూపంలో చెక్కిన ప్రతిమ. సమ్మోహనమైన చిరు దరహాసం, దివ్యత్వం వర్షిస్తున్న కళ్లు, వాటి మధ్యనే పొటమరించిన బాల్యపు జాడలు అద్భుతం. ఎంత కళాత్మకమో, అంతటి ఆధ్యాత్మికానుభూతి జనితం. ఈ ఘనత అంతా ఆ శిల్పాన్ని చెక్కిన అరుణ్ యోగిరాజ్‌దే. ఇప్పుడు అంతా ఆయన గురించి మాట్లాడుతున్నారు. స్వతహాగా

తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం మేరకు అరుణ్ యోగిరాజ్ జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠ ఉత్సవానికి హాజరయ్యారు. జనవరి 24న తిరిగి స్వరాష్ట్రానికి వచ్చినప్పుడు బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించడం విశేషం. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన వేలాది మంది బీజేపీ కార్యకర్తలు అరుణ్‌ను పూలమాలలతో ముంచెత్తారు. ఒక శిల్పం ఒక ప్రాంతానికి తెచ్చిన గౌరవంగా వారంతా భావించారు.

అయోధ్య బాలక్‌రామ్ ప్రతిమ మన కాలంలో చెక్కినదేనా? ఈ ప్రశ్న కూడా వస్తుంది. బేలూరు, హళేబీడ్‌లోని శిల్ప సంపదను గుర్తుకొస్తుంది చూస్తుంటే. కంచిలోని కామాక్షి అమ్మవారి ముఖంలోని వర్చస్సు స్ఫురణకు వస్తుంది. అంతటి శిల్ప విజ్ఞానం. అవన్నీ నల్లరాయితో చెక్కినవే. ఒక గొప్ప శిల్పుల వారసత్వం అరుణ్‌యోగిరాజ్‌లో కనిపిస్తుంది. ముగ్గురు శిల్పుల కళాఖండాలు గర్భాలయంలో స్థానం కోసం పోటీ పడినా చివరికి అరుణ్ చెక్కిన శిల్పానికే ఆ అవకాశం దక్కింది. అరుణ్‌తో జీఎల్ భట్, సత్యనారాయణ పాండే అనే ఇద్దరు శిల్పులు కూడా పోటీ పడ్డారు. నా మీద నా కుటుంబం మీద శ్రీరాముడి దయ ఎల్లవేళలా ఉంటుందనే నా నమ్మకం అన్నారు అరుణ్. తాను చెక్కిన శిల్పానికి ఇంతటి అదృష్టం పట్టిందంటే అందుకు కారణం, తన పూర్వికుల, తన కుటుంబం ఆశీర్వాదం ఎంతో ఉందని కూడా ఆయన సవినయంగా చెప్పుకున్నారు.

అరుణ్ శిల్పుల కుటుంబానికి చెందిన వారే. ఐదు తరాలుగా వారంతా శిల్పులు. ఎంబీయే చదివిన అరుణ్ కొద్దికాలం ఉద్యోగం కూడా చేశారు. కానీ ఆయన వారసత్వం ఆ ఉద్యోగంలో ఉండనీయలేదు. కేవలం ఆరు మాసాలకే ఉద్యోగం వదిలి మైసూరు వచ్చి ఉలి పట్టారు. ఆయన కళాతృష్ణకు, సృజనాత్మకతకు ఎల్లలు లేవని రుజువైంది. మైసూరుకు చెందిన ఆయన కుటుంబం 250 సంవత్సరాలుగా శిల్పాలు మలిచే పనిలోనే ఉన్నది. అరుణ్ 11వ ఏటనే తండ్రి యోగిరాజ్‌కు సహకరించేవారు. శిల్పకళలో అరుణ్‌కు తండ్రే గురువు. ఉద్యోగం వదిలి పెట్టి మళ్లీ శిల్పిగా జీవితం గడపాలన్న ఆయన నిర్ణయాన్ని తండ్రి వెంటనే స్వాగతించారు. కానీ తల్లి మాత్రం కొంతకాలం పాటు సర్దుకోలేకపోయారు. 2014లో కుమారుడికి దక్షిణ భారత యువ ప్రతిభా పురస్కారం వచ్చిన తరువాత మాత్రమే ఆమె అరుణ్ అభీష్టాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు. అరుణ్ తాతగారి పేరు బి.బసవన్న శిల్పి. మైసూరు సంస్థానంలో శిల్పాచార్యుడు. సంస్థానంలోనే ఉన్న శిల్పి సిద్ధాంతి సిద్ధలింగ వద్ద కళను నేర్చుకున్నారు. మైసూరు రాజప్రాసాదం దగ్గర నిర్మించిన గాయత్రి ఆలయానికి





# ఉలి పట్టి

రామభక్తుడైన అరుణ్ యోగిరాజ్ కూడా తన అంతటి అదృష్టవంతుడు ప్రపంచంలోనే లేడని భావిస్తున్నారు. ఒక దేవతామూర్తి గురించి ఇంత చర్చ జరగడం ఇటీవల కాలంలో ఇప్పుడే. ఆ విగ్రహాన్ని పూర్తి చేయడానికి అరుణ్ ఆరు మాసాలు కుటుంబానికి దూరంగా ఉండి, రేయింబవళ్లు శ్రమించారని ఆయన భార్య విజేత చెప్పారు.


మోదీకి బోస్ విగ్రహాన్ని అందిస్తున్న అరుణ్ యోగిరాజ్

11 మాసాలలో 64 విగ్రహాలను అందించిన చరిత్ర బసవన్న శిల్పికి ఉంది. ఇప్పుడు అరుణ్ 15 మంది బృందంతో కలసి శిల్పాలు చెక్కుతున్నారు. ఆయన సంస్థ పేరు బ్రహ్మర్షి కాశ్యప శిల్పకళాశాల ట్రస్ట్. మైసూరులోనే ఉంది. కొద్ది మంది విద్యార్థులు కూడా ఉన్నారు. వీరికి ఉచితంగానే ఆయన విద్య నేర్పుతారు. అమెరికా, మలేసియాల నుంచి కూడా విగ్రహాల కోసం ఆయనకు వర్తమానాలు వచ్చాయి.

అరుణ్ వయసు 38 ఏళ్లే అయినా శిల్పిగా, అందునా దేవతామూర్తుల శిల్పిగా ఆయన చూపిన ప్రతిభ ఘనమైనది. సాధించిన విజయాలు అద్భుతం.

కేదార్‌నాథ్‌లో ప్రధాని మోదీ ప్రతిష్ఠించిన 12 అడుగుల ఆదిశంకరాచార్యుల అద్భుత ప్రతిమ అరుణ్ చెక్కినదే. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఆవిష్కరించిన సుభాశ్‌చంద్ర బోస్ విగ్రహం కూడా ఆయన శిల్పించినదే. మైసూరు జిల్లా చంచాన్‌కట్టేలో ప్రతిష్ఠించిన 21 అడుగుల హనుమ ప్రతిమను ఆయనే చెక్కారు. బీఆర్ అంబేద్కర్, స్వామి రామకృష్ణ పరమహంస, నంది, బాణశంకరిదేవి, మైసూరు మహారాజు జయచామరాజ్ వడయార్ ప్రతిమ కూడా (ఇవన్నీ మైసూరు పరిసరాలలోనే ఉన్నాయి) ఆయన ప్రతిష్టను పెంచినవే.











అయోధ్యలో బాలక్‌రామ్ ప్రతిమను చెక్కడానికి, మొదట ట్రస్ట్ వారు చెప్పిన ఊహకు ఆకృతిని ఇవ్వడానికి తాను ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపానని అరుణ్ చెప్పారు. అయితే తన ప్రతిమే గుడిలోకి చేరడంతో అవన్నీ మరచిపోయానని అన్నారు. ఇందుకు అవసరమైన శిలను కర్ణాటకలోనే హెచ్‌డి కోటే తాలూకా గుజ్జెగౌడనపుర నుంచి తెచ్చారు. ఈ శిల ఉన్న భూమి యజమాని పేరు రామదాసు కావడం మరొక విశేషం. తన స్థలంలో రామాలయం కట్టడానికి నాలుగు కుంట స్థలాన్ని వెంటనే దానం చేశారు. అక్కడ ఆలయ నిర్మాణానికి పునాది కూడా వేశారు. ఈ కృష్ణశిల వేయేళ్ల క్రితానిదని మైసూరు విశ్వవిద్యాలయం ఎర్త్ సైన్సెస్ విభాగం ఆచార్యులు చెప్పడం మరొక విశేషం. ఇక కృష్ణశిలను ఎంచుకోవడానికి కొన్ని శాస్త్రీయ కారణాలు కూడా ఉన్నాయి. అమ్లాలకు ఈ శిల స్పందించదు. ఇక పాలు వంటివాటితో అభిషేకం చేసినా ఎలాంటి మార్పు ఉండదు. ఆ విగ్రహానికి అభిషేకం చేసిన పాలు, నీరు తీసుకున్నా ఎలాంటి సమస్య ఉండదు. పైగా ఈ విగ్రహం వేయేళ్లకు పైగా చెక్కుచెదర కుండా ఉంటుంది. కృష్ణశిలలు కొన్నిచోట్లే దొరుకుతాయి.



ట్రస్ట్ తన ముందు ఉంచిన బాలక్‌రామ్ ఊహకు ప్రాథమికంగా ఆకృతిని ఇవ్వడానికి అనేక ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి అరుణ్ బాలురను చూస్తూ గడిపేవారు. ప్రతిమ కోసం అరుణ్ ఎంత తపన పడినది, తపస్సు చేసినది ఆయన భార్య విజేత కూడా చెప్పారు. చెక్కే క్రమంలో ఒకసారి ఒక శకలం వచ్చి కంటిలో చొచ్చుకుపోయింది. ట్రస్ట్ వారే శస్త్ర చికిత్స చేయించారు. ఆ సమయంలోను పని ఆపకుండా అరుణ్ ఒక్క కంటి సాయంతోనే శిల్పం చెక్కారు.


బాలక్‌రామ్ ఎత్తు 51 అంగుళాలు. దాదాపు 169 సెంటీమీటర్లు. 51 సెంటీమీటర్ల ఎత్తే ఎందుకు? ఏటా శ్రీరామనవమికి గర్భాలయంలోని బాలరామునికి సూర్యతిలకం రావాలంటే అదే ఎత్తు కావాలి. ఇందుకోసం చాలామంది సాఫ్ట్‌వేర్ నిపుణుల సాయం తీసుకోవాలని అనుకున్నా, అంతిమంగా మళ్లీ సంప్రదాయం ఉలి, సుత్తి మాత్రమే ఆయనకు అక్కరకు వచ్చాయి.

– జాగృతి డెస్క్

# ‘అమృత భారతికి అక్షర నీరాజనం

ఒక జాతి గమనంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల ముద్ర, ప్రభావం అపారం. ఏ జాతికైనా సమష్టి వ్యక్తిత్వాన్ని అద్ది, సంస్కారవంతులుగా తీర్చి దిద్దడంలో సాహిత్యం కీలకపాత్ర పోషిస్తుంది. తెలుగునాట వ్యవహారిక భాషోద్యమం, గ్రంథాలయోద్యమం ప్రజల చేతనకు ఆలంబన అయ్యాయి. ఏ జాతి మనుగడకయినా భాషే పునాది. ఆదిలాబాద్ నుంచి అమెరికా వరకు మనవారు అనే ఆత్మీయ స్పర్శను ఇస్తోంది భాష. రాజకీయ, సామాజిక వ్యవస్థలన్నీ భాష చుట్టూనే అల్లుకుని పరిఢవిల్లుతున్నాయి.

ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు ‘జాగృతి’ జాతీయ వారపత్రిక 75 సంవత్సరాలుగా తెలుగు ప్రజల జన జీవితాలలో, జాతీయ భావాల పరివ్యాప్తిలో పోషించిన అద్వితీయ పాత్ర ఏమిటో కళ్లకు కట్టిస్తోంది ‘దీపావళి ప్రత్యేక సంచిక’. సుదీర్ఘకాల గమనంలో ‘జాగృతి’ సంపాదకులు, ప్రచురణకర్తలు మారి ఉండవచ్చు. కానీ పత్రిక పాలసీ విషయంలో మాత్రం రవ్వంత రాజీపడలేదు. ఏ పార్టీలు అధికారంలో ఉన్నా, తమ నిర్దేశిత జాతీయ విధానాల ఛత్రచ్ఛాయలోనే పత్రికను తీర్చిదిద్దుతూ వచ్చారు. చరిత్ర గమనంలోని కీలక ఘట్టాల్లో సునిశిత వ్యాఖ్యలు, విశ్లేషణలు, లోతయిన చర్చలు, మార్గనిర్దేశాలతో ‘జాగృతి’ ఇన్నేళ్లుగా వేదికగా ఉంటూ వస్తోంది.




ఏ ఒక్క కీలక ఘట్టాన్ని, పరిణా న్ని విస్మరించకుండా, పేజీల పరిమితులకు లోబడి పలువురు వ్యాస రచయితలను సమీకరించుకుని, ఒకే తాటిపైకి తెచ్చి సర్వ సమగ్రంగా ఈ సంచికను వెలువరించారు. ఈ దిశగా సంపాదక మండలి కృషి అభినందనీయం. ప్రతి వ్యాసమూ ఒక పరిశోధన పత్రమే. ఆయా అంశాల పూర్వాపరాలను చెప్తూనే ఆ ఘట్టాల్లో ‘జాగృతి’ అనుసరించిన పంథాను, పోషించిన నిర్మాణాత్మక పాత్రను విడమరిచారు.

‘జాగృతి’ ఆవిర్భావ, వికాసంతో ఈ సంచికకు శ్రీకారం చుట్టారు. దేశ విభజన నాటి రక్తపు చారికలు ఎంతటి మానని గాయాలను ఏర్పరచాయో విశ దీకరించారు. ఈ 75 ఏళ్లలోని ముఖ్య పరిణామాలను కీలక మైలురాళ్లుగా ఎంచుకుని వ్యాసాలను అందించారు. వివిధ కాలాల్లో సంపాదకులుగా పనిచేసిన వారి అనుభవాలనూ జోడించారు. ఇన్నేళ్లలో వెలువరించిన ప్రత్యేక సంచికలను క్లుప్తంగా పరిచయం చేస్తూ వచ్చిన తీరు బావుంది. ఏయే సంచికలు, కాలాల్లో ఏయే రచయితలు, రచనలు అందించారో తెలుసుకో గలగడం ఆసక్తి దాయకమే. దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథలనూ ఈ సంచికలో అందించి, పాఠకుల సాహిత్యాభిరుచులకూ పట్టం గట్టారు.

ఇంత విలక్షణంగా ప్రత్యేక శ్రద్ధాసక్తులతో ప్రత్యేక సంచికను శ్రద్ధాసక్తులతో ప్రత్యేక సంచికను తీర్చిదిద్దిన సంపాదకమండలి సభ్యులకు మరోమారు అభినందనలు. మునుముందు రోజుల్లోనూ ‘జాగృతి’ తన ప్రత్యేకతలను నిలుపుకుంటూ పత్రికారంగాన జయకేతనాన్ని ఇలాగే ఎగరవేస్తూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. పాఠకాదరణ కొరవడి ఎన్నో అమూల్య పత్రికలు మూతపడుతూ వస్తున్నాయి. ‘జాగృతి’ వంటి జాతీయ పత్రికలను కంటికి రెప్పలా కాపాడుకుని, ప్రోత్సహించాల్సిన బాధ్యత తెలుగుజాతిపై ఉంది.

– గోవిందరాజు చక్రధర్

జాగృతి డెస్క్

# పద్మవిభూషణుడు వెంకయ్య

**దక్షిణాదిలో, ముఖ్యంగా... తెలుగురాష్ట్రాలలో ఒకప్పుడు భారతీయ జనతా పార్టీ పేరు చెప్పగానే వెంటనే స్ఫురణకు వచ్చే ప్రముఖులలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఒకరు. ఆయన ఇప్పుడు పద్మవిభూషణులయ్యారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ ద్వారా రాజకీయం రంగ ప్రవేశం చేసిన ఆయన ఉప రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. బీజేపీ దిగ్గజం ఏబి వాజ్‌పేయీ మంత్రివర్గంలో, ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మొదటి మంత్రివర్గంలో, అనంతరం ఉపరాష్ట్రపతిగా సేవలు అందించారు.**



రెండో ఏటనే తల్లిని కోల్పోయి అమ్మమ్మ ఒడిలో పెరిగిన తనకు భవిష్యత్‌ను, రాజకీయ జీవితాన్ని ప్రసాదించినవి ఆర్ఎస్ఎస్, బీజేపీ అని తరచూ చెప్పుకునే వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చవట పాలెంలో జూలై 1, 1949లో పుట్టారు. బుచ్చిరెడ్డి పాలెం, నెల్లూరు, విశాఖపట్నంలో చదివారు. యుక్తవయసు నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీతో అనుబంధాన్ని పెంచుకున్న ఆయన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ 1974లో నిర్వహించిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి (ఛాత్ర సంఘర్ష సమితి) రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. 1975లో అత్యవసర పరిస్థితులకు వ్యతిరేకంగా ఉద్యమించి జైలుకు వెళ్లారు. నాలుగున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ ప్రస్థానంలో శాసనసభ్యుడిగా, బీజేపీ రాష్ట్ర, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, పార్టీ పార్లమెంటరీ బోర్డు కార్యదర్శిగా, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యుడిగా (1998–2017), కేంద్రమంత్రిగా, 13వ ఉప రాష్ట్రపతి (2017–2022)గా సేవలు అందించారు. స్వతంత్ర భారతదేశంలో పుట్టి ఉప రాష్ట్రపతి అయిన మొదటి నేతగా నిలిచారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన, నరేంద్రమోదీ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా స్మార్ట్ సిటీ, అమృత పథకం ప్రవేశపెట్టారు. పర్యటనలు అంటే ఇష్టపడే ఆయనత తమ దశాబ్దాల రాజకీయం జీవితంలో వివిధ హోదాల్లో దేశంలో దాదాపు అన్ని జిల్లాలను సందర్శించారు.

'మాతృభాషను గౌరవించు..పరభాషలను ప్రేమించు' అన్నది ఆయన నినాదం. ఆ విధానం మేరకే అమ్మభాషతో పాటు ఆంగ్లం, హిందీలో అనర్గళంగా ప్రసంగించే ప్రావీణ్యం సంపాదించారు. 'ఏ దేశమేగినా... ఎందుకాలిడినా...' అన్నట్లు విదేశీ పర్యటనల్లోనూ వేషభాషలకు ప్రాధాన్యమివ్వడం ఆయన ప్రత్యేకత.

మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ నుంచి నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలనను పాటించేందుకు శక్తిమేర ప్రయత్నిస్తున్నట్లు తరచూ చెబుతుంటారు. ఆ స్ఫూర్తితోనే రాజ్యసభ అధ్యక్షుడిగా సమయపాలనకు ప్రాధాన్యం ఇచ్చారు. సభ్యులు తమ మాతృభాషల్లో ప్రసంగించే ఏర్పాట్లు చేశారు. రాజ్యసభ సమావేశాల సందర్భంగా సభా కార్యకలాపాలు సాగిన తీరుపై నిమిషాలు సహా వారం వారం గణాంకాలు వెల్లడించే జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తీవ్రంగా ప్రతిఘటించిన విపక్షాలను సముదాయిస్తూనే, సభను నిమిషం కూడా వాయిదా వేయకుండా నిభాయించు కుంటూ బిల్లును సున్నితంగా ఆమోదింప చేయడంలో కృతకృత్యులయ్యారు.

'నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో పయనిస్తోంది. అన్నివర్గాల ప్రజలు నవభారత పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న తరుణంలో, భారత్ ప్రభుత్వం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారం ఆయా వర్గాలకు అంకితం. నా రాజకీయ ప్రస్థానంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ప్రజా శ్రేయస్సుకు వినియోగించేందుకు ప్రయత్నించాను. ప్రస్తుత పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. ఆ స్ఫూర్తితో ఆత్మనిర్భ భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని' వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ★

## ప్రాణప్రతిష్ఠకు వెళ్లినందుకు ఫత్వా



జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం చూసిన వారికి ఒక అరుదైన దృశ్యం కనిపించింది. పూర్తి కాషాయ వస్త్రధారణతో ఉన్న వందలాది మంది హిందూ సాధుసంతుల మధ్య ఒక వ్యక్తి కనిపించారు. తెల్లని గెడ్డం, తెల్లని దుస్తులతో ఉన్నారు. ఆయన ముస్లిం. పేరు ఉమర్ అహ్మద్ ఇల్యాసీ. ఆయన కూడా కార్యక్రమానికి వచ్చారు. ఆయన అఖిల భారత ఇమామ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు. అయోధ్య ప్రాణప్రతిష్ఠకు హాజరైనందుకు కొందరు ముస్లిలు ఇప్పుడు ఆయన మీద ఫత్వా జారీ చేశారు. జనవరి 22 సాయంత్రనికల్లా ఆయనకు ఫత్వా అందింది. దీనికి ఇల్యాసీ స్పందన అద్భుతం. సరైన సమాధానం కూడా. 'నన్ను ఎవరు ప్రేమిస్తారో వారు దేశాన్ని కూడా ప్రేమిస్తారు. దేశాన్ని ప్రేమించేవారు నాకు మద్దతుగా ఉంటారు. నేను ప్రాణప్రతిష్ఠకు హాజరైనందుకు నన్ను ఎవరు ద్వేషిస్తున్నారో వారు బహుశా పాకిస్తాన్ వెళ్లిపోతారు'. ప్రాణప్రతిష్ఠకు ఆయనకు ఆహ్వానం అందినా రెండు రోజులు ఆలోచించి అప్పుడు కార్యక్రమానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నారాయన.

ఇది తాను జీవితంలో తీసుకున్న చాలా కీలక నిర్ణయమని కూడా చెప్పారు. ఎందుకంటే, 'దేశంలో సామరస్యమే నాకు ముఖ్యం' అన్నారాయన. తాను క్షమాపణలు చెప్పబోనని, అలాగే తన పదవికి రాజీనామా కూడా చేయనని ఆయన ప్రకటించారు. తాను అసలు ఏ నేరం చేయలేదని కూడా అన్నారు. తాను కేవలం ఒక ప్రేమసందేశం మాత్రమే ఇచ్చానని ఆయన వ్యాఖ్యానించారు. జనవరి 22 నుంచి 29వ తేదీ వరకు 19 లక్షల మంది బాలరాముడిని దర్శించుకున్నారు. ★

# జిహాదీ మనస్తత్వం

**లోక కల్యాణం కోసం మానవులు యజ్ఞం జరుపుతుంటే దాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నించే దానవులు ఉంటారు. మహర్షులు యాగాలు చేస్తున్న సమయంలో రాక్షసులు ఎన్నో ఆటంకాలను సృష్టించేందుకు ప్రయత్నించడం, రామలక్ష్మణులు అడ్డుకొని వారిని సంహరించడం రామాయణంలో చూశాం. ఆధునిక కాలంలోనూ రాక్షసుల వారసులు కనిపిస్తున్నారు. తాజాగా అయోధ్యలో భవ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని చూసి ఓర్వలేక తమ దానవ ప్రవృత్తిని బయటపెట్టుకున్నారు.**

ఐదువందల ఏళ్ల పోరాటాల తరువాత సాధ్యమైన ఒక మహోత్సవానికి గుర్తుగా హిందువులు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసుకున్నారు. వాడవాడలా శ్రీరామ శోభాయాత్రలు భజనలు, పాటలు, నృత్యాలు, మేళతాళాలతో వేడుక చేసుకున్నారు. కొన్ని శక్తులు తమ శాడిస్టు, రాక్షస మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నాయి. జనవరి 21, 22 తేదీల్లో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో స్పష్టంగా బయటపడింది. దాదాపు డజను ప్రాంతాల్లో ఇలాంటి దుర్ఘటనలు జరిగాయి. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, గుజరాత్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో చెదురుమదురు అల్లర్లు జరిగాయి.

**పాక్‌ను తలపించిన మీరా భయందర్**

ప్రాణప్రతిష్ఠ ముహూర్తం సమీపిస్తుండగానే మహారాష్ట్రలో 36 గంటల్లో మూడు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మీరా భయాందర్, పన్వెల్, శంభాజీనగర్‌లో కాల్పులు, రాళ్లదాడి జరిగాయి. వరుసగా మూడు రోజుల పాటు జరిగిన మీరా భయాందర్ అల్లర్లపై మహారాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన ఘటన దేశం దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రాంతాన్ని చూస్తే మనం భారత్‌లో ఉన్నామా పాకిస్తాన్‌లోనా అనే అనుమానం కలగడం సహజం. కొందరు స్థానికులు నయానగర్– మీరా రోడ్‌లో బారికేడ్లు ఏర్పాటు చేసి దారిన వెళ్లేవారి గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. హిందువులను ఈ ప్రాంతంలోకి అనుమతించలేదు. పోలీసులను కూడా అడ్డుకున్నారు జనవరి 22 తేదీకి రెండు రోజుల ముందు నుంచే ఇక్కడ గొడవలు ప్రారంభ మయ్యాయి. శోభాయాత్ర ఏర్పాట్లను అడ్డుకుని, జెండాలు పీకేసి, వికృత చర్యలకు పాల్పడ్డారు

22వ తేదీన రామభక్తులు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో శోభాయాత్ర చేపట్టారు. మీరా భయాదర్ ప్రాంతానికి రాగానే పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. నాలుగు కార్లు, 14 మోటార్‌సైకిళ్లను ధ్వంసం చేయడంతో పాటు రామభక్తులను తీవ్రంగా కొట్టారు. మహిళలు, పిల్లలపై కూడా దాడులు జరిగాయి. విధ్వంసానికి దిగిన వారిలో పిల్లలు కూడా ఉన్నారు. పాకిస్తాన్ జిందాబాద్ అనే నినాదాలు చేశారు. మీరా భయందర్ అల్లర్లను మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ కేసులో 64 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం వెతుకుతున్నారు. నయానగర్– మీరా రోడ్‌లో ఒక ఇరుకైన ప్రాంతం అల్లర్లకు కేంద్రంగా గుర్తించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరహాలోనే బుల్డోజర్లను దింపారు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,



హోంమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్. ఇక్కడ రోడ్డుకు రెండు వైపులా ఉన్న అక్రమ కట్టడాలను కూల్చేశారు.

పదేగావ్ ప్రాంతంలో ఒకే వర్గానికి చెందిన రెండు గ్రూపుల మధ్య భీకర పోరు, రాళ్ల దాడి జరిగాయి. హింసకు పాల్పడుతున్న వ్యక్తులను అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. పన్వెల్‌లో కూడా 2 రోజుల పాటు రచ్చ కొనసాగింది. సోలాపూర్‌లో శ్రీరామ శోభాయాత్రపై జిహాదీ శక్తులు రాళ్ళ, కర్రలతో దాడులకు పాల్పడ్డాయి. మౌలాలీ చౌక్, శాస్త్రీనగర్ ప్రాంతాలల్లో అల్లర్లు చెలరేగాయి. ఈ ఘటనల్లో నలుగురు హిందూ యువకులు తీవ్రంగా గాయపడ్డారు.

**ఉత్తరప్రదేశ్‌లో**

ఉత్తరప్రదేశ్‌లోని కుశినగర్‌లో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా బాణాసంచా కాల్చడం చూసి కొన్ని శక్తులు తట్టుకోలేపోయాయి. కస్య పోలీస్ స్టేషన్ పరిధిలోని బజార్ తోలా ప్రాంతంలో ఒక్కసారిగా వందలాది మంది ఊరేగింపుపై దాడి చేశారు. రాళ్లు విసిరి గాయపరచడంతో పాటు వాహనాలను ధ్వంసం చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశారు. నలుగురిని అరెస్టు చేశారు. ముందుగానే హై అలర్ట్ ప్రకటించినా అజంగఢ్ జిల్లాలో అల్లర్లు చెలరేగాయి. జహానాగంజ్ పట్టణంలోని బాగైచా ప్రాంతంలో రామభక్తులు శోభాయాత్రకు కొందరు అడ్డు తగిలారు. డీజే వాహనాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువైపులా పెద్ద సంఖ్యలో మోహరించేసరికి పోలీసులు రంగంలోకి దిగారు. ఘాజియాబాద్‌లో ఓ వ్యక్తి తన కుక్కకి శ్రీరామ్ అనే బోర్డు తగిలించి నగరమంతా తిప్పాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఫిలిబిత్‌లో శ్రీరాముడి ప్రతిమను అవమాన పరిచినందుకు ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**బిహార్‌లో రాళ్లదాడులు**

బిహార్‌లోని దర్భంగాలోను జిహాదీ శక్తులు ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాయి. భాపురా గ్రామంలో యాత్రపై రాళ్లదాడి జరిగింది. పలువురు గాయపడ్డారు. రెండు బైక్‌లతో పాటు డీజే వాహనం ముందు భాగాన్ని ధ్వంసం చేశారు. స్థానిక పోలీసులు హెడ్‌క్వార్టర్స్‌కు సమాచార అందించడంతో జిల్లా పోలీసులు బలగాలు పెద్ద ఎత్తున రంగంలోకి దిగాయి.

ఎస్పీ సాగర్‌కుమార్ స్థానిక భర్పుల్లి, భవానీపూర్ గ్రామాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి శాంతి భద్రతలకు సహకరించాలని, అల్లర్లకు పాల్పడ్డ వారిని ఇప్పటికే కొందరిని గుర్తించామని తెలిపారు. ముజఫర్‌పూర్‌లోని మజోలియాది ప్రాంతంలో కూడా సంఘ వ్యతిరేకులు రాళ్లు రువ్వారు. కత్తులతో చెలరేగి పోయారు. పోలీసులు వారిని చెదరగొట్టి ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

# వీడరా?

**ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తపై దాడి**

శ్రీరామ శోభాయాత్ర సందర్భంగా జార్ఖండ్‌లోని గిరిదిలో ఉద్రిక్త సంఘటనలు నమోదయ్యాయి. నగరంలోని లైన్ మసీదు సమీపంలో, పూర్ణానగర్‌లో జిహాదీ గ్రూపులు హిందువులపై దాడులకు పాల్ప డ్డాయి. ఊరేగింపులపై రాళ్లు రువ్వారు. తక్షణమే చర్యలు తీసుకున్న పోలీసులు మహ్మద్ జాబీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆజాద్ నగర్ సమీపంలోని బిర్నీకి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రోహిత్ మహతోపై దాడి జరిగింది. జార్ఖండ్‌లోనే లోహర్‌దగాలో హన్వాట్ గ్రామంలోని రామాలయంలో







పాటలు, భజనలు ఆపేయాలంటూ కర్రలు పట్టుకొని వచ్చారు. పోలీసులు వచ్చి వారిని అక్కడిని నుంచి పంపేశారు. ధన్‌బాద్‌లోని తుండి కడైయాన్, ఛతాబాద్‌లో శ్రీరామశోభాయాత్రకు వ్యతిరేకంగా కొందరు రోడ్ల మీదకు వచ్చారు. జెండాలను తొలగించాలని గొడవపడ్డారు.

**అడ్డుతగిలిన ఎస్ఎఫ్ఐ గుండాలు**

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ప్రాణ్ ప్రతిష్ఠ సందర్భంగా సీపీఎం విద్యార్థి సంఘం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) గూండాలు చెలరేగిపోయారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంపై యూనివర్సిటీ ప్రో–వైస్ ఛాన్సలర్ అమితవ దత్తా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్ప టికీ ఏబీవీపీ కార్యకర్తలు, కొందరు యూనివర్సిటీ సిబ్బంది రామనామస్మరణ ప్రారంభించారు. ఇంతలో ఎస్ఎఫ్ఐ గుండాలు వచ్చి దాడులకు పాల్పడ్డారు. భండారీ అనే విద్యార్థిని తీవ్ర గాయాలయ్యాయి.

**బురఖా మహిళ నినాదాలు**

కర్ణాటకలోని శివమొగ్గలో రామమందిర ప్రతిష్ఠాపన వేడుకలు జరుపుకుంటున్న హిందువుల మధ్యకు బురఖా ధరించిన ఓ మహిళ ప్రవేశించి 'అల్లా–హు–అక్బర్' అంటూ నినాదాలు చేసింది. జై శ్రీరామ్ నినాదాలు ఆపేయాలని గొడవకు దిగింది. స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తమతో తీసుకుపోయారు. ఆమె తండ్రి మాత్రం తన కుమార్తె మానసిక అనారోగ్యంతో బాధపడుతోందని చెబుతున్నారు. గుడుల మీద, హిందువుల మీద దాడికి దిగినవారు సాధారణంగా మతిస్థిమితం లేనివారుగా ఉంటారు కాబోలు. బెలగావి నగరంలో శోభాయాత్రపై రాళ్ల దాడి జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**గుజరాత్‌లోనూ..**

గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో శోభాయాత్రపై రాళ్లదాడి జరిగింది. ఖేరాలు బెలిమ్ వాస్‌లోని హటాడియా ప్రాంతం నుంచి ఊరేగింపు వెళుతుండగా కొందరు వ్యక్తులు అభ్యంతరం చెప్పారు. కొందరు ఇళ్లపై నుంచి రాళ్లు రువ్వడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు వారిని చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ ప్రయోగించారు. దాడులకు పాల్పడ్డవారిని గుర్తించి తక్షణం 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితిని కొద్ది సేపట్లోనే అదుపులోకి తీసుకొచ్చారు. అటు వదోదర జిల్లా పాద్రాభోజ్‌లో కూడా శోభాయాత్రపై దాడులు జరిగాయి. రాళ్లదాడిలో 10 మంది మహిళా భక్తులకు గాయాలయ్యాయి. స్థానిక ముస్లింలు ఈ యాత్రకు అడ్డు తగిలారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో కూడా అక్కడక్కగా గొడవలు జరిగాయి. హిందువులకు చెందిన దాదాపు 10 ఇళ్లను ధ్వంసం చేశారు.

**తెలంగాణలోనూ దాడులు**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తా బాద్‌లో శాంతియుతంగా సాగుతున్న శ్రీరాముని పల్లకి ఊరేగింపుపై దుండగులు పాదరక్ష విసిరారు. 22వ తేదీ సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో వీధుల్లో భక్తుల పాటలు, భజనలతో శోభాయాత్ర కొనసాగుతుండగా ఒక భవనంపై నుంచి ఒక్కసారిగా బూటు దూసుకొచ్చింది. ఈ ఘటనపై రామభక్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఆ భవనం దగ్గర గుమిగూడి నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసులు ఆ కుటుంబాన్ని 108 వాహనంలో రక్షణ కల్పించి అక్కడి నుంచి తరలించారు. బూటు పడిన వెంటనే కొందరు భక్తులు ఆ ఇంట్లోకి దూసుకెళ్లారు. అక్కడ తనిఖీ చేస్తే విసిరిన షూతో జతయ్యే మరో షూ వాషింగ్ మెషీన్ కింద కనిపించిందని సంగారెడ్డి జిల్లా ఓబీసీ విభాగం అధ్యక్షుడు బి.మహేష్ తెలిపారు. ఈ ఘటనలో షేక్ నవాజ్, షేక్ జాఫర్‌ల ప్రమేయం ఉందని ఆరోపించించారు. బూటు విసిరిన వారిని శిక్షిస్తామని, నిందితులను అరెస్టు చేసి కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు.

హైదరాబాద్ నగరంలో అక్కడక్క అసాంఘిక శక్తులు శ్రీరామ శోభాయాత్రలను ఆటంకం కలిగించే ప్రయత్నం చూశాయి.

ఎర్రగడ్డ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ఇవి వెలుగు చేశాయి. మరోవైపు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రామభక్తులను ఇబ్బంది పెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో పోలీసులు శోభాయాత్రను అడ్డుకున్నారు. సిద్దిపేట పట్టణంలో ఏసీపీ రామభక్తులను ఇబ్బంది పెట్టారు. ఈ ఘటనలపై విశ్వహిందూ పరిషత్ డీజీపీకి ఫిర్యాదు చేసింది.

**అల్లర్లు తక్కువే..**

ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులను సృష్టిస్తుంటాయి కొన్ని వర్గాలు.. 2022లో 60 అల్లర్లు, 2023లో 40 అల్లర్లు జరిగాయి. కానీ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ రోజున చాలా తక్కువ ఘటనలు చోటు చేసుకోవడం ఊరటనిచ్చే అంశం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# రామరాజ్య స్థాపనకు నా

హిందువుల ఆత్మ జాగృతమైన సుదినమది... అందరి మనస్సులూ ఆనందంతో నిండిన రోజు. ఎన్నాళ్లో వేచిన ఆ హృదయాలకు సాంత్వన లభించిన భవ్యమైన దినమది. తన, మన బేధం లేకుండా అందరినీ కలుపుకుని ఉత్సవాలు జరుపుకున్న దివ్యమైన రోజు. దేశం మొత్తాన్నీ కుల, మతాలకు అతీతంగా ఏకం చేసిన దినమది. ఒకరకంగా చెప్పాలంటే, హిందూ రాష్ట్ర అవతరణకు శంఖారావం పూరించిన గొప్ప ఘడియలు అవి... అవే అయోధ్యలోని రామజన్మ భూమిలో బాల రాముడిని ప్రతిష్ఠించిన ఘడియలు. హిందూ రాష్ట్రంలో హర్షోల్లాసాలు, ఐకమత్యం ఎలా ఉంటుందో పట్టి చూపిన రోజది. రామ్‌లల్లా తిరిగి రావడమన్నది విజయానికి ప్రతీక అయినప్పటికీ, వాస్తవంగా ఇది ఒక కొత్త యుగానికి నాంది అన్న సంకేతాలు నాటి వక్తల ఉపన్యాసాలు పంపాయి.

ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్‌జీ భాగవత్ అన్నట్టుగా భారతదేశపు ఆత్మ గౌరవం (స్వ) తిరిగి వచ్చిన రోజు ఇది. మొత్తం ప్రపంచపు దుఃఖానికి సాంత్వన కల్పించే నూతన భారతదేశం ఏర్పడుతుందని, విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన దినమిది అని మోహన్‌జీ అన్నారు. ఇంతటి దివ్యభవ్య ఘట్టాన్ని దేశంలోని కోట్లాదిమంది ప్రజలు వీక్షిస్తున్న సమయంలో బాధ్యత కలిగిన మాటలు చెప్పవలసి ఉందంటూ ఆయన తన ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

ఏ మతానికి, పంథాకు చెందినవారిని అయినా పెద్ద మనసుతో స్వీకరించే గుణం హిందువుల జన్యువులలోనే ఉందన్నది వాస్తవం. సెక్యులరిజం అన్న పదం మన రాజ్యాంగంలో ఉన్నా, లేకున్నా మన జీవనవిధానం, పద్ధతులలో అది ఉంది కనుకనే, మెజారిటీ హిందువులు ఉన్న దేశంలో ఇతర మతాలు ఎటువంటి సమస్యలూ లేకుండా మనగలుగుతున్నాయి, శాంతియుతంగా జీవించగలుగుతున్నాయి. ఈ విషయాన్నే మోహన్‌జీ భాగవత్, ప్రధాని మోదీ, గోవిందగిరి మహరాజ్ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతిధ్వనించారు.

అయోధ్య నుంచి రామ్‌లల్లా బయటకు ఎందుకు వెళ్లారో సర్‌సంఘచాలక్ వివరించారు. రామాయణం చదివిన ప్రతివారికీ రాముడు వనవాసానికి వెళ్లాడని తెలుసు. కానీ, ఎందుకు అంటే అక్కడ కలహం జరిగింది కనుక వెళ్లాడని ఎందరికి తెలుసు? అని ఆయన ప్రశ్నించారు. 'అయోధ్య' అంటే కలహాలు, ద్వంద్వాలు, సందేహాలులేనిదని అర్థం. కానీ అక్కడే కలహాలు చెలరేగడంతో 14 సం॥ల వనవాసం చేసి, ప్రపంచంలో కలహాలను నిర్మూలించి ఆయన తిరిగి వచ్చారని భాగవత్‌జీ చెప్పారు. మన ప్రధాని కూడా ప్రాణ ప్రతిష్ఠ కోసం కఠోర వ్రతం చేశారు. ఆయన తపస్వి అని నాకు వ్యక్తిగతంగా కూడా తెలుసు. కానీ ఆ తపస్సు ఏదో ఆయన ఒక్కరే చేస్తారా? మరి మనమేం చేద్దామంటూ ప్రశ్నించి, ప్రజల బాధ్యతను పట్టి చూపారు. 500 ఏళ్లల్లో ఎన్నో తరాలు చేసిన త్యాగాలు, తపస్సు, ప్రయాసాల వల్ల రామ్‌లల్లా తిరిగి వచ్చారు; అందుకే ప్రాణప్రతిష్ఠ సందర్భంగా చెప్పిన సంకల్పంలో వారందరినీ స్మరించుకున్నాం. వారంతా కోటిసార్లు స్మరించుకోవలసినవారు. రామ్‌లల్లా తిరిగి రావడానికి దారి తీసిన పరిస్థితులను అధ్యయనం చేసిన వారికి దేశం పట్ల ప్రేమ, ఆత్మవిశ్వాసం కలుగుతాయి. అందరి దుఃఖాలను తొలగించే సామర్థ్యం ఈ ఇతిహాసానికి ఉందని ఆయన చెప్పారు.

రామ్‌లల్లా రాకతో రామరాజ్యానికి పునాదులు పడ్డాయని సర్‌సంఘచాలక్ పేర్కొన్నారు. అందుకోసం ప్రధానమంత్రి తపస్సు చేశారు, కానీ మనం కూడా చేయవలసి ఉందన్నారు. రామరాజ్యం వస్తే ఎలా ఉంటుంది? అంటూ శ్రీరామచరితమానస్‌లో రామరాజ్యానికి సంబంధించిన వర్ణనను వివరించారు.



గోవింద్ గిరిజీ

# మోదీ మరో ఛత్రపతి శివాజీ: స్వామి

హిందూ రాష్ట్ర ఆవిష్కరణకు వేదిక సిద్ధమైంది. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠాపనతో 'రామరాజ్య' భావనను సాకారం చేయడంలో ప్రజల బాధ్యతను కూడా వక్తలు పట్టిచూపారు. ఎటువంటి నకారాత్మక లేని, సుహృద్భావం, ఏకాత్మతా భావమే రామ రాజ్య మనే విషయాన్ని సర్‌సంఘచాలక్ వివరించగా, ప్రధాని మోదీని హిందూ రాష్ట్ర స్థాపకుడైన ఛత్రపతి శివాజీ మహరాజ్‌తో శ్రీరామజన్మభూమి తీర్థట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ గిరిజీ పోల్చడం అసందర్భంగా అనిపించలేదు, కాదు కూడా. నిజానికి ఇస్లాం పాలకుల అరాచకాలను, మతాంతరీకరణలను నిలువరించేందుకు మాత్రమే ఛత్రపతి శివాజీ హిందూ రాష్ట్రను స్థాపించవలసి వచ్చింది. విదేశీ దాడులకు పూర్వం ప్రత్యేకంగా భారత దేశం హిందూ రాష్ట్రమని ప్రకటించుకోవలసిన అవసరం రాలేదు. వారు అన్ని పంథాలను కలుపుకుని, సామరస్యపూర్వకంగా జీవనాన్ని సాగించారు. సనాతన ధర్మం ఒక నిర్దిష్ట జీవన విధానమే తప్ప ఇతర 'అబ్రహమిక్' మతాల వంటిది కాకపోవడం వల్లనే యావత్ ప్రపంచానికీ ఆదర్శంగా నిలిచింది, నేటికీ నిలుస్తోంది.

ప్రధాని మోదీ 11రోజుల ఉపవాస దీక్ష గురించి ప్రస్తావిస్తూ, మూడు రోజులు మాత్రమే చాలన్నా, ప్రధాని పూర్తి పదకొండు రోజులూ దీక్ష చేయడాన్ని కొనియాడారు. తపస్సులో అత్యున్నతస్థాయి ఆచరణ ఉపవాసమని ప్రతిష్ఠ సందర్భంగా విధి విధానాలు, క్రతువులకు అధిపతిగా కూడా ఉన్న స్వామి గోవింద్ గిరిజీ పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రధాని వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించడాన్ని గురించి మాట్లాడుతూ, ఆయన అది తన వ్యక్తిగత ఆధ్యాత్మిక ఉన్నతి కోసం కాక అయోధ్య, భారతీయ ప్రజల శ్రేయస్సు కోసం చేశారని అన్నారు. నేటికీ కొందరి అభిప్రాయంలో ఇది ఆలయ ప్రారంభోత్సవం

## ందీ వచనం

డి. అరుణ

దైహిక దైవిక భౌతిక తాపా ।
రామరాజ్య నహి కాహుహి వ్యాపా ॥
సబ్ నర్ కరాహి పరస్పర ప్రీతి ।
చలాహి స్వధర్మ నిరత శృతి నీతి ॥

('రామరాజ్యంలో భౌతిక, దైవిక, దైహిక తాపం ఎవరినీ ప్రభావితం చేయదు. మానవులందరూ ఒకరి పట్ల ఒకరు ప్రేమగా ఉండటమే కాక వేదాలలో సూచించిన నియమ, నిబంధనలను అనుసరించడం ద్వారా వారి వారి ధర్మాలను అనుసరిస్తారు.')

సబ్ నిర్బంధ ధర్మరత్ పునీ।
నర అరు నారీ చతుర సబ్ గుణీ ॥
సబ్ గుణజ్ఞ పండిత సబ గ్యానీ ।
సబ్ కృతగ్య నహి కపట సయానీ ॥

(అందరూ అహంకారం లేనివారు, భక్తిపరులు, సద్గురువులు, పురుషులు, మహిళలు అందరూ తెలివైనవారు, ప్రతిభావంతులు. అన్ని ధర్మాలను గౌరవించే, విజ్ఞానం, విజ్ఞత కలిగిన పండితులు ఉన్నారు. అందరూ కృతజ్ఞులై ఉంటారు (ఇతరులు చేసిన ఉపకారాలను మర్చిపోకుండ), ఎవరూ మోస పూరితులు కాదు అంటూ, ఈ వర్ణన ప్రకారం జీవిస్తున్న మనమంతా వారికి సంతానం అన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభు రాముడి గుణగణాలను మనం కోటి కోటి గొంతులతో గానం చేస్తాం, ఇప్పుడు ఆ గుణాలను మనం కూడా అంది పుచ్చుకోవాలి, ఆచరించాలని ఉద్బోధించారు.

వ్యక్తులుగా మన మధ్య చిన్న చిన్న విషయాలకు కూడా ఉండే కలహాలకు, విభేధాల కారణంగా గొడవ పడటానికి స్వస్తి చెప్పాలి. ఒక సాధారణ పౌరుడులా అహంకారం లేకుండా ఉండాలి. కేవలం మాటలు కాదు ఆచరణ కావాలి. అది కూడా ప్రామాణికతతో ఆచరించాలి. మాటలు చెప్పి అహంకారంతో ఉండేవాడు కాదు, పని చేసేవాడు, ఆచరించేవాడు, అహంకారం లేనివాడు అయినవాడే ధార్మికుడు.

శ్రీమద్భాగవతంలో చెప్పినట్టుగా ఏ నాలుగు స్తంభాల (సత్యం, కరుణ, శుచిత, తపస్సు) పై అయితే ధర్మం నిలిచిందో వాటిని నేడు కూడా ఆచారించాలి అనడమే కాదు, ఆధునికకాలంలో వాటిని ఆచరణ లోకి పెట్టడం ఎలాగో కూడా వివరించారు. మొదటి సత్యం – దాని ఆచరణ: ప్రతి జీవిలోనూ రాముడున్నాడని పరమ సత్యం, అంటే సర్వత్రం వ్యాపితమై ఉన్నాడని తెలుసుకొని, మనం సమన్వయంతో ముందుకు వెళ్లాలి. అందరూ మనవారు కనుకనే మనం పురోగమించగలం. సమన్వయంతో ముందుకువెళ్లడమనేదే ధర్మం, మొదటి సత్యం – దాని ఆచరణ.



మోహన్‌జీ

రెండవ అడుగు కరుణ. ఆధునిక కాలంలో సేవ, పరోపకారమే మార్గం. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తన బాధ్యతగా అమలు చేస్తోంది. కానీ సమాజాన్ని ఐక్యం చేయడమనేది మన కర్తవ్యం కూడా. దుఃఖానికి ఓదార్పునివ్వాలి. ప్రతిసారి రెండు చేతులా సంపాదించి, తన కనీస అవసరాలకు వినియోగించుకుని, మిగలినదంతా పరోపకార మార్గంలో సమాజానికి తిరిగి ఇవ్వడమే నేటి కాలంలో కరుణ.

మూడవది శుచిత, అంటే పవిత్రత. అందుకు సంయమనం అవసరం. స్వీయ నియంత్రణ కావాలి. తాను చెప్పిందే సరైనదనే భావన సరికాదు. ఇతరులకూ అభిప్రాయాలుంటాయనే విషయాన్ని గుర్తించి, గౌరవించాలి. స్వీయ నియంత్రణ అన్నదే ఈ పృథ్విని సజీవంగా ఉంచుతుంది. గాంధీ అనేవారు, "ఈ భూమి దగ్గర అందరి అవసరాలకు తగినంత ఉంది కానీ, ప్రతి ఒక్కరి దురాశకు తగినంత కాదు" అని. జీవితంలో నియమాలు ఉండాలి, వాటిని పాటించాలి. కుటుంబంలో, సమాజంలో కూడా నియమాలు పాటించాలి. సామాజిక సంబంధాలలో కూడా అవి ఉండాలి. సోదరి నివేదిత కూడా, ప్రజలు సానుభూతిని కలిగి ఉండి, పౌరులు నియమాలను పాటించడమే దేశభక్తి రూపం అని పేర్కొన్నారు.

నాలుగవది తపస్సు అంటూ, అందుకు నిలువెత్తు ఉదాహరణ మీ ఎదురుగానే ఉన్నారంటూ ప్రధాని మోదీని పొగడ్తలో ముంచెత్తారు. ఇది కూడా వ్యక్తిగతంగా మనం ఆచరిస్తాం, సామూహికం మాటేమిటి? సామూహిక తపస్సు అంటే,

సంఘచ్ఛధ్వం, సంవదధ్వం।
సంవో మనాంసి జానతామ్ ॥
దేవాభాగం యథాపూర్వే ।
సంజానానా ఉపాసతే॥

మీరు సామరస్యంగా కదలండి, ఒకే స్వరంలో మాట్లాడండి. మీ మనస్సులు ఒకేలా ఉండనివ్వండి. నాడు దేవతలు తమ త్యాగభాగాన్ని పంచుకున్నట్లే అన్నారు. మనమంతా అటువంటి సామరస్యతను కలిగి ఉన్నప్పుడే దేశం విశ్వగురువు కాగలదు. అందుకు మనమందరం దోహదం చేయాలి.

ఐదువందల సంవత్సరాలపాటు ఎన్నో త్యాగాలు, బలిదానాలు చేసినవారు ఇంతటి ఆనందకరమైన రోజును దేశానికి ఇచ్చారు. వారందరి పట్లా మనం కృతజ్ఞతతో ఉండాలి. ధర్మస్థాపన కోసం వ్రతాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు రాముని అవతారం వచ్చింది. కనుక అటువంటి పరిస్థితులను ఉత్పన్నంగ మలచుకోవడం మన కర్తవ్యం. నేడు రామ్‌లల్లా వచ్చారు. మనకు ప్రేరణను ఇవ్వడంతో పాటు ఈ లక్ష్యం సాధించేందుకు కృతి ప్రమాణమిచ్చారు. ఆయన ఆదేశాలను తలకెత్తుకుని ఇక్కడ నుంచి వెళ్లాలి అంటూ ప్రసంగించిన సర్‌సంఘచాలక్ దేశంలో సమైక్యత, నియమబద్ధమైన జీవన విధానం అవసరాన్ని నొక్కి చెప్పారు. ★

## గోవింద్ గిరీజీ


మాత్రమే కానీ, భారతీయ దృక్పథం దానికి భిన్నమైందని, సంప్రదాయం, తాత్వికతల పట్ల భారతీయుల సంపూర్ణ, సమగ్ర దృక్పథం మరో కోణాన్ని చూపుతాయని అన్నారు. భారతీయులు తమ ధార్మిక జీవితాన్ని, సామాజిక జీవితాన్ని భిన్న స్రవంతులుగా పరిగణించక, రాయినీ, రప్పనీ, చెట్టునీ, పుట్టనీ కూడా దైవ సమానంగా భావించి, పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణ చేశారు. దీనితోపాటుగా, ప్రతి ఆత్మ మహనీయ మైనదని భావించడమే కాదు, ఆ మహనీయతను సాధించగల సామర్థ్యం ప్రతి వ్యక్తికీ ఉందని భావించి గౌరవించారు. ఆ పరస్పర ఆదరణతో కూడిన సామాజిక జీవనం వల్లనే భారతదేశం సుసంపన్నంగా, సుభిక్షంగా విలసిల్లింది.

అయితే, మధ్య యుగాలలో ప్రారంభమైన దాడులు, బలవంతపు మతాంతరీ కరణలు, వలస విద్యావిధానం, ప్రభుత్వాల సెక్యులర్ విధానాలు, పాశ్చాత్య, ఆధునిక జీవన శైలి అనుకరణ ఫలితంగానే భారతీయులు తమ మూల సంస్కృతిని మరచిపోతున్నారన్నది వాస్తవం. ఈ వాస్తవాన్ని పలువురు అంగీకరించినా, ముందుకు వెళ్లే మార్గమేమిటో తెలియక, ప్రేరణను ఇచ్చేందుకు రోల్ మోడల్స్ లేకపోవడంతో వాటిని ఉపన్యాసాలుగానే కొట్టి పారేస్తూ వచ్చారు. కానీ, నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పటి నుంచీ, ఇతరులకు ఉద్బోధించే విషయాన్ని తాను స్వయంగా ఆచరించి చూపడం ద్వారా నేటి యువతకు రోల్ మోడల్‌గా మారారు. నెమ్మదిగా నేటి తరం తమ మూలాలను వెతుక్కోవడం ప్రారంభమైంది. ★



# ఆగ్నేయాసియాలో రామగాథ ప్రశస్తి

ఆగ్నేయాసియా దేశాల్లో రామాయణ గాథ ఆయా భాషల్లో వివిధ పేర్లతో ప్రాచుర్యంలో ఉంది. ఇండొనేసియా (స్థానిక ఫిలిపినో భాషలో), థాయ్‌లాండ్ (రామాకిన్), కంబోడియా (రీయంకర్–కంబోడియా భాషకు చెందిన కావ్యం), మలేసియా, వియత్నాం, లావోస్, నేపాల్, టిబెటో–చైనీస్, మాలె భాషల్లో కూడా ప్రాచుర్యంలో ఉంది. ఇండొనేసియాలోని బాలి దీవిలో రామాయణం నృత్యనాటకం అత్యంత ప్రసిద్ధి పొందింది. క్రీ.శ.19–20 శతాబ్దంలో ప్రముఖ రచయిత భానుభక్త ఆచార్య రచించిన రామాయణాన్ని నేపాల్ తొలి కావ్యంగా పరిగణిస్తారు. తర్వాత సిద్ధిదాస్ మహజు, స్థానిక నేపాల్ భాషలో (దీన్నే స్థానికంగా నెవార్ లేదా నెవారీ అని వ్యవహరిస్తారు. ఖట్మాండు లోయ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈభాష వాడుకలో ఉంది) రామాయణ కావ్యాన్ని రచించాడు. ఈ రచన ఆధునిక నేపాల్ భాషోద్యమం ఊపందుకోవడానికి దోహదం చేసింది. అయితే నేపాల్‌లో బహుళ జనాదరణ పొందింది మాత్రం భానుభక్త ఆచార్య రచించిన రామాయణ కావ్యమే. కంబోడియాలో 'రీయంకర్' పేరుతో ప్రాచుర్యంలో ఉన్న రామాయణం 'ఖ్మేర్' సాహిత్యంలో ఎంతో ప్రసిద్ధి పొందింది. ఈ సాహిత్యం 'ఫునాన్ రాజ్యం' కాలంనుంచి పరిఢవిల్లింది. ఇండొనేసియాలో రామాయణం అనేక రూపాల్లో కనిపిస్తుంది. 'కాకావిన్ రామాయణం' పేరుతో ప్రాచీన జవనీస్ కావ్యంగా ప్రసిద్ధి పొందింది. క్రీ.శ.870లో మధ్య జావా ప్రాంతంలోని మతారం రాజ్యానికి చెందిన ఇంపు సిండోక్ ప్రాంతంలో దీని రచన కొనసాగింది. సమీప ద్వీపం బాలిలో దీన్ని మరింత అభివృద్ధి చేసి 'రామకవక' పేరుతో బాలినీస్ రామాయణాన్ని రూపొందించారు. ఇండొనేసియాకు చెందిన యోగ్యకర్త పట్టణంలో ప్రంబనన్ దేవాలయంలో రామాయణ ఇతిహాసానికి చెందిన దృశ్యాలు చెక్కి ఉన్నాయి. క్రీ.శ.14వ శతాబ్దంలో తూర్పు జావాలో నిర్మించిన పెనాటరన్ దేవాలయంలో కూడా రామాయణ కావ్యానికి చెందిన చిత్రాలను చూడవచ్చు. 'బాలినీస్ కేకక్' నృత్య (బాలినీస్ హిందూ నృత్యం) రూపంలో రామాయణాన్ని ఇండొనేసియా ప్రజలు ముఖ్యంగా పురుషులు ప్రదర్శిస్తారు. యోగ్యకర్తలో 'వెయాంగ్ వాంగ్' పేరుతో ప్రదర్శించే జవానీస్ నృత్యం కూడా రామాయణానికి సంబంధించినదే. లావోస్ ప్రజల అధికారిక నవల "ప్ర లాక్ ప్ర రామ్". ఇందులో లాక్ అంటే లక్ష్మణ,




రామ్ అంటే రాముడు. వీరిద్దరి పేర్లతో లావో భాషలో రామాయణ రచన సాగింది. గౌతమ బుద్ధుని గత జన్మగా రామలక్ష్మణుల కథను వివరించడం దీని ప్రత్యేకత. మలేసియాలో "హికాయత్ సెరి రామ" పేరుతో మలై భాషలో రామాయణం రచించారు. మయన్మార్‌లో ''యమ జట్‌డా'' పేరుతో ప్రాచుర్యంలో ఉన్న బర్మీస్ రామాయణాన్ని అనధికారిక జాతీయ కావ్యంగా పరిగణిస్తారు. "మహారాదియా లావన" అనేది ఫిలిప్పీన్స్‌కు చెందిన మరనావో ప్రజల రామాయణం. దీన్ని 1968లో ప్రొఫెసర్ జువాన్ ఆర్. ఫ్రాన్సిస్కో, నాగసుర మడాలేలు ఇంగ్లీషులోకి అనువదించారు. "రామా ఎట్ సీత" (రాముడు – సీత) పేరుతో 1970లో ఫిలిప్పీన్స్‌లో "జాజ్ బాలెట్" (ఒకరకమైన శాస్త్రీయ నృత్యనాటకం) రూపంలో రామాయణాన్ని నిర్మించి ప్రదర్శించారు.

**ఆగ్నేయాసియా దేశాల్లో...**

రామాయణం ప్రభావం ఆగ్నేయాసియా దేశాల్లో ఒక్క వియత్నాంలో తప్ప మిగిలిన దేశాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ముఖ్యంగా క్రీ.శ.8వ శతాబ్దం నుంచి ఆయా దేశాల సాహిత్యంలో, దేవాలయాల్లో శిల్పాలు, చిత్రాలు, నాటకాలు, నృత్య రూపాల్లో బహుళ ప్రచారం పొందింది. ఇండోనేసియాలో ప్రత్యేకించి జావా, బాలి ద్వీపాల్లో నృత్యనాటకాలు, తోలుబొమ్మలాటల రూపంలో ప్రజల్లో సజీవంగా ఉంది. యోగ్యకర్త (ఇండోనేసియా)కు చెందిన సాంస్కృతిక కేంద్రంలో సేంద్రతరి రామాయణాన్ని వెయాంగ్ ఒరాంగ్ శాస్త్రీయ రూపంలో సంప్రదాయ జవనీస్ నృత్య నాటకంగా ప్రదర్శిస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా ప్రంబనాన్ త్రిమూర్తి దేవాలయంలో ఎన్నో జాతులకు చెందిన ప్రజలు రామాయణాన్ని ప్రదర్శిస్తుం టారు. బాలినీస్ హిందూ దేవాలయాల్లో కూడా బాలనీస్ నృత్య నాటకాల రూపంలో తరచుగా ప్రదర్శనలు ఇస్తున్నారు. ముఖ్యంగా ఉబుద్, ఉలువట్టు ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలను చూడవచ్చు. ఇండోనేసియాకు చెందిన ముఖ్యంగా బాలినీస్ చిత్రకారులు రామాయణాన్ని ఎన్నో చిత్రాల్లో చిత్రీకరించారు. గుస్తి ధోకర్ (1938కి ముందు), దేవా పోయిటోయ్ సోయ్‌గిహ్, దేవా గేడె రాకా పొయిద్జా, ఇడా బాగస్ మాడె తొగాగ్ వంటి ప్రముఖ చిత్రకారులు తమ పెయింటింగ్స్‌లో రామాయణాన్ని చిత్రించారు. వీరి పెయింటింగ్స్ ప్రస్తుతం నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్ డ్యామ్‌లోని ట్రోపెన్ మ్యూజియంలో భద్రపరచి ఉన్నాయి. మలేసియాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు సయ్యద్ తాజుద్దీన్ కూడా 1972లో రామాయణ చిత్రాలను గీసాడు. ప్రస్తుతం ఈ చిత్రాలు మలేసియాకు చెందిన నేషనల్ విజువల్ ఆర్ట్స్ గ్యాలరీలో ఉన్నాయి.

**అజరామరం**


ఎన్నో వేల ఏళ్లనాటి రామాయణ గాథ ఇన్నిదేశాల్లో ఇప్పటికీ వివిధ కళా రూపాల్లో సజీవంగా ప్రజల హృదయాల్లో నిలిచివున్నదంటే, జగదభి రాముడి గుణగణాలు, సీతాసాధ్వి పాతివ్రత్యం, అన్నా వదినలకు లక్ష్మణుడు చేసిన సేవ, హనుమంతుడి భక్తి వంటి అంశాలే ప్రధాన కారణం. సమాజాన్ని సరైన మార్గంలో నడిపింపజేయడానికి రామాయణం లోని ఒక్కో పాత్ర ఒక్కోరకమైన హితాన్ని చెబుతుంది. ఇందులోని సత్య, ధర్మాలు అన్నికాలాలకు వర్తిస్తాయి. అందువల్లనే రామాయణం బోధించేది 'సనాతన ధర్మం'. ఇది అజరామరం!

**- విరల్**



# మూడు తీవ్రవాదముఠాల ఉచ్చులో పాక్‌-ఇరాన్‌!!

ఒకప్పటి బెలూచిస్తాన్‌ ప్రాంతానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న మూడు తీవ్రవాద గ్రూపుల కార్యకలాపాలు ఇప్పుడు ఇరాన్‌, పాకిస్తాన్‌ల మధ్య ఘర్షణకు దారితీశాయనేది వర్తమాన చరిత్ర చెబుతున్న సత్యం. ఎందుకంటే పూర్వం పశ్చిమ, దక్షిణాసియాలో విస్తరించిన బెలూచిస్తాన్‌ ప్రాంతం మూడుగా చీలిపోయి పాకిస్తాన్‌, ఇరాన్‌, ఆఫ్ఘనిస్తాన్‌ దేశాల్లో భాగంగా కొనసాగుతోంది. పాకిస్తాన్‌ అధీనంలోని ప్రాంతాన్ని బెలూచిస్తాన్‌ అని, ఇరాన్‌లో ఉన్న భాగాన్ని సిస్తాన్‌, బెలూచిస్తాన్‌ అని, ఆఫ్ఘనిస్తాన్‌లోని భాగాన్ని దక్షిణ ప్రాంతమని వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఇరాన్‌, పాకిస్తాన్‌లలోని బెలూచిస్తాన్‌ ప్రాంతంలో జైష్‌ అల్‌ ఆదిల్‌, బెలూచిస్తాన్‌ లిబరేషన్‌ ఫ్రంట్‌ (బిఎల్‌ఎఫ్‌), బెలూచిస్తాన్‌ లిబరేషన్‌ ఆర్మీ (బిఎల్‌ఏ)అనే మూడు తీవ్రవాద గ్రూపులు ఈ రెండు దేశాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాయి. వీటి లక్ష్యం ఒక్కటే... బెలూచిస్తాన్‌కు స్వాతంత్ర్యం సాధించడం. అయితే ఈ గ్రూపుల మధ్య ప్రధానంగా కొన్ని తేడాలున్నాయి. బిఎల్‌ఏ, బిఎల్‌ఎఫ్‌లకు తమ లక్ష్యం విషయంలో విస్తృతమైన అవగాహన ఉండగా, జైష్‌ అల్‌ ఆదిల్‌ ఒక సున్నీ సలాఫీ జిహాదీ గ్రూపు. 2012లో ఆవిర్భవించిన దీని ప్రధాన లక్ష్యం బెలూచిస్తాన్‌ స్వాతంత్ర్యంతో పాటు, ఇరాన్‌ ప్రభుత్వాన్ని పడగొట్టడం. ఇది ఆగ్నేయ ఇరాన్‌, పాక్‌ పశ్చిమ ప్రాంత ప్రావిన్స్‌ బెలూచిస్తాన్‌లో తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. 2013 నుంచి ఈ గ్రూపు తన సరిహద్దు భద్రతాదళంపై దాడులు కొనసాగిస్తుండటంతో ఇరాన్‌ ఈ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్‌ జర్నలిస్ట్‌

ఇక బెలూచ్‌ లిబరేషన్‌ ఫ్రంట్‌ పాకిస్తాన్‌ పశ్చిమ ప్రాంతానికి చెందిన బెలూచిస్తాన్‌ విముక్తిని కోరుతూ పోరాడుతోంది. ఈ సంస్థకు చెందిన ఉగ్రవాదులు ఇరాన్‌ నుంచి పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలపై దాడులు చేస్తుంటారు. బెలూచ్‌ మిలిటెంట్లు, తెహ్రిక్‌ ఇ పాకిస్తాన్‌ ఉగ్రవాద సంస్థలో కలిసి పాక్‌లో ఎన్నో దాడులకు పాల్పడ్డారు. తెహ్రిక్‌ ఇ పాకిస్తాన్‌ సంస్థ ప్రధాన లక్ష్యం పాక్‌ ప్రభుత్వాన్ని పడగొట్టడం. మొత్తంమీద దశాబ్దకాలంగా ఇరాన్‌-పాక్‌ల మధ్య ఈ ఉగ్రవాదుల వల్ల సంఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. వీటికి తోడు రెండు దేశాల మధ్య సరిహద్దు పటిష్టంగా లేకపోవడంతో మత్తుమందుల రవాణాతో పాటు వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన తీవ్రవాదులు ఈ ప్రాంతంలో యథేచ్ఛగా సంచరిస్తుండటం మరో సమస్య. జైష్‌ అల్‌ అదల్‌ సంస్థ ఇరాన్‌కు వ్యతిరేకంగా పనిచేసే సంస్థ కాగా జెండల పేరుతో పనిచేసే మరో గ్రూపు ఇరాన్‌ ప్రభుత్వంపై హింసాత్మక దాడులకు పాల్పడుతోంది. 2003లో ఇరాన్‌ మాజీ అధ్యక్షుడు మహమ్మద్‌ అహమెదినెజాద్‌పై హత్యాయత్నం చేసిన చరిత్ర దీనిది. కాగా జైష్‌ అల్‌ అదల్‌ సంస్థ దక్షిణ సిస్తాన్‌-బెలూచిస్తాన్‌ ప్రావెన్స్‌లో తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. గత డిసెంబర్‌లో ఇరాన్‌లోని రస్క్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి 11 మంది పోలీసులను హతమార్చింది. ఇందుకు ప్రతిగా పాకిస్తాన్‌, ఇరాన్‌లో పనిచేస్తున్న బెలూచిస్తాన్‌ లిబరేషన్‌ ఆర్మీ, బెలూచిస్తాన్‌ లిబరేషన్‌ ఫ్రంట్‌ గ్రూపులే లక్ష్యంగా దాడులు చేసింది. ఇరాన్‌లోని రెండు బెలూచ్‌ తెగలకు చెందిన ఉగ్రవాదులు తమకు వ్యతిరేకంగా దాడులకు పాల్పడుతున్నారని పాక్‌ ఆరోపిస్తుండగా, పాకిస్తాన్‌లో పనిచేస్తున్న జైష్‌ అల్‌ అదల్‌ గ్రూపు తమ దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడుతోందని ఇరాన్‌ పేర్కొంటున్నది.

**పాక్‌ స్పందనలో విరోధాభాస**

"మార్గ్‌ బార్‌ సర్‌మచార్‌" పేరుతో ఇరాన్‌లోని సెయిస్తాన్‌ ఓ బెలుచిస్తాన్‌ ప్రాంతంలో ఉగ్రవాదుల స్థావరాలపై క్షిపణుల దాడులు నిర్వహించినట్టు జనవరి 18న పాక్‌ విదేశాంగశాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ దాడుల్లో చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని ఒకపక్క వివరిస్తూనే తమదేశ ప్రజలు ఎప్పుడూ ఇరాన్‌ ప్రజలను సోదరులుగా పరిగణిస్తారని, వారిపై తమకు అపరిమితమైన గౌరవం ఉందని, ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికి పరస్పర చర్చలే ఉత్తమ మార్గమనేది తమ ప్రగాఢవిశ్వాసమని పేర్కొనడం ఈ విరోధాభాసకు ఉదాహరణ. అయితే ఇరాన్‌పై చర్యకు ప్రతిచర్య తీసుకోవడంలో పాకిస్తాన్‌ కొంచెం ఆలస్యం చేసిందనే చెప్పాలి. పాక్‌ సైన్యం, పాలకవర్గాల్లో నెలకొన్న సందిగ్ధతే ఇందుకు ప్రధాన కారణం. చివరకు దాడులు చేయాలనే నిర్ణయం తీసుకొని అమలుపరచినా, ప్రస్తుతం ప్రజల్లో పలుకుబడి దారుణంగా పడిపోయిన పాక్‌ సైన్యం పరువు తిరిగి

నిలబడింది కూడా ఏమీలేదు. ముఖ్యంగా విపక్షనేత ఇమ్రాన్‌ఖాన్ పట్ల సైన్యం వ్యవహరిస్తున్న తీరుపై పాక్ ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాల్లో ఎటువంటి మార్పు లేదు.

జనవరి 16న ఇరాన్, ప్రిసిషన్ మిస్సైల్స్, డ్రోన్లతో జైష్ అల్ అదల్‌కు చెందిన ప్రధాన కేంద్రాలను ధ్వంసం చేసేందుకు దాడులు నిర్వహించింది. 'తమ దేశ సార్వభౌమత్వంపై జరిపిన దాడులుగా పేర్కొంటూ ఇదెంతమాత్రం సహించ రానిదని' పాకిస్తాన్ తీవ్రంగా ప్రతి స్పందించింది. తర్వాత జనవరి 17న ఇరాన్ రాయబారిని బహిష్కరించి, ఇరాన్‌లోని తమ రాయబారిని వెనక్కి పిలిచింది. ఈ దాడులు ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, సంఘటనను మరింత జటిలం చేయకూడదని, ఇంతటితో దీనికి స్వస్తి పలకాలని రెండు దేశాలు నిర్ణయించడం విశేషం.



మొత్తంమీద ఇరాన్ దాడిపై పాక్ స్పందన ఒకపక్క ఆగ్రహం మరోపక్క వదులుకోలేని స్నేహం అన్న చందాన పరస్పర విరోధాభాసను తలపించింది.

**సందిగ్ధ స్పందన**

ఇరాన్-పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న సంఘర్షణ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం స్పందన గందరగోళంగా, సందిగ్ధంగా ఉండటం గమనార్హం. ఎందుకంటే ఈ ప్రాంతంలోని ఉగ్రవాద గ్రూపుల విషయంలో అంతర్జాతీయ సమాజానికి అంతగా అవగాహన లేకపోవడం, బెలూచ్ తీవ్రవాదులు, జెందుల్లా, జైష్ అల్ అదల్ గ్రూపులపై ఎవరికీ ఎక్కువగా తెలియకపోవడం ఇందుకు కారణం. దీనికి తోడు అంతర్జాతీయ సమాజానికి ఈ సంఘర్షణ విషయంలో తగిన రీతిలో స్పందించడానికి అవకాశాలు పరిమితం కావడం కూడా ఒక కారణం.

**ప్రాంతీయానికే పరిమితం**

గతంలో కూడా ఇరాన్-పాక్‌ల మధ్య ఇటువంటి సంఘర్షణలు చోటుచేసు కున్నా, ఈ తరహా పరిణామాలకు దారితీయలేదు. కానీ గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధం, ఎర్ర సముద్రం వద్ద యుఎస్-యెమన్ తీవ్రవాదుల మధ్య కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ రెండు దేశాల మధ్య పరస్పర దాడులు కొనసాగడం, ఘర్షణలు విస్తరిస్తాయన్న భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం రెండు దేశాలు వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో ఇరాన్ ప్రాక్సీ గ్రూపులు యుద్ధాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో ఇదెంతవరకు నిలుస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లెబనాన్‌లోని హిజ్‌బుల్లాతో, గాజాలోని హమాస్‌తో ఇరాన్‌కు సంబంధాలున్నాయి. ఈ రెండు గ్రూపులు ఇజ్రాయిల్‌తో పోరాడు తున్నాయి. ఇదిలావుండగా యెమెన్‌లోని హౌతీలకు ఇరాన్ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం ఈ గ్రూపు ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు జరుపుతోంది. ఇరాక్, సిరియా ల్లోని చిన్నాచితకా ఉగ్ర గ్రూపులకు ఇరాన్ మద్దతిస్తోంది. ప్రస్తుతం ఇవి, ఐఎస్ఐఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న యుఎస్ సంకీర్ణాలపై దాడులు చేస్తున్నాయి. ఇరాక్, సిరియాలతో పాటు పాకిస్తాన్‌పై కూడా ఇరాన్ దాడులకు పాల్పడటం కేవలం తన పోరాట సామర్థ్యాన్ని ప్రపంచానికి వెల్లడించడానికేనన్న అభిప్రాయాలు వ్యక్తం కావడం మరో కోణం! ఈ పరిణామాల నేపథ్యంలో ఈ పరస్పర దాడులు ఆందోళన కలిగించినప్పటికీ, ఇవి ప్రాంతీయానికే పరిమితమన్నది సుస్పష్టం. ఎందుకంటే ఇరాన్, పాకిస్తాన్ రెండు దేశాలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అంతర్గతంగా రాజకీయ సమస్యలతో పీకల్లోతు కూరుకుపోయాయి. త్వరలో పాక్‌లో ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో దేశం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇదిలావుండగా జనవరి 16న ఇరాన్ చేసిన దాడి పాకిస్తాన్‌ను ఆశ్చర్యపరచిందన్నది మాత్రం నిజం.

**ఇరాన్ భద్రతకు ముప్పు**

ఇరాన్ కేవలం పాకిస్తాన్‌పై మాత్రమే కాదు, ఇరాక్, సిరియాలపై కూడా దాడులు చేసింది. పాక్‌లో జైష్ అల్ అదల్‌పై, సిరియాలో ఐఎస్ఐఎస్ అనుబంధ సంస్థలపై, ఇరాక్‌లో మొసాద్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ జరిపిన దాడులు క్రమంగా ఈ ప్రాంతంలో ఇరాన్ వల్ల ప్రమాదం పెరుగుతున్నదన్న అంశం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ తాను మద్దతిస్తున్న ఉగ్రవాద సంస్థల ద్వారా దాడులకు పాల్పడుతున్న తరుణంలో, గత రెండు నెలల కాలంలో తన ప్రత్యర్థుల నుంచి ప్రతీకార దాడులను ఎదుర్కొనాల్సి వచ్చింది. ఇరాన్ నగరం కెర్మన్‌లో మాజీ ఇస్లామిక్ రివ్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఖాసిం సులేమాని సంస్మరణ కార్యక్రమంలో జరిగిన బాంబు పేలుడులో వందమంది ప్రజలు మరణించారు. ఇందుకు తామే కారణమని ఐ.ఎస్.ఐ.ఎస్. ఖొరాసాన్ ప్రావెన్స్ ప్రకటించింది. అదేవిధంగా మొసాద్ కూడా ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ సైనిక సలహాదారు సయ్యద్ రజీ మౌసవీని గత డిసెంబర్‌లో డెమాస్కస్‌లో హతమార్చింది. ఈ సంఘటనలు ఇరాన్‌లో అంతర్గత అభద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌కు వ్యతిరేకంగా యు.ఎస్. తిరిగి పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తే ఇప్పటికే ఆంక్షల ఒడిలో సతమతమవుతున్న ఇరాన్ ఉక్కిరిబిక్కిరి కావడం ఖాయం. అయితే ఇరాన్‌కు రష్యా వెన్నుదన్నుగా ఉన్నదనేది జగమెరిగిన సత్యం. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా, ఇరాన్ డ్రోన్లనే వాడింది. ఈ నేపథ్యంలో రష్యా సమ్మతిలేకుండా ఇరాన్ ఇటువంటి దాడులకు పాల్పడే సాహసం చేస్తుందంటే నమ్మశక్యం కాదు. ప్రస్తుతం హమాస్, హౌతీ, హిజ్‌బుల్లా తీవ్రవాదులకు ఇరాన్ మద్దతిస్తోంది. ఇవి ఎర్రసముద్రంలో అమెరికాతో సంఘర్షిస్తున్నాయి. హమాస్, హౌతీలు ఇజ్రాయిల్‌తో పోరాడుతున్నారు. ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్న అమెరికా, ఇరాన్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్‌కు మద్దతివ్వడానికి వెనుకాడదు. అప్పుడు ఇరాన్‌కు రష్యా ప్రత్యక్ష మద్దతు ఇవ్వక తప్పదు. భారత్‌కు ఇరాన్ మిత్రదేశం! తనకు సన్నిహిత మిత్రులుగా ఉన్న పాక్-ఇరాన్‌ల మధ్య ఘర్షణ చైనాకుఎంతమాత్రం ఇష్టంకాదు. ప్రస్తుతం పాక్-ఇరాన్‌ల మధ్య ఘర్షణ ముదరలేదు కాబట్టి ఈ పరిణామాలు సంభవించే అవకాశం లేదు.

**షియా-సున్నీల ఘర్షణల్లో ఇరాన్ హస్తం?**

పాకిస్తాన్‌లో ఏటా మొహర్రం పర్వదినం సమయంలో షియా-సున్నీల ఘర్షణలు జరగడం సర్వసాధారణమైపోయింది. షియా జనాభా పెద్ద సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో లేదా షియా మతపెద్దలు

## గత దశాబ్ద కాలంగా రెండు దేశాల మధ్య సంఘర్షణల క్రమం

- 2013: 14 మంది ఇరానియన్ గార్డులను హతమార్చినట్టు జైష్ అల్ అదల్ ప్రకటించింది.
- 2017: ఏప్రిల్‌లో జైష్ అల్ అదల్ 10మంది ఇరానియన్ గార్డులను చంపేసింది.
- 2017: ఇరాన్‌కు చెందిన డ్రోన్‌ను పాకిస్తాన్ కూల్చివేసింది.
- 2018: అక్టోబర్‌లో 12మంది ఇరాన్ భద్రతా సిబ్బందిని జైష్ అల్ అదల్ కిడ్నాప్ చేసింది.
- 2018: డిసెంబర్‌లో ఈ సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో నలుగురు ఇరానియన్ పోలీసులు మరణించారు.
- 2019: ఇరాన్‌లోని ఉగ్రవాదులు 14మంది బెలూచ్ పౌరులను హత మార్చారని పాకిస్తాన్ ఆరోపించింది.
- 2021: సెప్టెంబర్‌లో ఇరాన్ సైనికులతో జరిగిన పరస్పర కాల్పుల్లో తమ సైనికుడు మరణించినట్టు పాక్ ప్రకటించింది.
- 2023: ఇరాన్ వైపు నుంచి జరిగిన దాడిలో తాము నలుగురు సైనికులను కోల్పోయినట్టు పాక్ వెల్లడించింది.
- 2023: డిసెంబర్‌లో తాము జరిపిన దాడిలో 11మంది ఇరాన్ భద్రతా సిబ్బంది మరణించినట్టు జైష్ అల్ అదల్ ప్రకటించింది.
- 2024: జనవరి 16వ తేదీన పాక్‌లోని జైష్ అల్ అదల్ స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఈ సంఘటనలో ఇద్దరు పిల్లలు మరణించారని పాక్ పేర్కొంది.
- 2024: జనవరి 18న పాకిస్తాన్ ఇరాన్‌లోని బెలూచ్ తిరుగుబాటుదారుల స్థావరాలపై క్షిపణులతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో 9 మంది ఇరానేతరులు మరణించారని ఇరాన్ మీడియా పేర్కొంది. అంటే బహుశా వీరంతా పాక్ జాతీయులై ఉంటారని అనుమానం.

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లో ఈ దాడులు జరుగుతున్నాయి. గత ఏడాది మొహర్రం సందర్భంగా షియా మతపెద్ద చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రెండు వర్గాల మధ్య ఉద్రిక్తలకు కారణమయ్యాయి. చాలా సంవత్సరాలుగా ఈ రెండు వర్గాల మధ్య జరుగుతున్న ఘర్షణలు పాక్ అంతర్గత శాంతికి భంగం వాటిల్లజేస్తున్నాయి. నిజానికి పాకిస్తాన్‌లో ఈ వర్గాల మధ్య ఘర్షణలు ఒక్కసారిగా చోటుచేసుకుంటున్నవి కావు. 1979లో ఇరాన్ విప్లవం తర్వాత నుంచి ఇవి ప్రారంభమయ్యాయి. ఇరాన్‌లో విప్లవం విజయవంతమయ్యాక పాక్‌లోని బక్కర్ పట్టణంలో 'జఫారీ' ఉద్యమాన్ని షియావర్గం వారు ప్రారంభించారు. ఈ గ్రూపు నాయకుడి పేరు అరిఫ్ హుస్సేన్ అల్–హుస్సేనీ. ఇరాన్ విప్లవ నాయకుడు అయొతొల్లా ఖొమైనీకి ఈయన శిష్యుడు. ఇరాన్ మద్దతుతో హుస్సేనీ పాకిస్తాన్‌లో ఇరాన్ సైద్ధాంతిక సూత్రాలను వ్యాప్తి చేయడానికి కృషిచేశాడు. పాకిస్తానీ మదరసాల్లో ఇరాన్ విప్లవ అనుకూల సిద్ధాంతాలను పాఠ్యాంశాలుగా బోధిస్తూ, యువతను ఇరాన్‌లో విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తూ వచ్చాడు. ఇదే సమయంలో ఇరాన్ విప్లవ సిద్ధాంతాలను పాక్‌లో చొప్పించాలని కూడా యత్నించాడు. చివరకు ఆయన యత్నాలు 'జైనాబియన్ బ్రిగేడ్' ఏర్పాటు రూపంలో ఫలించాయి. ఈ సంస్థ పాకిస్తాన్‌కు చెందిన యువతను రిక్రూట్ చేసి వారికి ఇరాన్ శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. ఈవిధంగా శిక్షణ పొందిన యువకులను ఇరాన్, సిరియా అంతర్యుద్ధంలో వినియోగించింది. పాకిస్తాన్ షియా వర్గంతో ఏర్పడిన 'జైనాబియన్ బ్రిగేడ్' అలెప్పో, డెమాస్కస్ కేంద్రాలుగా పనిచేస్తుంది. కాగా 2012 లో సలాఫీ ఉగ్రవాదులు డెమాస్కస్‌లోని 'సయ్యిదా జైనాబ్' ప్రార్థనా మందిరంపై క్షిపణి దాడికి పాల్పడిన నేపథ్యంలో 2014లో పాకిస్తాన్‌కు చెందిన షియా మిలిటెంట్లు 'జైనాబియన్ బ్రిగేడ్' పేరుతో ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. అంతకు ముందు వీరు ఎవరికి వారే చిన్న గ్రూపులుగా తమ కార్యకలాపాలు నిర్వహించేవారు. ఈ 'సయ్యిదా జనాబ్' ప్రార్థనా మందిరం పరిరక్షణ బాధ్యతను ఇరాన్ ఈ గ్రూపునకు అప్పగించింది. ఈ గ్రూపులో పనిచేసే పాకిస్తాన్ షియా యువత ఉన్నత విద్యావంతులు. ముఖ్యంగా వీరు పాక్ నుంచి విద్య లేదా 'పవిత్ర స్థలాల సందర్శన' పేరుతో ఇరాన్‌లో ప్రవేశించి, విద్యావంతులైనవారు. ఇరాన్‌లోని 'ఖోమ్' యూనివర్సిటీ పాకిస్తానీ విద్యార్థులను రిక్రూట్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం ఇందులో 2500 మంది వరకు మిలిటెంట్లు ఉన్నట్టు పాక్ ఇంటెలిజెన్స్ వర్గాల అంచనా. ఇందులో రిక్రూట్ అయినవారికి ఇరాన్ నెలకు 700–750 యు.ఎస్. డాలర్లు వేతనంగా చెల్లిస్తుంది. అయితే వీరు ఇరాన్ చెప్పిన



విధంగా పోరాటాల్లో పాల్గొనాల్సివుంటుంది.

పాకిస్తాన్‌లో సుమారు 80 నుంచి 85 శాతం మంది సున్నీవర్గానికి చెందిన వారే. వీరంతా వివిధ సున్నీ సిద్ధాంతాలను (దియోబంది, బరెల్విస్, సుఫీలు, సలాఫీలు/వాహబీ) అనుసరిస్తుంటారు. ఇదే సమయంలో ఇరాన్ మద్దతుతో పనిచేసే షియా సంస్థలకు కూడా పాక్‌లో తగినంత గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌లో జరిగే షియా–సున్నీ ఘర్షణల్లో ఇరాన్ పాత్ర ఉన్నద న్న అనుమానాలు వ్యక్తమవడం సహజం. పాకిస్తాన్‌లో ఈ రెండు వర్గాల ప్రజలమధ్య మొట్టమొదటిసారి 1986లో ఘర్షణలు జరిగాయి. అప్పటి నుంచి గత ఏడాది వరకు దాదాపు మూడు వేల మతఘర్షణలు పాక్‌లో చోటుచేసుకున్నాయని అంచనా. గత ఏడాది వరకు ఈ ఘర్షణల్లో పది వేల మంది ప్రాణాలు కోల్పోయారు. జైనాబియన్ బ్రిగేట్ ఏర్పాటుకు ప్రతిస్పందనే పాక్‌లో షియా వర్గాలపై పెరిగిన దాడులు! షియాలకు వ్యతిరేకంగా ఏర్పడిన హింసాత్మక సున్నీ గ్రూపు లష్కర్ ఎ జంఘవీ!

ఇదిలావుండగా ఇటీవలి కాలంలో సిరియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తీవ్రవాదుల రిక్రూట్‌మెంట్లు బాగా తగ్గిపోవడంతో జైనాబియన్ బ్రిగేడ్ భవితవ్యం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఇరాన్ తమ దేశం నుంచే మిలిటెంట్లను రిక్రూట్ చేసుకుంటుందన్న విషయం పాకిస్తాన్‌కు తెలిసినప్పటికీ పైకి వెల్లడించదు. పాక్ మీడియా కూడా దీనిపై పెదవి విప్పకపోవడం మరో విచిత్రం. బెలూచ్ నాయకులు, బెలూచ్ ఉగ్రవాదులకు ఇరాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ఆరోపిస్తుండగా జుండుల్లా, జైష్ అల్ అదల్, హర్కత్ అన్సార్ వంటి ఇరాన్ వ్యతిరేక ఉగ్రవాదులు పాక్‌లో సురక్షితంగా ఉన్నారని ఇరాన్ ఆరోపిస్తోంది. కేవలం మత ఛాందసవాదాన్ని నమ్ముకొని, ఉగ్రవాద విష సర్పాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ప్రస్తుతం దాని కోరల్లోనే చిక్కుకొని విలవిల్లాడుతూ విషాదాంతం దిశగా పయనిస్తోంద నడంలో ఎంతమాత్రం సందేహం లేదు! ★

## కథ

"తాతయ్యా ఇక్కడే ఈ రోజు రాత్రికి సంగీత్ సంబరం. నువ్వూ బామ్మ ఇద్దరూ డాన్స్ చేస్తుంటే చూడాలని ఉంది. చేస్తారు కదూ నాకోసం" వేదిక చూపిస్తూ చెప్పింది పెళ్లికూతురు అన్వయ, డెబ్బై ఏళ్ళ తాత చిన్మయమూర్తికి.

"రాత్రికి వచ్చేవాళ్లలో ఎముకలు అతికించే డాక్టర్ ఎవరైనా ఉంటే, నాకు అభ్యంతరం లేదు అన్నూ" సరదా తగ్గకుండా ఆయన సమాధానం.

అన్వయ తండ్రి మారుతీరావుది బట్టల వ్యాపారం. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ముఖ్యపట్టణాల్లో గొలుసు దుకాణాలు కూడా ఉన్నాయి అతనికి. కూతురు అన్వయ పెళ్లి, బంధుమిత్రులందరూ మరచిపోలేని విధంగా జరిపించడానికి, కృష్ణానది లంకల్లో వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లు జరిగాయి. ఆ రోజు ఉదయమే మెహందీ కార్యక్రమం అయ్యింది. మర్నాడు పెళ్లి. మధ్యాహ్న భోజనం అయ్యాక తాత, తండ్రి, మనవరాలు..సంగీత్ జరగబోయే వేదిక దగ్గర ఏర్పాట్లు చూడడానికి వచ్చారు. ఇంతలో అక్కడకి రవాణా లారీ వచ్చింది.

"ఏమొచ్చాయ్ అందులో" అడిగాడు తండ్రి అన్వయని.

"చూడాలి" చెప్పింది అన్వయ.

ఇంతలో ఇద్దరు కూలీలు లారీ నుండి దిగి, తెచ్చిన వస్తువులు దింపసాగారు. చిన్మయమూర్తి, అన్వయ, మారుతీరావు అక్కడకి నడిచారు!

హమాలీలు ముందుగా కొన్ని చెక్కబల్లలు దించారు. తర్వాత దించుతున్న వాటిని చూసి అన్నాడు చిన్మయమూర్తి ఆశ్చర్యంగా, "ఏయ్ నులకమంచాలు! ఇవి దేనికి!" అన్వయ వైపు చూస్తూ.

"ఆ.. గుర్తొచ్చింది. ఇవాళ రాత్రి డిన్నర్ కార్యక్రమం కోసం అవి.. రోడ్డు ప్రక్క ధాబాలాగా ఏర్పాటు ఉంటుంది. ఆ మంచాల మీద ఇద్దరు ఇద్దరు కూర్చోని, మధ్యలో ఆ బల్ల పెట్టుకొని తినాలి. అన్నీ మీ దగ్గరకే వచ్చి వడ్డిస్తారు. లేచే పని లేదు" చెబుతున్న అన్వయకి అడ్డు తగులుతూ అడిగాడు చిన్మయమూర్తి, "మగవాళ్లు తేలికగా కూర్చోగలరు.. మరి ఆడవాళ్లు? పట్టు చీరలు పాడైపోవూ?"

"ఈ ఏర్పాటు ఆడవాళ్ల కోసం కాదు, రాత్రికి మగవాళ్ల వెట్ పార్టీకి" మారుతీరావు చెప్పాడు తండ్రికి రహస్యం చెప్పినట్టు.

"చూడు తాతయ్యా..మంచాలు బాగున్నయ్యా?" అడిగింది అన్వయ.

ఒక మంచం వాల్చి, కూర్చోని చూసి "గట్టిగానే ఉన్నది గానీ, కొంచెం కుక్కిగా అంటే గుంటగా ఉంది. సరి చెయ్యాలి. వ్యాపార ధోరణి కదా, అవసరమైతే తప్ప, అడిగితే తప్ప ఇట్లాంటివి పట్టించుకోరు" చెప్పాడు చిన్మయమూర్తి. ఇంతలోనే కాంట్రాక్టర్ ఒక మనిషిని తీసుకువచ్చి మంచాలు చూపించి, "ఇవన్నీ బిగించు ముందు" అని చెప్పి, అన్వయతో, "మొత్తం ముప్పై మంచాలు, బల్లలు. చాలా అమ్మా? ఇంకా తెప్పించమంటారా?" అని అడిగాడు.

"చాలండీ. కానీ వీటిని ఉంచాల్సింది ఇక్కడ కాదు. దాని వెనకాల ఉన్న కొబ్బరితోటలో. అక్కడ వేయమనండి" చేత్తో చూపిస్తూ చెప్పింది అన్వయ.

తర్వాత వచ్చి తాతయ్య ప్రక్కన మంచం మీద కూర్చుంది.

" నాకు నులకమంచం చూస్తే మా అమ్మే గుర్తొస్తుంది రా,.. ఇపుడు నువ్వు వచ్చి కూర్చుంటే మా అమ్మే వచ్చి కూర్చున్నట్టు ఉంది నా పక్కన" అన్నాడు చిన్మయమూర్తి, అన్వయ తలమీద చెయ్యి వేసి. మళ్లీ ఆయనే మాట పొడిగించాడు "ఎన్ని ఏళ్లయ్యిందో ఇలా కూర్చోని! చిన్ననాటి సంగతులు గుర్తొస్తున్నాయి. మా అమ్మకు నులకమంచంతో చాలా అనుబంధం".

" చెప్పు తాతయ్యా ఏంటి అది? మనకి ఇప్పుడు పనులేం లేవులే"

చెప్పసాగాడు చిన్మయమూర్తి –

* * *

మా అమ్మకి చాలా విద్యలు వచ్చు! అందులో వొకటి మంచం అల్లడం! నులకతో మంచం అల్లడం ఓ కష్టతరమైన విద్యనే! దీని పట్టీలు ఏటవాలుగా వస్తాయి. ఆ పట్టీల ఒకదానిమీద ఇంకోటి పడడం చూస్తే డైమండ్ ఆకారంలో ఖాళీలు ఉండి చూడ్డానికి అందంగా ఉంటాయి. అలా అల్లగలగడమే అసలైన సమర్థత!



# నులకమంచం

**రాయప్రోలు వెంకటరమణశాస్త్రి**



గోపాలకృష్ణ

మా చిన్నప్పుడు ఎక్కువ నులకమంచాలే ఉండేవి. నవ్వారు మంచాలు కొంచెం డబ్బున్న వాళ్ల ఇళ్లల్లో ఉండేవి. మా ఇంట్లో, మా స్నేహితుల, బంధువుల ఇళ్లల్లో అన్నీ నులకమంచాలే కనపడేవి. మా ఇంట్లో –మంచాలు– అని బహువచనం వాడే పరిస్థితి ఉండేది కాదు చాలా రోజుల వరకు!

ఈ నులకమంచం రెండు రకాలు – ఒకటి వెదురు కర్రలతో చేసినది. ఇది అందుబాటు ధరలో ఉండేది. రెండోది చెక్క పట్టెలు కలిగి ఉండేది దీనిలాగా. దీని పట్టెలు వడ్రంగులు చేసి పెట్టే వారు. తలవైపు, కాళ్లవైపు ఉండేవి అడ్డపట్టెలు. అవి నిలువు పట్టెలకంటే కొంచెం ఎత్తులో ఉంటాయి. దీన్ని పట్టెమంచం అనడం కూడా కద్దు. ఇది వెదురు మంచం కంటే బరువుగా ఉంటుంది, ఖరీదు కూడా. మంచాలు రెండు రకాలైనా, అల్లిక మాత్రం ఒకటే విధానం.

మా అమ్మకి ఉన్న చురుకుతనం, అవగాహన వల్ల దేన్నైనా నేర్చేసుకోగలదు చాలా తొందరగా – ఇది నేను అన్నమాట కాదు, మా అమ్మమ్మ చెబితే విన్నమాట!

అమ్మ ఎక్కడ, ఎప్పుడు నేర్చుకుందో తెలియదుగానీ, తను మంచం అల్లగలదని, నాకు ఊహతెలిసినప్పటి నుండి తెలుసు. చుట్టుపక్కల వాళ్లు కూడా అమ్మచేత నులకమంచం అల్లించుకునే వాళ్లు. అమ్మ, స్నేహాన్ని పెంచుకోవడం కోసం, మర్యాదలను పంచుకోడం కోసం మాత్రమే తన విద్యను ఉపయోగించేది. ఫలాపేక్ష లేకుండా నిస్వార్థంగా సేవాధర్మంతో చేసే పనిలో తృప్తి ఎంతో ఉంటుందని అమ్మను చూసి తెలుసుకున్నాను.

నులకమంచం అల్లడం విద్యే కాకుండా శ్రమతో కూడినది కూడా. మరో వ్యక్తి సాయం తీసుకుంటేనే కొంత శ్రమ తగ్గి, తక్కువ సమయంలో అల్లేసేయచ్చు. అల్లిన తర్వాత రెండురోజులు అమ్మ చేతివేళ్లు గుంజేస్తో ఉండేవిట!

తెచ్చిన నులకను మొదట ఉండలాగా చుట్టేది. ముందు మంచానికి కాళ్లకట్ట కట్టి దానికి పురి పెట్టేది బాగా, ఒక కర్రతో. రెండు చెక్క పుల్లల సాయంతో ఏటవాలుగా నులక పట్టీలు వేయడం చేస్తుంది. ఒక్కొక్క పట్టికీ నాలుగు నులక పొరలు ఉండేవి. ఒక్కో పట్టిని ఒక్కో గృహం, అంటే ఇల్లు లాగా పరిగణిస్తారు. వాటికి పేర్లు కూడా వుంటాయి, అవి – శ్రీ, యశో, ఆయుః, మృత్యు! అంటే చివరి పట్టీకి ఏ గృహం పేరు వస్తుందో ఆ మంచం వాడుక వల్ల అది కలుగు తుందని విశ్వాసం! అవి వరుసగా డబ్బు, కీర్తి, ఆయుషు, మరణంకి నిలయాలని నమ్మకం. చివరి పట్టీ ఎప్పుడూ మృత్యుగృహంగా ఉండకుండా చూసుకోవాలి. అలా వస్తూంటే ఇంకో పట్టీ పట్టే స్థలం ఉంటే ఒకటి వేయాలి, లేదా ఒక పట్టీ తీసేయాలి. మృత్యు గృహంలో ఆగితే దాని మీద

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

పడుకున్న వాళ్లకి భూమ్మీద నూకలు చెప్పినట్లే. అందుకే లెక్క తప్పు పోగూడదు!

అమ్మ మంచం అల్లడాన్ని శ్రద్ధతో చేసే ఒక దైవ కార్యం లాగా తలచేది ! ఈ విషయం నాకు ముందు తెలియదు. అమ్మకు అల్లడంలో సాయం వెళ్లగా వెళ్లగా తెలిసింది. మంచానికి కాళ్లకట్ట పోసేటప్పుడు ఏవో సంస్కృత మంత్రాలు చదివేది! తర్వాత పట్టీలు వేసేటప్పుడు కూడా దైవస్తుతి చేస్తూ, తక్కువగా... అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడుతూ వుండేది.

నులకమంచం మన వాడుకలో ఇప్పుడు లేకపోయినా, దాని అందాన్ని మాత్రం మనసులో నుంచి తీసేయలేను" అంటూ చెప్పడం ఆపాడు చిన్మయమూర్తి.

ఉద్వేగంతో చెప్పిన తాతయ్యను చూసి "బాగా ఎమోషనల్ అయిపోయావు తాతయ్యా! నులకమంచం వెనక ఇంత కథ ఉందా? అనిపించింది నువ్వు చెప్పాక" అంది అన్వయ.

"కథ కాదు దీన్లో అంత కళ ఉందా అని అడగాలి! మీ భాషలో అయితే ఎంత సీన్ ఉంది? అని ఆశ్చర్య పోయే విషయం!!"

"నీకు వచ్చా అల్లడం?" కుతూహలంగా అడిగింది అన్వయ.

"అభిమన్యుడిలాగా సగం విద్యే తెలుసు నాకు. నేను ఎప్పుడూ మొదలు పెట్టడం నేర్చుకోలేదు. అమ్మకి సహాయంగా నులక ఉండని అవతలవైపు అందుకోవడం, మంచం కోడు ఎత్తిపట్టి తాడును వేసి, చెక్క పుల్లని సరి చెయ్యడం చేసేవాడిని. చివరలో కాళ్లకట్ట లాగి బిగించి కట్టడానికి నన్నే పిలిచేది. ఎంత బలంగా లాగితే అంత బిగి ఉంటుంది మంచానికి."

" నీకు ఇదంటే ఇంత ప్రేమని నాకు తెలీదు తాతయ్యా"

" ఎట్లా తెలుస్తుంది? నువ్వు పుట్టే సరికే ఇంట్లో అన్నీ చెక్క మంచాలు, వాటి మీద మెత్తటి పరుపులు వచ్చేసాయిగా. మా అమ్మ చివరిగా అల్లిన మంచం మీ నాన్న పెళ్లి వరకూ ఉండింది."

"ఇప్పుడు ఎక్కడైనా అమ్ముతారా ఇవి?" అడిగింది అన్వయ.

"తెలీదు, కనపడడం లేదు. నెట్లో వెతుకు, దొరకచ్చు. అయినా మీ నాన్న తన ఇంద్రభవనంలోకి దీన్ని రానిస్తాడా" నవ్వుతూ అన్నాడు చిన్మయమూర్తి.

"ఇదిగో ఉంది. దొరుకుతోంది అమెజాన్‌లో.. నలభై వేలుట ధర" సెల్ ఫోన్‌లో చూస్తూ చెప్పింది అన్వయ.

ఇంతలో మారుతీరావు అక్కడకి వచ్చాడు. వస్తూనే, "చాలా బాగుందిరా అన్నూ నీ ఈ ధాబా ఏర్పాటు. చక్కగా వచ్చింది. కొబ్బరి చెట్లకు లైట్స్ తగిలిం చేశారు, నడిచే దోవలో మంచాలు, బల్లలు వేస్తున్నారు. డ్రింక్స్ సర్వ్ చెయ్యడానికి అందరికీ అందుబాటులో ఉండేలా నాలుగు స్టేషన్లు పెట్టారు. మగ పెళ్లివారు అదిరి పోయేలా ఉంది. ఇక్కడ ఇవతల సంగీత్‌లో సాగే పాటలు అక్కడికి కూడా వినిపిస్తాయి!" మెచ్చుకోలుగా చెప్పాడు మారుతీరావు అన్వయతో.

"తాతయ్యా! నేను ఇక్కడకు వచ్చేసాక నువ్వు చాలా డల్‌గా అయ్యావని తెలిసింది. ఆ రోజు పెళ్లికి ముందు రోజు నులక మంచం మీద మనం కూర్చున్నప్పుడు, నువ్వు మీ అమ్మ గురించీ, మంచం అల్లడం గురించీ చెబుతుంటే నీ కళ్లల్లో వెలుగు, నీ మాటల్లో ఉత్సాహం చూశాను. నువ్వు ఇంతకు ముందెప్పుడూ అంత ఎమోషనల్ అవడం నేను చూడలేదు. ఆ వెలుగూ, ఉత్సాహం నీలో ఎప్పటికీ ఉండాలనే, నాన్నని ఒప్పించి, అమెజాన్‌లో నీకోసం నులక మంచం ఆర్డర్ పెట్టాను. ఈ రోజు ఇంటికి వచ్చిందని తెలిసింది. చూసి చెప్పు. నీకు నచ్చిందా? మొహమాటానికి నచ్చిందని చెప్పకు! నిజంగా చెప్పు. ఇంకోటి, దాని అల్లిక శ్రీ, యశో, ఆయు, మృత్యులలో ఏ గృహంలో ఆగివుందో చెప్పు!"



* * *

మర్నాడు మధ్యాహ్నం అన్వయ వివాహం అంగ రంగ వైభవంగా జరిగింది. వచ్చిన చుట్టాలు తిరిగి వెళ్లడం, వియ్యంకుల ఇళ్లల్లో నిద్రలు చెయ్యడం, కొత్త దంపతులు ప్రేమయాత్ర చేసిరావడం, సందడి అంతా సర్దుమణగడానికి దగ్గర దగ్గర నెలరోజులు పట్టింది. తరువాత అన్వయ, భర్తతో అమెరికా వెళ్లి పోయింది.

చిన్మయమూర్తికి ఇల్లంతా వెలితిగా అనిపించ సాగింది మనుమరాలు కాపురానికి వెళ్లిపోవడంతో! మరో పదిరోజులు గడిచాయి.

ఆరోజు మధ్యాహ్నం ఇంటి ముందు రవాణా వాహనం ఒకటి వచ్చి ఉండడం పైనుండి చూశాడు చిన్మయమూర్తి. లోపల లాన్ దగ్గర ఇద్దరు వ్యక్తులు పరికరాలతో ఏదో బిగిస్తుండడం చూసి క్రిందికి వచ్చాడు. వాళ్లు బిగిస్తున్నది ముచ్చటగా అల్లబడి వున్న ఒక – నులక మంచం!

వాళ్లతో మాట్లాడబోతున్న చిన్మయమూర్తికి, ఫోన్‌లో మెసేజ్ వచ్చిన శబ్దం రావడంతో తెరచి చూసాడు. అన్వయ నుంచి. చదవ సాగాడు –

"తాతయ్యా! నేను ఇక్కడకు వచ్చేసాక నువ్వు చాలా డల్‌గా అయ్యావని తెలిసింది. ఆ రోజు పెళ్లికి ముందు రోజు నులక మంచం మీద మనం కూర్చున్న పుడు, నువ్వు మీ అమ్మ గురించీ, మంచం అల్లడం గురించీ చెబుతుంటే నీ కళ్లల్లో వెలుగు, నీ మాటల్లో ఉత్సాహం చూశాను. నువ్వు ఇంతకు ముందెప్పుడూ అంత ఎమోషనల్ అవడం నేను చూడలేదు. ఆ వెలుగూ, ఉత్సాహం నీలో ఎప్పటికీ ఉండాలనే, నాన్నని ఒప్పించి, అమెజాన్‌లో నీకోసం నులక మంచం ఆర్డర్ పెట్టాను. ఈ రోజు ఇంటికి వచ్చిందని తెలిసింది. చూసి చెప్పు. నీకు నచ్చిందా? మొహమాటానికి నచ్చిందని చెప్పకు! నిజంగా చెప్పు. ఇంకోటి, దాని అల్లిక శ్రీ, యశో, ఆయు, మృత్యులలో ఏ గృహంలో ఆగివుందో చెప్పు!"

వచ్చిన పనివాళ్లు వెళ్లిపోయాక చిన్మయమూర్తి మంచం దగ్గరకు వచ్చాడు. మంచి గట్టి చెక్క పట్టెలతో తయారైన మంచం చక్కగా, కుదురుగా నులక అల్లి ఉంది. దాని మీద కూర్చోని తన తల్లి ఒక చేతిలో అన్నం కంచం పట్టుకొని, మరో చేత్తో ముద్దచేసి తనను పిలుస్తున్నట్టు అనిపించ సాగింది చిన్మయమూర్తికి. అతని కళ్లు నీటి గుండాలయినయ్యి. మంచమంతా మనవరాలి ప్రేమ పరిచినట్టు అనిపించింది.

మంచం కోడు పట్టుకుని మెల్లగా దాని ముందు కూర్చున్నాడు. పట్టె మీద ఉన్న గృహాలను గణించాడు – శ్రీ, యశో,ఆయుః, మృత్యు అంటూ! కళ్లను తుడుచుకుని మరోసారి లెక్కించాడు కంపిస్తున్న వేళ్లతో. మొత్తం ఇరవై యెనిమిది పట్టీలు ఉన్నాయి! ఒక్క క్షణం దీర్ఘ శ్వాస తీసుకొని, మంచం మీద వాలి, వాట్సాప్ లో జవాబు పెట్టాడు అన్వయకి –

"మంచం గట్టిగా, అందమైన అల్లికతో ఉంది. నేను ఇప్పుడు ఈ వయసులో పొందాల్సిన గృహంలోనే అల్లిక ఆగింది!"

**వచ్చేవారం కథ..**

**చిరంజీవి 'గంగాలహరి' – విహారి**

తెలుగుతేజం, కోనసీమ కుర్రోడు సాత్విక్ సాయిరాజ్, సహ ఆటగాడు చిరాగ్ శెట్టితో జంటగా దేశ అత్యున్నత క్రీడాపురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు అందుకోడం ద్వారా తెలుగు రాష్ట్రాల బ్యాడ్మింటన్ క్రీడకే గర్వకారణంగా నిలిచాడు.ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ లో బంగారు పతకం సాధించాలన్న 58 సంవత్సరాల భారత్ కలను సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ సాకారం చేశారు. దుబాయ్ వేదికగా ముగిసిన 2023 ఆసియా టోర్నీ పురుషుల డబుల్స్‌లో స్వర్ణ విజేతలుగా నిలిచారు....



# 'ఖేల్‌రత్నం' తెలుగుతేజం!

ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ నుంచి భారత బ్యాడ్మింటన్లోకి దూసుకొచ్చిన సాత్విక్ అంచ లంచెలుగా ఎదిగి ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టులో సభ్యుడిగా నిలువగలిగాడు. గతంలో పురుషుల, మహిళల సింగిల్స్‌లో పుల్లెల గోపీచంద్, పీవీ సింధు సాధించిన ఘనతను సాత్విక్ కేవలం డబుల్స్‌లో సాధించి తనకు తానే సాటిగా నిలిచాడు. ఆల్- ఇంగ్లండ్ చాంపియన్ గోపీచంద్, ప్రపంచ చాంపియన్ పీవీ సింధు రాజీవ్ గాంధీ ఖేల్ రత్న పురస్కారాలు అందుకొంటే..సాత్విక్ సాయిరాజ్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు కైవసం చేసుకుని, ఆ ఘనత సాధించిన తెలుగు బ్యాడ్మింటన్ మూడో ప్లేయర్‌గా రికార్డుల్లో చేరాడు.

**1965లో దినేశ్ ఖన్నాకు స్వర్ణం...**

లక్నో వేదికగా 1965లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత దిగ్గజ ఆటగాడు దినేశ్ ఖన్నా బంగారు పతకం సాధించారు.ఆయన ఫైనల్లో థాయ్ లాండ్ ప్లేయర్ సాంగోబ్ రత్తానుసోర్న్ ను ఓడించారు. 1971 ఆసియాటోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత జోడీ దీపు ఘోష్- రామన్ ఘోష్ కాంస్య పతకం సాధించారు. నాటి నుంచి గత ఏడాది (2022)దాకా ఆసియా బ్యాడ్మింటన్ పోటీలలో భారత్‌కు మరే పతకమూ దక్కలేదు. భారత క్రీడాకారులు ప్రపంచ, ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్ లాంటి క్రీడల్లో పతకాలు సాధిస్తూ వచ్చినా..ఆసియా బ్యాడ్మింటన్ పోటీలలో మాత్రం విఫలమవుతూ వచ్చారు. అయితే.. ఆలోటును పూడ్చుకోడానికి 2023 దుబాయ్ – ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ వరకూ వేచిచూడాల్సి వచ్చింది.ప్రకాశ్ పదుకోన్, పుల్లెల గోపీచంద్, విమల్ కుమార్, సయ్యద్ మోడీ, సైనా నెహ్వాల్, పీవీ సింధు లాంటి హేమాహేమీలే ఆసియా బ్యాడ్మింటన్లో పతకాలు సాధించడంలో విఫలమయ్యారు.

**థామస్ కప్ విజయంలోనూ....**

ప్రపంచ పురుషుల టీమ్ చాంపియన్ల కోసం నిర్వహించే థామస్ కప్ (2022)ను భారత్ తొలిసారిగా గెలుచుకోడంలో డబుల్స్ జోడీ సాత్విక్– చిరాగ్ ప్రధానపాత్ర వహించారు. ఇక..బర్మింగ్ హామ్ వేదికగా ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ పురుషుల డబుల్స్‌లో సైతం అలవోకగా బంగారు పతకం గెలుచుకోడం ద్వారా సత్తా చాటుకొన్నారు. 2011 ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ లో భారతజోడీ గుత్తా జ్వాల- అశ్విని పొన్నప్ప కాంస్య పతకం సాధించిన తర్వాత..మరో భారత జోడీ సాధించిన అపూర్వ విజయం ఇదే.

**గిన్నిస్ ప్రపంచ రికార్డు విజేతగా....!**

బంగారు పతకాలు, అర్జున, ఖేల్ రత్న లాంటి క్రీడాపురస్కారాలు మాత్రమే కాదు...గిన్నిస్ ప్రపంచ రికార్డును సైతం సాత్విక్ సాధించాడు. గిన్నిస్ ప్రపంచ రికార్డు పత్రాన్ని అందుకొన్న తొలి తెలుగు, భారత ఆటగాడిగా నిలిచాడు.... గంటకు 500 కిలోమీటర్లు మించిన వేగంతో బ్యాడ్మింటన్ స్మాష్ కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. గిన్నిస్ ప్రపంచ రికార్డుల ధృవపత్రాన్ని సైతం అందుకొన్నాడు. బ్యాడ్మింటన్ పురుషులు లేదా మహిళల సింగిల్స్ లో మాత్రమే కాదు.. డబుల్స్‌లో సైతం కొందరు క్రీడాకారులు గాల్లోకి ఎగిరి కొట్టే జంప్ షాట్లు లేదా స్మాష్‌ల వేగం గంటకు 250 నుంచి 400 కిలోమీటర్ల వరకూ నమోదైన రికార్డులు ఉన్నాయి. అయితే .. ఆ వేగాన్ని 500 కిలోమీటర్లు దాటించిన ఘనతను మాత్రం తెలుగుతేజం సాత్విక్ సాయిరాజ్ సాధించాడు.

**565 కిలోమీటర్ల వేగంతో స్మాష్....**

ప్రపంచ బ్యాడ్మింటన్లో 2013 వరకూ నమోదైన అత్యంత వేగవంతమైన స్మాష్ గంటకు 493 కిలోమీటర్లు మాత్రమే. గత దశాబ్దకాలంగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డును మలేసియా ఆటగాడు టాన్ బూన్ హ్యాంగ్ నెలకొల్పాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కిన ఈ ప్రపంచ రికార్డును సాత్విక్ సాయిరాజ్ బద్దలు కొట్టాడు. విఖ్యాత బ్యాడ్మింటన్ క్రీడాపరికరాల సంస్థ యోనెక్స్.. టోక్యోఫ్యాక్టరీ జిమ్నాజియంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా.. ఫాస్టెస్ట్ స్మాష్ ల పరీక్ష నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గిన్నిస్ రికార్డ్ ఆఫ్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు సైతం హాజరయ్యారు. స్మాష్‌ల వేగాన్ని మదింపు చేయటానికి గిన్నిస్ నిపుణులు ప్రత్యేక పరికరాలను అమర్చారు. ఫోటోగ్రాఫిక్ రికార్డింగ్ టెక్నిక్‌తో ఫాస్టెస్ట్ స్మాష్ వేగాన్ని రికార్డు చేశారు.

ఇందులో సాయిసాత్విక్ 565 కిలోమీటర్ల వేగంతో కాక్‌ను స్మాష్ చేశాడు. గత పదేళ్లుగా ఉన్న 493 కిలోమీటర్ల స్మాష్ రికార్డు 22 సంవత్సరాల సాయిసాత్విక్ దెబ్బతో తెరమరుగైపోయింది.దాంతో, పురుషుల బాడ్మింటన్‌లో కాక్‌ను బలంగా కొట్టిన ఆటగాడిగా గుర్తింపు సాధించాడు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో తాజాగా చేరిన ఈ రికార్డును తాము స్పాన్సర్ చేస్తున్న సాయి సాత్విక్ సాధించడం తమకు గర్వకారణమని యోనెక్స్ సంస్థ మురిసిపోతోంది.

**సాత్విక్ చేతిలో గిన్నిస్ సర్టిఫికెట్...**

సాయి సాత్విక్ సాధించిన అత్యంత వేగ వంతమైన షాట్ కమ్ స్మాష్‌ను గిన్నిస్ ప్రపంచ రికార్డుల సంస్థ ధ్రువీకరించింది. 2023 ఏప్రిల్ 14న నమోదైన ఈ రికార్డును గిన్నిస్ అధికారులు పలు విధాలుగా నిర్ధారించుకొన్న అనంతరం ధృవీకరించినట్లు అధికారికంగా ప్రకటించారు.

అమలాపురంలోని సాత్విక్ సాయిరాజ్ ఇంటికి కొరియర్ ద్వారా గిన్నిస్ సంస్థ ధ్రువీకరణ పత్రాన్ని పంపింది. తన కుమారుడి పేరుతో వచ్చిన గిన్నిస్ కవర్‌ను సాత్విక్ తండ్రి తెరచి చూసి పొంగిపోయారు. గిన్నిస్ ప్రపంచ రికార్డు పత్రాన్ని తన అమ్మానాన్నలతో కలిసి అభిమానులతో పంచుకోడం ద్వారా సాత్విక్ గాల్లో తేలిపోయాడు. గంటకు 565 కిలోమీటర్ల వేగంతో తాను కొట్టిన ప్రపంచ రికార్డు స్మాష్ తన తండ్రి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందంటూ సాత్విక్ ప్రకటించాడు. పారిస్ వేదికగా వచ్చే ఏడాది జరిగే ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ లో భారత్ కు బంగారు పతకాన్ని అందించగలిగితే బ్యాడ్మింటన్ ఆటగాడిగా 23 ఏళ్ల సాత్విక్ విజయాలు, జీవితం పరిపూర్ణమవుతాయి. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# నారీశక్తి సమ్మేళనాలు

భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు సురక్షితంగా ఉండాలంటే మహిళా చైతన్యంతోనే సాధ్యం. మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. నేడు వివిధ రంగాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార మార్గాల గురించి ఆలోచించడానికి, మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే సదుద్దేశంతో వివిధ జిల్లాల్లో మహిళా శక్తి సమ్మేళనాలు నిర్వహించారు. ఆ కార్యక్రమాల చిత్రమాలిక.




**పాలమూరులో** జనవరి 28 తేదీన జరిగిన నారీశక్తి సమ్మేళనంలో జిల్లా నలుమూలల నుండి 2200 మంది మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జస్టిస్ పట్లోళ్ల మాధవిదేవి, జాతీయ మానవ హక్కుల సభ్యురాలు విజయభారతి హాజరయ్యారు.




**ఇందూరు** బి.ఎల్.ఎన్.గార్డెన్‌లో జనవరి 28 తేదీన నిర్వహించిన నారీశక్తి సమ్మేళనంలో జిల్లా నుండి సుమారు 2000 మంది మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఆచార్య వంగరి త్రివేణి (తెలంగాణ యూనివర్సిటి), ప్రధాన వక్తగా రూప (సేవికాసమితి కార్యకర్త) పాల్గొన్నారు.




**భాగ్యనగర్** (దిల్‌సుఖ్‌నగర్ భాగ్)లో శుభం కన్వెన్షన్ హాల్‌లో జనవరి 28న నారీశక్తి సమ్మేళనం జరిగింది. జిల్లా నలుమూలల నుండి 2000 మంది మహిళలు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు

**గుంటూరు:** సక్షమ్(దివ్యంగుల కోసం పనిచేస్తున్న అఖిల భారత సంస్థ) గుంటూరు రౌండ్ టేబుల్ మహిళావింగ్ జనవరి 29న దివ్యంగులకు ట్రైసైకిల్స్, ఉపాధి కొరకు బడ్డీ షాప్ కొరకు ఆర్థిక గుంటూరులోని పట్టాభిపురం కమిటీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుస్మిత, జమిలీ రిషిత, జమిలీ రామ్, హరి, సక్షమ్ రాష్ట్ర కార్యదర్శి రామారావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు రమణి, సహకార్యదర్శి అరవింద్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు

# భాగ్యనగరంలో కోటి ప్రత్యంగిర మహాయాగం





**కు**ర్తాళం శంకరాచార్యులు, జగద్గురువులు, భక్తజనం నడిచే దైవంగా కొలిచే శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి 88వ అవతరణోత్సవాల సందర్భంగా భారతదేశంలో ప్రప్రథమంగా అష్టోత్తర శతకుండాత్మక కోటి ప్రత్యంగిర మహాయాగం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. జనవరి 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ఎనిమిది రోజుల పాటునిర్వహించిన ఈ కార్యక్రమాలకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వేదికయ్యింది. 108 హోమగుండాలు.. 25వేల కేజీలకు పైగా మిరపకాయలు.. వేద మంత్రోచ్చారణల నడుమ రెండు పూటలా హోమాలు.. సాయంత్రం విశేష కల్యాణాలు.. భక్తులకు ఉచిత ప్రసాదంగా రుద్రాక్షలు, రూపులు, యంత్రాల పంపిణీ.. అల్పాహారం అన్నప్రసాదాల వితరణ... కోటి ప్రత్యంగిర మహాయాగం వైభవం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఈ సారి స్వామీజీ ఆశీస్సులతో, మాతాజీ రమ్యానంద భారతి మహాస్వామి సూచనలతో కోటి ప్రత్యంగిర మహాయాగాన్ని సంకల్పించారు. ప్రత్యంగిర పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్ పర్యవేక్షణలో, హైదరాబాద్ ప్రత్యంగిర పీఠం ధర్మాధికారి వల్లూరు శివకోటేశ్వరరాజు, కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆస్థాన పండితులు, బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో యాగవైదిక కార్యక్రమాలు ఘనంగా సాగాయి. అతిరథ మహారథులెందరో హాజరై, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ప్రత్యక్షంగా హోమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తన ప్రతినిధి ద్వారా ప్రత్యంగిర అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ వాణీదేవి పాల్గొన్నారు. హర్యాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య హైదరాబాద్ ప్రతినిధులు నాగరాజు, రఘునందన్, భాస్కరమూర్తి, శశి, ఈశ్వర్, వాణిశ్రీ లోకా, వక్కలంక శ్రీనివాస్ ప్రభృతులు హాజరయ్యారు. ★

---

# చరిత్రను గుర్తు చేసిన యాత్ర



'ఇతిహాస సంకలన సమితి' భాగ్యనగర్ శాఖ' ఆధ్వర్యంలో జనవరి 26,2024న గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'ఇతిహాస యాత్ర' నిర్వహించారు. హైదరాబాద్‌లో భారత స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ విమోచన పోరాటంతో ముడిపడి ఉన్న వివిధ ప్రాంతాలను కలుపుతూ కార్యక్రమం జరిగింది. చారిత్రక ప్రదేశాల సందర్శన ద్వారా ఆనాటి జ్ఞాపకాలను చరిత్ర ప్రేమికులకు చూపించడం కోసం ఈ యాత్ర చేపట్టారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ నుంచి ప్రారంభమైన యాత్ర మొదట వారపత్రికా రచయిత షోయబుల్లాఖాన్ హత్య జరిగిన చప్పల్‌బజార్ చేరుకుంది. అక్కడ జాగృతి వారపత్రిక సంపాదకులు డా॥గోపరాజు నారాయణరావు షోయబుల్లాఖాన్ తెలంగాణ స్వాతంత్ర్య విముక్తి కోసం చేసిన పోరాటాన్ని, రజాకార్లచే హత్యకు గురైన విధానాన్ని గుర్చి ప్రసంగించారు. తర్వాత కోఠీలోని 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ స్మారకస్తూపాన్ని దర్శించి నివాళులు అర్పించారు. అనంతరం నారాయణ గూడలోని కేశవ్ మెమోరియల్ విద్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆరెస్సెస్ ప్రాంత కార్యకారిణీ సదస్యులు డా.అన్నదానం సుబ్రహ్మణ్యం, న్యాయమూర్తి కేశవరావు కోరట్కర్, హైదరాబాద్ సంస్థానంలో మాతృభాషలో విద్యాబోధన కోసం ఆయన చేసిన కృషిని వివరించారు. అనంతరం నిజాం నవాబుపై నారాయణరావు పవార్ దాడి చేసిన ప్రదేశం కింగ్ కోఠికి యాత్ర చేరింది. అక్కడ ప్రముఖ తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు దూద్‌బౌలి బాల్‌రెడ్డి మనవడు అల్వాల దేవేందర్‌రెడ్డి, నారాయణ రావు పవార్ ధైర్యసాహసాల గుర్చి ప్రసంగించారు. ఆ తర్వాత ఇతిహాస యాత్ర మహబూబియా కాలేజీకి చేరుకుంది. ఇక్కడ ఆరెస్సెస్ సీనియర్ ప్రచారక్ మల్లికార్జున్, వివేకానంద హైదరాబాదు సందర్శించిన నాటి సంఘటనను గుర్తు చేశారు. ★

# బాలజాగృతి


## తెలుసుకుందాం

## గద్వాల - సంతాన వేణుగోపాలస్వామి ఆలయం



తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల పట్టణంలో ఈ ఆలయం కొలువు దీరింది. ఇక్కడి వేణుగోపాల స్వామిని 41 రోజులు భక్తి శ్రద్ధలతో కొలిచిన వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన స్థలంలోనే హయగ్రీవస్వామి స్వయంభువుగా ఉద్భవించారు. ప్రతి సంవత్సరం మార్గశిర మాసం బహుళ పక్షంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

## కథ | అనాలోచిత చర్య



అనగనగా ఒక ఎలుక, ఒక కప్ప. అవి ఎంతో స్నేహంగా ఉండేవి.

ప్రతి ఉదయం కప్ప చెరువులో నుంచి బయటికి వచ్చి దగ్గరలోని ఒక చెట్టు కింది కలుగులో నివాసం ఉండే ఎలుక దగ్గరకు వెళ్లి మధ్యాహ్నం వరకూ దానితో సరదాగా గడిపి తిరిగి వచ్చేది.

ఎలుక కూడా తన స్నేహితునితో ఎంతో సరదాగా ఉండేది.

అతని కోసం ఎదురు చూసేది, కానీ వారి మధ్య కూడా గొడవలు వస్తాయని ఊహించ లేదు. శత్రువుగా మారుతుందని అస్సలు అనుకోలేదు. దీనికి కారణం ఒక్కటే.. 'ప్రతిరోజూ నేనే వెళుతున్నాను గాని నా దగ్గరికి ఎలుక రావడంలేదు' అని కప్ప భావించడమే.

ఒకరోజు మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సమయంలో ఎలుకకు బుద్ధిచెప్పాలనుకుంది కప్ప.

దానితో మాట్లాడి తిరిగి వచ్చేముందు తన కాలికి, ఎలుక తోకకి కలిపి తాడు కట్టింది.

తర్వాత గెంతుతూ తను ఉన్న చెరువు వైపు వెళ్లింది.

కప్ప నీటి దగ్గరికి చేరుకుంటోంది.. ఇంతలో ఎలుక తన తోకకు కట్టిన తాడును కొరికి తెంచబోయింది.

కానీ దానివల్ల కాలేదు. దాంతో తప్పనిసరై

## పద్యం

ప్రేమను గూర్చి యల్పునకు బెద్దతనంబును దొడ్డవానికిం
దామతి తుచ్ఛపుంబని నెదం బరికింపక యీయరాదుగా
వామకరంబుతోడ గుడువం గుడిచేత నపాన మార్గముం
దోమ వచ్చునే మిగుల దోచని చేతలు గాక భాస్కరా!

**భావం :** భాస్కరా! లోకంలో నీచునకు గొప్ప పదవిని, గొప్పవానికి చిన్న పదవి నిచ్చి పనులు చేయించుచో ఆ పాలనమంతయు ఆలోచన లేక ఎడమ చేతితో భుజించుటయును, కుడి చేతితో మల మూత్రములు శుభ్రపరచుటయును యగును.

## శ్లోకం

'కార్యార్థీ భజతే లోకే...'

'కార్యార్థీ భజతే లోకే యావత్కార్యం న సిద్ధ్యతి
ఉత్తీర్ణేచ పరేపారే నౌకయా కిం ప్రయోజనమ్'

**భావం :** అవతలి వారితో పని ఉన్నంత వరకు పొగడ్తలతో ముంచెత్తుతారు. ఆ తరువాత కన్నెత్తి చూడరు. నదిని దాటిన తరువాత నావతో పని ఏముంది?.. అంటే 'ఏరు తాటాక తెప్పను తగలేయడం' అనే నానుడి.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ముఖము | - కబ్బము |
| సందేహము | - దిటము |
| యువతి | - సిరి |
| దృఢము | - సందియము |
| కావ్యము | - ఉవిద |
| శ్రీ | - మోము |

**జవాబులు :** 'ముఖము – మోము 'సందేహము – సందియము 'యువతి – ఉవిద 'దృఢము – దిటము 'కావ్యము – కబ్బము 'శ్రీ–సిరి

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### గోపబంధు చౌదరి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక కార్యకర్త. **1895** మే **8**న ఒడిశాలోని కటక్‌లో జన్మించారు. సహాయనిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమంలో భాగంగా అనేకసార్లు జైలుపాలయ్యారు కూడా. స్వాతంత్ర్యానంతరం. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొని, ఎందరినో చైతన్యవంతుల్ని చేశారు. **1958** ఏప్రిల్ **29**న తుదిశ్వాస విడిచారు.



కప్ప వెనగ్గా వెళ్లాల్సి వచ్చింది.

నీళ్లలోకి కప్ప దిగగానే వెంటనే ఎలుక ఎగిరి దాని వీపు మీద కూర్చుంది.

నీళ్లలో అలా కొద్దిదూరం వెళ్లగానే ఎలుక బరువును కప్ప మోయలేకపోయింది.

వీరి తంతు చూస్తున్న ఒక గ్రద్ద పైనుంచి రివ్వున వచ్చింది. ఎలుకను తన బలమైన కాళ్లతో పట్టి చెట్టుమీదికి తీసుకెళ్లింది.

దాని తోకకు తన కాలిని కట్టి ఉన్న కప్ప కూడా ఎంత ప్రయత్నించినా కట్టు తెంచుకోలేక పోయింది.

దాంతో అది కూడా ఎలుకతో పాటు చెట్టు మీదికి చేరింది.

కప్ప అనాలోచిత చర్యకు ఇద్దరూ గ్రద్దకు ఆహారమయ్యారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో కొబ్బరిని ఎక్కువగా పండించే రాష్ట్రం ఏది?
2. గులాబీ రంగులో చెమటను విడుదల చేసే జంతువు ఏది?
3. కుక్కలు లేని దేశమని దేనిని పిలుస్తారు?

జవాబులు : 1. కేరళ 2. హిప్పోపొటమస్ 3. ఐస్‌లాండ్

## మెదడుకు మేత

తెర తెరిస్తే ముత్యాల పేరు.. ఏమిటది?

జవాబు : దానిమ్మ

## మంచిమాట


**పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేము.**

– స్వామి వివేకానంద



# వారఫలాలు

**05-11 ఫిబ్రవరి, 2024**




సింహంభట్ల సుబ్బారావు

6300674054


### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆదాయం కొంత పెరిగి అవసరాలు తీరతాయి. ధార్మిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. కాంట్రాక్టర్లకు మరింత ఉత్సాహవంతంగా గడుస్తుంది. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలమవుతాయి. వ్యాపారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. కళాకారులు, క్రీడాకారులు, పరిశోధకులకు ఆహ్వానాలు అందుతాయి. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. శారీరక రుగ్మతలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొన్ని కార్యక్రమాలలో కొంత జాప్యం జరిగినా పూర్తి చేస్తారు. . కొత్త కాంట్రాక్టులు పొందుతారు. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. పారిశ్రామికవర్గాలు, కళాకారులు, పరిశోధకుల యత్నాలు సఫలం. 9,10 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

పరిచయాలు పెరుగుతాయి. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణాలు, సమస్యల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు, భూములు కొనుగోలు ఉద్యోగులకు ఊహించని బాధ్యతలు దక్క వచ్చు. పారిశ్రామిక వేత్తలకు మరింత అనుకూల పరిస్థితులు. 10,11తేదీల్లో వ్యయప్రయాసలు. కుటుంబ సభ్యులతో తగాదాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అనుకున్న కార్యక్రమాలు స్నేహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆదాయం గతం కంటే కాస్త పుంజుకుంటుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలుచేస్తారు. విద్యార్థులకు కొంత ఊరట లభిస్తుంది. పరిచయాలు మరింత పెరుగుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులు, రచయితలకు శుభవార్తలు అందుతాయి. 6,7తేదీల్లో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. అంజనేయ దండకం పఠించండి.

### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అనుకున్న కార్యక్రమాలు సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో ప్రత్యేక గౌరవం పొందుతారు. ఆశించిన రాబడి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థుల యత్నాలు కాస్త ఫలిస్తాయి. వ్యాపారులకు లాభాలు, పెట్టుబడులు సమకూరతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలు, రచయితలకు కీలక సమాచారం అందుతుంది. 5,6 తేదీల్లో శారీరక రుగ్మతలు. సోదరులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

లక్ష్యాల సాధనలో ముందడుగు వేస్తారు. సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. కుటుంబంలో చికాకులు తొలగి ఊరట చెందుతారు. నిరుద్యోగుల శ్రమఫలించే సమయం. వాహనాలు, ఇళ్లు కొనుగోలు యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు శ్రమ ఫలిస్తుంది. 8,9తేదీల్లో బంధువులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆదిత్య హృదయం పఠించండి.

### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

శ్రమానంతరం కార్యక్రమాలు పూర్తి కాగలవు. ఆత్మీయులతో అకారణంగా విభేదాలు నెలకొనవచ్చు. ఆలోచనలు స్థిరంగాఉండవు. ఆధ్యాత్మిక కార్య క్రమాలలో పాల్గొంటారు. ఆదాయ,వ్యయాలు సమానంగా ఉంటాయి. ఆస్తుల వ్యవహారాలలో ఒప్పందాలు వాయిదా పడవచ్చు. ద్యోగులకు కొద్దిపాటి చికాకులు ఎదురుకావచ్చు. 7,8 తేదీల్లో శుభవార్తలు. విష్ణుధ్యానం చేయండి.

### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సన్నిహితులు మీకు మరింత చేదోడుగా నిలుస్తారు. ఆస్తి విషయాలలో సమస్యలు తీరతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటినిర్మాణ యత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులకు గతం కంటే మెరుగ్గాఉంటాయి. పారిశ్రామికవర్గాలు, రచయితలు, శ్రమ ఫలి స్తుంది. 10,11 తేదీల్లో ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సమస్యలు ఎదురైనా క్రమేపీ తొలగుతాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. ఆస్తుల విషయంలో కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలలో కదలికలు. వ్యాపారులకు మరింత అనుకూల పరిస్థితి ఉంటుంది. రాజకీయ, పారిశ్రామివర్గాలు, పరిశోధకులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 6,7తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

వీరికి పట్టింది బంగారమే అన్నట్లుగా ఉంటుంది. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు విశేష గుర్తింపు పొందుతారు. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగాఉంటుంది. 10,11తేదీల్లో కుటుంబ సభ్యులతో విభేదాలు. అశాంతి. లక్ష్మీస్తుతి మంచిది.


### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

నూతన ఉద్యోగయత్నాలు సానుకూలం. అదనపు ఆదాయం సమకూరుతుంది. సన్నిహితుల నుంచి ధనలాభ సూచనలు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. విద్యార్థులకు కాస్త ఊరట లభిస్తుంది. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో కొత్త ఆశలు. ఉద్యోగులకు నిరుత్సాహం. కళాకారులు, రచయితలు, అవకాశాలు అప్రయత్నంగా దక్కవచ్చు. 8,9 తేదీల్లో వృథాఖర్చులు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో అధిగమిస్తారు. ఆదాయం మెరుగ్గా ఉంటుంది. అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేసే వరకూ విశ్రమించరు. వ్యాపారులు సంస్థలను లాభాల దిశగా నడిపిస్తారు. ఉద్యోగులకు ఇంతకాలంగా ఉన్న గందరగోళం తొలగుతుంది. పారిశ్రామికవర్గాలకు మరింత ప్రోత్సాహం. రచయితలు, కళాకారులకు కాస్త అనుకూలత ఉంటుంది. 5,6 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. అనుకోని ప్రయాణాలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

# పదరసం-450



### ఆధారాలు

**అడ్డం**

1) పాము, నిచ్చెనల ఆట (5)
4) అరుచి, వెక్కసం (3)
5) పొట్ట (2)
6) తిరగబడ్డ గొంగళి (3)
7) నిర్మూలన, నాశనం (4)
9) ఇంతకీ (వాడుక భాషలో) (4)
10) ప్రథమా విభక్తి (4)
12) ప్రాణం ఉన్నది (2)
14) గర్వం, గొప్పలు (3)
16) యోగ్యత, అర్హత సరిగా లేదు (3)
17) విడదీయరాని, తేల్చలేని సమస్య (4)
19) తెనాలి రామలింగని బిరుదు (5)
21) 1857లో...తిరుగుబాటు జరిగింది (4)
22) చెదరిన మత్తు (2)
23) 'త' గుణింతంలో ....తీసుకురా (1)
24) అంగీకారం (3)

**నిలువు**

1) మేలుకొలుపు వాడు (5)
2) బట్టీ సరిగా పట్టలేదు (3)
3) పుస్తె సరిగా లేదు (4)
4) చంద్ర కాంతి (3)
7) సుభాశ్చంద్రబోసు ఇలా పిలుస్తారు (3)
8) శివలింగముండే పీఠం పైకొచ్చింది (4)
9) పరిపాలనలో ఉన్న రాజ్య భూభాగం (4)
11)...దాడి అంటే అన్నివైపుల నుంచి వచ్చేది (3)
13) భారతాన్ని తెనిగించినవారు విడిపోయారు (4)
15) తుంటరి,పోకిరి తలక్రిందులైనాడు (4)
17) పిసినారి (3)
18) నిశ్చయంకాని చిత్తుప్రణాళిక (4)
20) ఖేదం, దుఃఖం (3)

### పదరసం - 446 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ట[1] | తు | కు[2] | త | య[3] | వు | | సే[4] | | ఊ[5] |
| లు | | తం | | లా | | అ[6] | వ | స[7] | తం |
| సా[8] | యం | త్రం | | ల | | వ | | ద | |
| కు | | | య[9] | జ | మా[10] | ని | | పా | |
| | వి[11] | వ | క | | ని | | వే[12] | సం | గి[13] |
| సై[14] | | | ప్ర[15] | తి | ని | ధి[16] | | | రా |
| | అ[17] | | శ్న | | | క్క | | రా[18] | టు |
| రాం[19] | బూ | లా | లు | | గో[20] | రిం | టా | కు | |
| | ధ | | | బా[21] | | చు | | మా[22] | కు |
| | బీ[23] | జ | గ | ణి | తం | | నా[24] | రి | |

### పదరసం-447 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| నె[1] | మ | లి | | | క[2] | ళ్లా | క[3] | ప | టం[4] |
| చ్చె | | | సం[5] | క | టి | | ప్పం | | క |
| లి[6] | మా[7] | ట | తో | | క | | | పం[8] | కా |
| | లి | | షం | | చీ[9] | ద | ర[10] | | ల |
| అ[11] | మి | తం[12] | | ఊ[13] | క | | బీ[14] | ద[15] | |
| భ | | తు[16] | ట్టి | | టి[17] | మే | | ప్సి[18] | పి |
| యం[19] | త్రం | | | స[20] | | | శం[21] | క | |
| | | తె[22] | గు | వ | | రో[23] | త | | టా[24] |
| అం[25] | గ | డి | | | స్సు[26] | | ను[27] | డు | వు |
| తు | | ట[28] | భృ | వా | హ | ను | డు | | టా |

### పదరసం - 448 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ప[1] | తం | జ[2] | లి | | క[3] | ర్ర | పెం | డ[4] | లం |
| ర్య | | ల | | న[5] | లి | | | బ్బు | |
| వ[6] | రూ | ధి | ని[7] | | మి[8] | రి | ఓ[9] | | దా[10] |
| సా | | | వా[11] | పు | | | న | | గు |
| నం[12] | ధా[13] | మా | స | | ఆ[14] | | మా[15] | రు | డు |
| | న్య | | యో[16] | గ | క్షే | మా | లు | | మూ |
| నా[17] | అ | రో[18] | గ్యం | | ప | | | సం[19] | త |
| మి | | క | | ర[20] | ణ | పెం[21] | కి | | లు |
| క[22] | కే | లి | పో[23] | | | రి | | క[24] | |
| అ | | | క[25] | ల్ల | | తి[26] | మ్మ | రు | సు |

### పదరసం-449 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పె[1] | ను | భూ[2] | తం | | అ[3] | తి | వి[4] | న | యం[5] |
| ట్టు | | మి | | కా[6] | | | జ్ఞ | | మ |
| ట[7] | త | క | నే[8] | ర్చి | న | వా[9] | డు | | యో |
| డి | | | ర | | | డు | | ల[10] | అ |
| | వా[11] | స[12] | క | స[13] | జ్జి | క | | | |
| అ[14] | | నా | | యో | | | ప[15] | స[16] | రు |
| స | | అ[17] | యో[18] | ధ్య | | అ[19] | | ల | |
| మ్మ | | | జ | | | ప[20] | రి | హా | సం[21] |
| తి[22] | రు[23] | వ | నం | త[24] | పు | రం | | | పం |






ఎప్పటిలానే ఈ యేడాది కూడా గణతంత్ర దినోత్సవానికి ఓ రోజు ముందు కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. విశేషం ఏమంటే ఈ యేడాది సినిమా రంగానికి చెందిన ప్రముఖులకు ఇద్దరికి పద్మ విభూషణ్, అయిదుగురికి పద్మ భూషణ్, ఒకరికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. ఇవాళ సినిమా రంగం, అందులోని వ్యక్తుల ప్రభావం సమాజం మీద ఎంత ఉందనే అంశాన్ని గుర్తించాల్సి ఉంది. ఇది ఓ రకంగా రాబోయే తరాలకు చెందిన సినీ జనాలకు ఓ కనువిప్పు కావాలి. తద్వారా వారు మరింత బాధ్యతతో మెలిగేలా చేయడమే ఈ ఎంపిక లక్ష్యం కూడా కావచ్చు.



వైజయంతిమాల   ప్యారేలాల్   చిరంజీవి   దత్తాత్రేయ అంబాదాస్   మిథున్ చక్రవర్తి   విజయ్‌కాంత్   ఉషా ఉతప్   నిర్మల్ రిషి

# సినీ కొలనులో విరిసిన పద్మాలు!

ఈ సారి పద్మ విభూషణ్‌కు ఎంపికైన ఐదుగురిలో ఇద్దరు సినిమా రంగానికి చెందిన వారే కావడం విశేషం. 90 సంవత్సరాల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా కళల పట్ల అభినివేశాన్ని కనబరుస్తున్న వైజయంతిమాల బాలి ఒకరు కాగా రెండో వారు చిరంజీవి. బాల్యంలోనే శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించి, పదమూడేళ్ల ప్రాయంలో నటిగా కెరీర్ మొదలు పెట్టారు వైజయంతి మాల. 1949లో 'వళ్కై' తమిళ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అదే చిత్రం తెలుగులో 'జీవితం' పేరుతో రీమేక్ అయ్యి 1950లో విడుదలైంది. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలుకు తెలుగులో వచ్చిన 'సంఘం'లోనూ ఆమె నటించారు. ఆపైన ఆమె తమిళ, హిందీ చిత్రాలకే ఆమె పరిమితమయ్యారు. అప్పట్లో దక్షిణాది కథానాయికలు ఉత్తరాదిన అడపాదడపా చిత్రాలలో నటిస్తుంటే... పూర్తి స్థాయిలో బాలీవుడ్‌లో జయకేతనం ఎగరేశారు వైజయంతి మాల. దాదాపు మూడు దశాబ్దాల పాటు కథానాయికగా హిందీ చిత్రాలపై తనదైన ముద్ర వేశారు. డాక్టర్ బాలిని వివాహం చేసుకున్న తర్వాత నటనకు స్వస్తిపలికి, కాంగ్రెస్ పార్టీ తరపున రెండుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యురాలిగానూ తన సేవలను అందించారు. రాజీవ్ గాంధీ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ తీరుతెన్నులు నచ్చక రాజీనామా చేసి బీజేపీలో చేరారు. మూడు నాలుగు దశాబ్దాలుగా నటనకు దూరంగా ఉన్నా, తనకిష్టమైన నాట్యాన్ని మాత్రం ఆమె వదిలిపెట్టలేదు. ఓపిక ఉన్నంత వరకూ నృత్య ప్రదర్శనలు ఇస్తూనే వచ్చారు. ఐక్యరాజ్యసమితిలో భరతనాట్యం చేసిన తొలి భారతీయురాలు వైజయంతిమాల . 1968లో పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఆమెను 2024కు కేంద్రప్రభుత్వం పద్మ విభూషణ్‌కు ఎంపిక చేసింది.

ఇదే పురస్కారం అందుకోబోతున్న మరో నటుడు చిరంజీవి. తెలుగు సినిమా రంగంలో స్వయంకృషితో అగ్రస్థానం చేరిన ఆయన, సహాయక పాత్రలు, ప్రతినాయకుడి పాత్రలు చేస్తూ ఆపైన సోలో హీరోగా ఎదిగారు. కెరీర్ ప్రారంభంలో నృత్య, పోరాట దృశ్యాలతో యువతను తనవైపు తిప్పుకున్న ఆయన, మహానటుడు నందమూరి తారకరామారావు తర్వాత ఆ స్థాయి స్టార్ డమ్‌ను అందుకున్నారు.ఆయన బాటలోనే సాగుతూ ప్రజారాజ్యం పార్టీ పెట్టినా, ఆశించిన స్థాయిలో ప్రజల నుండి మద్దతు పొందలేక పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేశారు. రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా సేవలు అందించారు. కేవలం నటుడిగానే కాకుండా చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


కరోనా సమయంలో సినీ కార్మికుల కష్టనష్టాలను గుర్తెరిగి వారికి సాయం చేస్తున్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. విశేషం ఏమంటే... తెలుగులో ఈ పురస్కారాన్ని ఇంతవరకూ కేవలం అక్కినేని నాగేశ్వరరావు మాత్రమే అందుకున్నారు. సినిమా రంగంలోనూ పద్మ విభూషణ్ పురస్కారం పొందిన వారు బహు అరుద. దక్షిణాదిలో అక్కినేని, రజనీకాంత్ తర్వాత ఈ పురస్కారం అందుకుంటోంది చిరంజీవే!




ఈ యేడాది పద్మభూషణ్ పురస్కారాలను 17కి ప్రకటించగా, అందులో ఐదుగురు సినిమా రంగానికి చెందిన వారు ఉన్నారు. జాతీయ ఉత్తమనటుడు మిథున్ చక్రవర్తి తన డాన్స్‌తో రెండు తరాలను, యాక్టింగ్‌తో మూడు తరాలను ఆకట్టుకున్నారు. తెలుగులోనూ 'గోపాల గోపాల' చిత్రంలో నటించారు. 'స్వామి వివేకానంద' చిత్రంలో రామకృష్ణ పరమహంస పాత్ర పోషించినందుకుగానూ ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు. మరణానంతరం పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన తమిళనాడుకు చెందిన విజయ్‌కాంత్ నటుడిగానే కాకుండా రాజకీయనేతగా తనదైన ముద్రను వేశారు. 'కెప్టెన్' అని అభిమానులు ప్రేమగా పిలుచుకునే విజయ్‌కాంత్ అనువాద చిత్రాలతో తెలుగువారికీ సుపరిచితులే. పాప్ సింగర్‌గా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు పశ్చిమబెంగాల్‌కు చెందిన ఉషా ఉతప్. తెలుగులోనూ గాయనిగా ఆమెకు మంచి పేరుంది.


'కీచురాళ్ళు, రేసుగుర్రం, తిక్క' వంటి చిత్రాలలో ఆమె పాడిన పాటలు శ్రోతల ఆదరణ పొందాయి. అలానే ప్రముఖ జంట సంగీత దర్శకులు లక్ష్మీకాంత్ – ప్యారేలాల్' పలు విజయవంతమైన హిందీ చిత్రాలకు స్వరరచన చేశారు. వీరు తెలుగులో నాగార్జున నటించిన 'మజ్ను', 'నేటి సిద్ధార్థ' చిత్రాలకు సంగీతం అందించారు. లక్ష్మీకాంత్ కొద్దికాలం క్రితం కన్నుమూశారు. ఈ జోడీలోని ప్యారేలాల్ శర్మకు ఇప్పుడు పద్మభూషణ్ పురస్కారం లభించింది. మరాఠీ చిత్రసీమలో నటుడిగా, దర్శకుడి గుర్తింపు తెచ్చుకున్న దత్తాత్రేయ అంబదాస్‌కూ పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించారు. ఇక పంజాబీ చిత్రసీమలో తనదైన ముద్రవేసిన నటి నిర్మల్ రిషిని కేంద్రం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు








| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.220/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.250/- | వెల : ₹.250/- |

















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.360/- | వెల : ₹.100/- | వెల : ₹.200/- | వెల : ₹.100/- | వెల : ₹.150/- |












| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.799/- | వెల : ₹.499/- | వెల :₹.495/- | వెల : ₹.799/- | వెల : ₹.549/- |

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 13

